RNI No. APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 21 Issue No. 6 Monthly June 2024 ISSN No. : 2456-4702 Rs. : 15/-



## శ్రీరంగం శ్రీనివాసరావు

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)




# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

Mail : bhavaveena2024@gmail.com

Cell : 9949929674, 7989088274

# BHAVAVEENA

(MONTHLY MAGAZINE)

Journal - Arts, Literature, Cultureand Language Study

ISSN No. : 2456-4702

RNI No. APTEL/2003/12253

| | | |
|---|---|---|
| ముద్రణ | : | **జూన్ – 2024** |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ. 15/–** |
| కాపీలకు | : | **డి.నెం. 135–14–716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు – 034.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు – సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **డి.నెం. 135–14–716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు – 034.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్, గుంటూరు జిల్లా.** సెల్ : 9494 660 509. |




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

*Founder :*
Kolla Sri Krishnarao (Late)

*E-mail :*
bhavaveena2024@gmail.com

7989781963
9949929674
7989088274

# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**Vol. 21 - Issue : 6 - June 2024 - ISSN No.: 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs.: 15/-**



**EDITORIAL BOARD**

*Honourable Editor*
**Dr. PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu), Ph.D.,***

*Chief Editor*
**Dr. PAYARDA NAGAIAH**
***M.A.(Tel), M.A.(Pol-Sci.)., M.Ed., Ph.D.,***
# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**ADVISORY COMMITTEE**

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Vice Chancellor,
   Dravidian University, Kuppam, A.P
2. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
   HOD, Dept. of Telugu,
   Hyderabad Central University, Hyderabad, Telangana.
5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) Ph.D
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   Associate Professor, Dept. of Telugu &
   Chairman, BOS Philothrophy& Religion Studies,
   Andhra University, Visakhapatnam.
7. **Prof. T. Ramaprasad Reddy**
   Dean, Faculty of Arts & Education,
   Yogi Vemana University Kadapa, Andhra Pradesh.
8. **Dr. T. Swaruparani,** M.Sc., M.Ed., M.Phil., Ph.D.
   Principal,
   St Joseph's College of Education for Women,
   Sambasivapet, Guntur, Andhra Pradesh.

**ASSOCIATE EDITORS**

1. **Prof. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.

3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Prof. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Professor, Dept. of Telugu
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Prof. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Prof. N. Eswar Reddy,** M.A., PhD.
Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P. R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46.
Hyderabad. Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGAL ADVISER**

**Pitta Sundara Babu**, ***M.A., B.L.,***
Advocate, Narsapur.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, Guntur- 2 . 9494 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed and Published by Dr. P. Nagaiah, # 135-14-716, Dwaraka Nagar, 12th Lane,
Nagaralu, Guntur - 522034. Cell : 9949929674, 7989088274.
E-mail : bhavaveena2024@gmail.com, Printed at : GLS Graphics, Guntur - 2. Ph. 9494 660 509.

BHAVAVEENA
Vol. 21, Issue. 06, June 2024

భావవీణ

ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

# శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ)

(జననం : 1910 ఏప్రిల్ 30 మరణం : జూన్ 15, 1983)

"మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది
పదండి ముందుకు
పదండి త్రోసుకు
పోదాం పోదాం పైపైకి
కదం త్రొక్కుతూ
పదం పాడుతూ
హృదంతరాళం గర్జిస్తూ
పదండి పోదాం
వినబడలేదా
మరో ప్రపంచపు జలపాతం"

అంటూ కార్మిక లోకాన్ని ఉఱ్రూతలూగించిన విప్లవ జ్వాలు శ్రీశ్రీ ప్రముఖ తెలుగు కవి, విప్లవ కవిగా సాంప్రదాయ కవిత్వాన్నిధిక్కరించిన కవిగా, అభ్యుదయ రచయితల సంఘ అధ్యక్షుడిగా, సినిమా పాటల రచయితగా గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించారు శ్రీశ్రీ. వీరు హేతువాది, నాస్తికుడు.

శ్రీరంగం శ్రీనివాసరావు శ్రీశ్రీగా సుపరిచితుడు. వీరు 1910 ఏప్రిల్ 30న పూడిపెద్ది వెంకటరమణయ్య, అప్పలకొండ దంపతులకు విశాఖపట్నంలో జన్మించారు. వీరిని శ్రీరంగం సూర్యనారాయన దత్తత తీసుకోవడం వల్ల వీరి ఇంటిపేరు శ్రీరంగంగా మారింది. వీరి ప్రాథమిక విద్యాభ్యాసం విశాఖపట్నంలో జరిగింది. వీరు 1925లో ఎస్.ఎల్.సి పాసయ్యాడు. అదే సంవత్సరంలో వెంకట రమణమ్మతో వివాహం అయ్యింది. 1931లో మద్రాసు విశ్వవిద్యాలయంలో బి.ఏ పూర్తిచేశారు. 1935 సంవత్సరంలో విశాఖలోని ఎ.వి.ఎస్. కాలేజిలో ఉద్యోగంలో చేరాడు. తరువాత 1938లో ఆంధ్రప్రభలో సబ్ ఎడిటర్‌గా చేరాడు. ఆ తరువాత ఆకాశవాణి ఢిల్లీలోను, నిజాం నవాబు వద్ద ఆంధ్రవాణి పత్రికలో వివిధ ఉద్యోగాలు చేశాడు. శ్రీశ్రీ రచించిన "మహాప్రస్థానం" తెలుగు సాహిత్య దశ, దిశలను మార్చేసిందని చెప్పవచ్చును. శ్రీశ్రీ గొప్ప సినీ రచయితగా గొప్ప పేరు ప్రఖ్యాతులను సంపాదించుకున్నారు.

శ్రీశ్రీకి సంతానం లేకపోవడంతో 1950 లో సరోజను రెండవ వివాహం చేసుకున్నారు. వీరికి నలుగురు పిల్లలు. వీరికి కొడుకు వెంకట్, ముగ్గురు కుమార్తెలు. మాల, మంజుల, మంగళ చివరి అమ్మాయి మాల మద్రాసు హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా పనిచేశారు.

శ్రీశ్రీ 1955లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ తరపున విస్తృత ప్రచారం చేశారు. అదేవిధంఆ 1969లో తలెత్తిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తీవ్రరూపంలో ఉన్న సమయంలో శ్రీశ్రీ వావిరాల గోపాలకృష్ణయ్యాతో కలసి సమైఖ్య ఉద్యమంలో చాలా చురుగ్గా పాల్గొన్నారు.

శ్రీశ్రీ తన రచనా వ్యాసంగాన్ని తన పదవ ఏటనే ప్రారంభించాడు. తను వ్రాసిన మొదటి గేయాల పుస్తకం తన ఎనిమిదవ ఏట ప్రచురించబడింది. తనకు అందుబాటులో ఏదంటే అది కాగితం గాని, సిగరెట్ ప్యాకెట్ వెనుక భాగంలో గానిరాసేవాడు. తన 18వ ఏట 1928లో 'ప్రభవ' అనే కావ్యంను సాంప్రదాయ పద్ధతిలోనే వ్రాశాడు. తరువాత కాలంలో సాంప్రదాయకమైన గ్రాంథిక శైలి, ఛందస్సు వంటి వాటిని ప్రక్కనపెట్టి వాడుక భాషలో రచనలు చేశారు. 1950లో మహా ప్రస్థానం మొదటిసారి ప్రచురితమైంది. మహా ప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, బాటసారి, భిక్షు వర్షీయసి మొదలగు రచనలు ఆయనను మహాకవిని చేశాయి. ప్రాసకూ, శ్లేషకు శ్రీశ్రీ పెట్టింది పేరు. అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని సఋష్టించడంలో శ్రీశ్రీ మేటి. "వ్యక్తికి బహువచనం శక్తి" శ్రీశ్రీ మహత్తర వాక్యం.

శ్రీశ్రీ మద్రాసులో స్థిరపడడం వల్ల సినిమా రంగంతో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పడ్డాయి. శ్రీశ్రీకి మొట్టమొదటిగా 'ఆహుతి' అనే సినిమాకి పాటలు, డబ్బింగ్ చెప్పే అవకాశం వచ్చింది. ఇది హిందీ సినిమా "నీరా ఔర్ నందా"కి తెలుగు అనువాదం. ఆ తరువాత శ్రీశ్రీ రోహిణి సంస్థ హెచ్.ఎం. రెడ్డి ఆయనకు నెలకు 300 రూపాయలు జీతం ఇచ్చి ఆస్థాన రచయితగా నియమించాడు. ఆ తరువాత కాలంలో పెద్ద నిర్మాతలు, దర్శకులతో పరిచయాలు ఏర్పడ్డాయి. దాంతో శ్రీశ్రీ ఇక వెనుక తిరిగి చూడలేదు. వారు ఎన్నో అద్భుతమైన వైవిధ్య భరితమైన పాటలు వ్రాశారు. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు సినిమాకు అతను వ్రాసిన "తెలుగు వీర లేవరా" అనే పాట శ్రీశ్రీ ఆణిముత్యాల్లో ఒకటి. అంతేకాకుండా శ్రీశ్రీ నిర్మాతగా కూడా మారి "చెవిలో రహస్యం' అనే డబ్బింగ్ సినిమా తీసి బాగా నష్టపోయాడు. ఆ తరువాత కాలంలో శ్రీశ్రీ తన భార్య సరోజతో కలిసి ఎన్నో సినిమాలకు పాటలు, మాటలు రాశారు.

శ్రీశ్రీ వ్యక్తిత్వంలో ఎన్నో విరుద్ధమైన భావాలు, విచిత్రమైన సంఘర&షణలు కనిపిస్తాయి. అతను మొత్తంఆ బహిర్ముఖుడు. తీవ్ర విమర్శలకు, పసితనపు మాటలకు సమంగా ప్రసిద్ధుడు. ఆయనది దాపరికంలేని స్వభావం వల్ల, అదొక చమత్కార ధోరణి అనుకోవడం వల్ల శ్రీశ్రీ స్వపర భేదం లేకుండా కఠోరమైన విమర్శలు, అనవసరమైన వివాదాలకు కారణమైన వాఖ్యలు ఎన్నో చేశాడు. దానికితోడు ఆయన ఆత్మకథ "అనంతం"లో పాఠకులకు మింగుడుపడని విడ్డూరమైన ప్రసంగాలతో నింపాడు. శ్రీశ్రీపై ఎన్ని విమర్శలు వచ్చినా అతనిపై పాఠకాభిమానం ఇసుమంతైనా తగ్గలేదు.

తెలుగు సాహితీ ప్రపంచంలో శ్రీశ్రీ ఓ సంచలనం. తూటాల్లాంటి మాటలతో ఆకలిరాజ్యంపై రక్తాక్షరాలు చిందించిన శ్రీశ్రీ మహా ప్రస్థానంలో తెలుగు సాహిత్యంను కవిత్వాన్ని మరో ప్రపంచంలోనికి తీసుకెళ్లి శ్రీశ్రీ జూన్ 15, 1983లో వారు మన కంటికి కనబడని లోకాన్ని దివికెక్కారు.

- చీఫ్ ఎడిటర్

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | డా॥. ఎన్.గోపి జలగీతం - పర్యావరణం | - డా॥. మంథని శంకరయ్య | 8 |
| 2. | భాగవత తత్వం - జీవన గమనం | - డా॥. పి. విజయకుమార్ | 11 |
| 3. | నవయుగ వైతాళికుడు - గురజాడ అప్పారావు | - డా॥. పి. శ్రీనివాసరావు | 15 |
| 4. | లంబాడాల సంప్రదాయంలో హెూళి పండుగను జరుపుకునే విధానం | - డా॥. లక్ష్మణ్ నాయక్ భానోత్ | 19 |
| 5. | వేయిపడగలు నవలా శిల్పం - ముదిగొండ వీర భద్రయ్య విమర్శ | - సి. బాలమణి | 23 |
| 6. | వైవిధ్యభరిత గీతం మాస్టార్జీ వెన్నెల గానం | - కత్తెరపాక నవీన్ | 26 |
| 7. | 'జన'గామ 'జన' చైతన్య సారథులు - వయ్యా సోదరులు | - రేషపల్లి భానుచందర్ | 30 |
| 8. | ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రముఖ క్రైస్తవ సంఘాల చరిత్ర - సాహిత్య దృక్కోణం | - మరపట్ల రాజు | 37 |
| 9. | ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి నవల 'సర్కారు గడ్డి' - సామాజిక దృక్పథం | - టి. సుబ్రమణ్యం | 43 |
| 10. | మహాభారతంలో దాన వైవిధ్యం | - కుశ్నపెల్లి సురేష్ | 46 |
| 11. | పల్లిపట్టు నాగరాజు 'యాలై పూడ్సింది' కవిత - పరిశీలన | - జి. సరిత | 52 |
| 12. | పాటల బాటసారి 'గోరటి వెంకన్న' | - డా॥. బోయిన్‌పల్లి ప్రభాకర్ | 54 |

# డా॥. ఎన్.గోపి జలగీతం - పర్యావరణం

- డా॥. మంథని శంకరయ్య , అసిస్టెంట్‌ప్రొఫెసర్, తెలుగువిభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

మానవుడు తనచుట్టూ వున్న పరిసరాలు, ఇతర జీవులు కలిసి పర్యావరణమవుతుంది. వాతావరణం వాయు ద్రవరూపాలలో మార్పు చెందుతుంది. మానవుడు తన పరిజ్ఞానముతో కొత్త ఆలోచనలతో ప్రకృతి వాతావరణాన్ని లొంగదీసుకొనే క్రమంలో ఈ పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. పర్యావరణం కాలుష్యం లాంటివి సంభవిస్తున్నాయి. మనిషి మనుగడకు ప్రమాదంగా మారుతున్నాయి. మనిషికి గాలి తర్వాత అత్యంత ప్రధానమైనది నీరు.

డా॥. ఎన్.గోపి గారు "జలగీతం"దీర్ఘ కవితలో నీటి యొక్క ప్రాధాన్యతను తెలియజేస్తూ, వివిధ దశలలో నీటి యొక్క రూపాలను వివరిస్తూ, ఈ కావ్యంను నిర్మించారు. భూగోళంలో మూడు వంతుల నీరు, ఒక వంతు నేల వుంది. మూడు వంతుల నీరు వుంది. నీటిలోలో తొంభై ఏడు శాతం సముద్రాలు ఉప్పు నీటతో వున్నాయి. రెండు శాతం మంచుగా మిగిలినది. ఒక్క శాతం నీరు మాత్రమే ప్రాణకోటికి ఉపయోగకరంగా వుంటున్న విషయాన్ని కవి తెలియపరుస్తూ, ఈ ఒక్క శాతం నీరు పెరుగుతున్న జనానికి అవసరాలు తీర్చాలని తెలిపారు.

నేడు సంభవిస్తున్న పరిణామాలవల్ల భవిష్యత్తులో నీటితో ముప్పు వాటిల్లే ప్రమాదంను గుర్తించి, జలం యొక్క అవసరాన్ని ఈ కావ్యంలో తెలియపరిచినాడు గోపి గారు. జలం లేనిదే మానవ మనుగడ లేదు. నీటి కొరకు ఎన్నో యుద్ధాలు, ఉద్యమాలు జరిగాయి. నేటికి జరుగు తున్నాయని గుర్తు చేసారు. నీటి కొరకు మనిషి చేసే ప్రయత్నాలు, ప్రయోగాలను విపులీకరించారు. మనిషి చేసే కొత్త ఆలోచన ఫలితాన్ని వాటి వల్ల నీరు పాతాళంతోకి వెళ్ళిపోవడం. నీరు, పంటలకు, ఇతర వ్యవసాయ అవసరాలకు తాగడానికి అందక పోవడం వాతావరణంలో కలిగే మార్పుల వల్ల మనిషి ప్రయోగాలు పర్యావరణంపై ఎంతో ప్రభావాన్ని చూపుతుందని తెలిపారు.

మట్టి కలిపి కుండను చేయడానికి పిండి కలిపి రొట్టెను, చేయడానికి ప్రతి వృత్తులకు ప్రధానమైనది నీరు. ఈ నీరు మూడు దశలల్లోకి మారుతుంది. నీరు ఘనీ భవించినపుడు మంచుగాను భాష్పీభవించినపుడు ఆవిరి గాను, ద్రవీభవించినపుడు నీరుగాను మారుతుంది. వాతావరణం గాలి, సాంద్రత, ఉష్ణోగ్రతల ఆధారంగా ఈ మార్పులు సంభవిస్తాయి. ఆషాడంలో మేఘాలు కురువడం వలన నదులు పారుతాయి. చెరువులు నిండుతాయి. ఇలా పారే నీరును పోతన పద్యంతో పోల్చాడు గోపిగారు. ఇలా భూమి ఉపరితలంపై పొంగిపొర్లె నీరు. మనిషి తన తెలివిని ఉపయోగించి పర్యావరణంను దెబ్బదీయడంవల్ల గొట్టం బావులు వేయడం వల్ల భూగర్భజలం లోతుల్లోకి పోవడం వల్ల సామాన్య జనాలకు నీరు ఒక్క అపురూప వస్తువుగా మారింది. ఈ విధంగా నేడు జనం నీటి సమస్యలను ఎదుర్కొనవలసివస్తున్నది. ఈ పరిణామాలు తన కవిత్వం ద్వారా తెలియపరుస్తూ, నీటిని పరిపక్షించుకొనే దిశగా మనిషి ప్రయత్నాలు సాగాలని గోపిగారు ఆకాంక్షించారు.

"నీటిని కోరమంటే
జీవసారాన్ని కాంక్షించటం
మనిషీ
నీటిని తెలుసుకోవటమంటే
నిన్ను నువ్వు తెలుసుకోవటమే"

నేటి సమాజమంతా నీటి కొరకు కలత చెందుతుంది. రానున్న రోజుల్లో నీరు అందరికి దొరకడం కష్టమనే విషయాన్ని గ్రహించారు. భూగర్భ జలాన్ని పెంచుకోవల్సిన అవసరం ఏర్పడింది.దానికి అవసరమైయ్యే వాతావరణాన్ని నిర్మించుకోవాలి. ప్రకృతిని అనుకూలంగా మార్చుకోవాలి.

అడవులను పెంపొందించుకోవాలి. మనిషి సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందినదని విర్ర వీగుతే దాని పరి ణామాలు తీవ్రరూపంగా మారే అవకాశం ఎంతో దూరాన లేదని తేల్చి చెప్పాడు గోపిగారు.

ప్రకృతి ప్రసాదించిన నీటిని వినియోగించు కోకుండా, నీటి కోసం భూగర్భంలోని నీటిని విని యోగించడం మనిషి చేసిన పొరపాటు. వర్షం వలన వచ్చిన నీరు పంటలకు సరిపోక పోవడంతో మారు మూల గ్రామీణ ప్రాంత ప్రజలు ఎన్నో అవస్థల్నీ పడుతున్నారు. నేడు కృత్రిమ వాయువులను మేఘాల దరికి పంపించి వర్షాలు కురింపించడం లాంటి చర్యల వలన పర్యా వరణానికి ఎంతగానో ముప్పువాటిల్లిందనే చెప్పాలి. నేడు నీరు ఒక వ్యాపార వస్తువై బహుళజాతి సంస్థల చేతుల్లోకి వెళ్ళిపోయింది. ఈ అంశాలను డా॥ఎన్.గోపి గారు 'జలగీతం' లో చక్కగా వివరించారు.

"జిజ్ఞాసువుగా ఎదిగిన మనిషి
జలస్తన్యాన్ని
క్రూరంగా కుమ్ముతున్నాడు
.............................
.............................
మబ్బుల పొదుగుల్లోంచి
ధారలుగా కురిసిన క్షీరంలా
విషం చిమ్ముతున్నాడు"

నదులు చెరువులు కాల్వలు కుంటలు నీరు లేక ఎండిపోతున్నాయి. నీటి జీవించే జలచరాలు అంత మవుతున్నాయి. జలశయాల్లో ఆహారం పొందే పక్షులకు ఆహారం కరువయిపోతున్నాయి. వర్షాభావం వల్ల ఎండి పోయిన జలాశయాలు ఎడారుల్లా మారుతున్నాయి. తాగునీరు కొరకు ప్రజలు ఎంతో అవస్థలు పడుతున్నారు. ఎంతో దూరం నడిచి తాగునీరు తెచ్చుకోవలసి వస్తుంది. ఇలాంటి పరిస్థితులు గ్రామాలలో నేడు మనకు కన బడుతున్నాయి. ఈ పరిణామాలను డా॥ఎన్. గోపి గారు 'జలగీతం' దృశ్యమానం చేశారు.

"దోసెడు నీళ్ళకోసం
బహు దూరాలు నడిచీ నడిచీ
జలగోళాన్ని మోసుకొస్తున్నట్టు
అమ్మాయి
వొలికిపోకుండా నడువు
ఒక్కచుక్క తక్కువైనా కష్టమే"

రైతు వాన కొరకు ఆకాశంవైపు ఎదురుచూస్తుంటాడు. రైతు తన అనుభవాన్ని తప్పా ఇతరత్రమైనవి ఎరుగడు. పంచాంగాలు, యజ్ఞాలు, దూమాలు, నీటి మబ్బులు సృష్టిస్తామని తను నమ్మడు. నీరు లేక పొలాలు బీల్లు గా మారాయి. ఎద్దులకు నీళ్ళు లేక మేతలేక చనిపోయాయి. ఈ పరిస్థితిని చూసిన కవి హృదయం విలవిల లాడింది.

"అనాది అనాది దగ్ధదృశ్యం
గుండెల్ని కాల్చేస్తుంది"

మనిషి మాయ వల్లనే భూగర్భజలాలు కూడా కలుషిత మయ్యాయి. ఎటు వెళ్ళిన నీటి ఎద్దడి కనబడుతుంది. నేడు నేలను తవ్వితే నీరు రాకుండా అస్థిపంజరాలు బయటపడుతున్నాయని, ఇపుడు నీరంటే బీభత్సరస మంటారు గోపిగారు. మానవునికే కాదు ప్రపంచంలోని ఏ జీవరాశికైనా జలం అవసరమే. జలం లేకుండా ప్రకృతి లేదు. వాతావరణంలేదు. పర్యావరణం లేదు. ప్రకృతిని పర్యావరణాన్ని సంరక్షించుకోవాలంటే ముందు జలంను రక్షించుకోవాలి. జలాన్ని కాలుష్యం కాకుండా కాపాడాలి. ప్యాక్టరీలు విషపూరితమైన నీటిని జలాశయాల్లోకి వెళ్ళకుండా చూడాలి. మనిషి తన స్వార్థంవల్ల భవిష్యత్తు తరాలకు అన్యాయం చేస్తున్నాడు. నీరు పరిశుభ్రంగా వుంటే పర్యావరణం బాగుంటుంది. అడవులు బాగుంటే వానలు కురుస్తాయి. భూమి ఉపరితలం పై ప్రవహించే నీరును అనకట్టలతో నిలుపుకోవాలి. భూగర్భజలాలని భూమిపైకి తేగలగాలి. నీరును అమృతంతో పోల్చారు గోపిగారు. నీరు లేకుండా మనిషి ఒకరోజు మనుగడ సాగించలేడు. మనిషికి జీవితమేలేదు.

"మనిషీ

గుర్తున్నానా
నేను జలాన్ని
తరిగిపోతున్న అమృతాన్ని"

అమృతం దేవతలకు దొరికేదైతే మానవులకు జీవాధారం నీరు. ఈ మానవులను బతాకించే జలమే నిర్మలమైనదంటారు గోపిగారు. నీరు ప్రాణతేజమని అన్ని జంతువులకంటే తెలివైన మనిషి తన తెలివితేటలతో తన కొంప ముంచుకుంటుండని తన స్వార్ధబుద్ధివల్లే జగమంతా నీరు కరువైందని చెబుతారు. నీరు పడుతున్న కష్టాల గురించి వివరిస్తూ,

"కొండలకు తాకి గాయపడ్డా
బాధలను పడ్డాను గాని కుంగాపోలేదు
మెరుపు ఖడ్గాలతో
శరీరం చీలికైనా వెను దిరుగలేదు

ఇక్కడ నీరు తన ఆత్మకథ చెబుతుంది. తన బాధ లను చెబుతుంది. నీరు ప్రాణకోటికి ప్రాణాలు నిలుపడం కొరకు తన ప్రాణాలను బిగియబట్టి బతుకుతున్నదని ఎంతో కష్టాలను అనుభవవిస్తూ మనిషి ప్రాణాలు కాపాడుతున్న నీటిని, పంచ భూతాలు వంచించకున్నా మనుష్యులు వంచించుతున్నారని నీరు వ్యథ చెందుతుంది. మనిషి నదులను గాయపరిచినాడు. చెరువు లను మాయం చేసి హితోపదేశం చెబుతున్నాడని నీరుతో వ్యంగ్యంగా మాట్లాడించాడు గోపిగారు. ఆధునిక నాగరికతలో పొంచివున్న ప్రమాదాలను జాగ్రత్తగా పసిగట్టి మళ్ళీ జలాన్ని ఆవిష్కరించే దిశగా మనిషి ప్రయాణం సాగాలని జల జీవకళలు వెల్లివిరియాలని, కవి ఆకాంక్షిం చారు. వృక్షాలు పెంచి అడవులను పెంచి పరిరక్షించి వర్షాలు సజావుగా కురవడారికి అనుకూలించే విధంగా మనిషి తన దృక్పథాన్ని మార్చుకోవాలని పర్యావరణాన్ని కాపాడుకోవల్సిన అవసరాన్ని తెలిపారు గోపి గారు. "జలగీతం" జలవద్గీతగా భావించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాహితీలోకానికి నీటి యొక్కస్థితిని బోధిస్తూ, భారతీయ పురోగతిని కాంక్షిస్తూ పంచభూతాలలో ఒకటైన నీటిని రక్షించుకోవాలని "జలగీతం"లో డా॥ఎన్.గోపిగారు ఉద్బోధించారు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. ప్రమాదం అంచున జీవ వైవిధ్యం - తోట లక్ష్మణరావు.
2. పర్యావరణం - ప్రాణపథం - గంట జలేందర్‌రెడ్డి.
3. ప్రకృతి - పర్యావరణం - నాగనూరి వేణుగోపాల్.

❖❖❖

# భాగవత తత్వం - జీవన గమనం

- డా॥. పి. విజయకుమార్, అసిస్టెంట్‌ప్రొఫెసర్, తెలుగు విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

శ్రీ కైవల్య పదంబు చేరుటకు భాగవత పురాణాన్ని ప్రతిఫలాపేక్ష రహితంగా రచించిన సహజ పండితుడు పోతన. ఆంధ్రుల మనఃకేదారాలలో భక్తి కవితా బీజాలు నాటిన భక్తి కవితా భగీరథుడు పోతన.

వేదకల్ప వృక్ష విగళితమై శుక
ముఖ సుధా ద్రవమును మొనసియున్న
భాగవత పురాణ ఫల రసాస్వాదన
పదవి గనుడు రసిక భావ విదులు

అన్నాడు పోతన. వేదమనే కల్పవృక్షం నుండి భాగవతం అనే ఫలం జారిపడింది. ఆ ఫలంలోని రసాన్ని రసిక భావ విదులు ఆస్వాదించాలి. పోతన భాగవతాన్ని కల్పతరువుగా భావించి భాగవత వైశిష్ట్యాన్ని చక్కగా వివరించాడు.

శ్రీమంతమై ముని శ్రేష్ఠ కృతంబైన భాగవతంబు సదర్భక్తి తోడ
వినుగోరువారల విమల చిత్తంబుల జెచ్చెర నీశుండు చిక్కుగాక
యితర శాస్త్రంబుల నీశుండు చిక్కునె? మంచి వారలకు నిర్మత్సరులకు
గపట నిర్ముక్తులై కాంక్ష సేయకమును దగిలి యుండుట, మహాతత్త్వ బుద్ధి

బరగ నాధ్యాత్మికాది తాపత్రయంబు
నడచి పరమార్థభూతమై యఖిల సుఖద
మై సమస్తంబు గాకయు నయ్యునుండు
వస్తు వెఱుగంగ దగు భాగవతము నందు

భాగవతం ఒక మోక్ష గ్రంథం. ప్రతి పద్యం నారాణాత్మ పరబ్రహ్మం. భాగవత ముఖద్వారంలోకి ప్రవేశిస్తే చాలు నవవిధ ప్రాకారాలు దాటి ప్రశాంతమైన వాతావరణంలో భగవంతుని సాయుజ్యాన్ని పొందవచ్చు.

జ్ఞానం యొక్క సర్వాధిక్యతను భాగవతం బోధించింది. భక్తిమార్గ మొక్కటే సంసార తరుణోపాయం అని ఉపదేశించింది. విష్ణుభక్తి ప్రతిపాదకత్వమే భాగవత విశిష్టత అని ప్రబోధించింది. శ్రీకృష్ణావతార కథనమే దాని పరమలక్ష్యం అని హితోపదేశం చేసింది.

భాగవతంలో పోతన జగన్నాయక తత్త్వాన్ని భగవంతుని రక్షకత్వాన్ని తెలియజేశారు. ప్రశాంత జీవన విధానంలోని పరమార్థం. జన్మరాహిత్యం, జన్మఛందాలు తొలగిపోవడం, కర్మ సిద్ధాంతం, పూర్వజన్మసుకృత విశేషాలు పాత్రల ద్వారా సామాన్య ప్రజలకు అవగతమయ్యేట్టుగా పాత్రలను సృష్టించాడు.

కావ్యాల ద్వారా నీతిని ఉపదేశించడం మన దేశంలో అనాది సిద్ధమైన ఆచారం. బహుళ ప్రచారంలో ఉన్న ఉత్తమశ్రేణికి చెందిన ప్రాచీన కావ్యాలు ప్రజలలో వేదాల పట్ల, వేదాంత సిద్ధాంతాల పట్ల విశ్వాసం పెంపొందిస్తున్నాయి. ఈ లోకంలో మానవులకు అవసరమైన ఆత్మగౌరవం, అభినివేశం, దృఢ ప్రవృత్తి, కార్యదీక్ష, ధర్మానుష్ఠానం, సాంఘికసేవ, పరోపకారం, ప్రశాంతమైన జీవన విధానం వంటి సద్గుణాలను అవి అతి సుందరంగా, భావగంభీరంగా భాగవతం మనకందించింది.

పరీక్షిత్తు మహారాజు ధర్మమార్గం తప్పకుండా ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతూ రాజ్యాన్ని పాలిస్తున్నాడు. ఒకనాడాయన వచ్చాడు. ముని ధ్యాస సమాధిలో వున్నాడు. మహారాజు దాహబాధలో ముని కదలక మెదలక ఉండడం చూసి, ఆ బాధలో ఆవేశం రాగా సమీపంలో ఉన్న ఒక పాము మృత కళేబరాన్ని ఆయన మెడలో వేసి వెళ్లాడు. కొంతసేపటికి ఆ ముని కుమారుడు శృంగివచ్చి నా తండ్రిని పరాభవించిననవాడు వారం రోజులలో తక్షక సర్పదష్టుడై మరణిస్తాడు అని శపించాడు.

సమాధి నుంచి లేచిన శమీక ముని విషయమంతా గ్రహించి నాయనా! ధర్మ పరిపాలన చేసే ప్రభువును శపించడం అనుచితం. ఆయన ప్రతీకారం చేసుకో

గలడేమో, ఈ శాపానికి, కనుక వెళ్లి ఆయనకు శాప విషయం చెప్పిరా అన్నాడు.

పరీక్షిత్తు శాపం మాట విని రాజధానిని విడిచి, సర్వ భోగాలు పరిత్యజించి గంగానదీ తీరాన దర్భాసనం మీద కూర్చుని శ్రీమన్నారాయణుని ధ్యానిస్తున్నాడు.

ధర్మ ప్రభువు పరీక్షిత్తు దీక్ష విని ఎందరో మునులూ, ఋషులూ అక్కడకు వచ్చారు. వారందరికీ అభి వాదాలర్పించి తన సంకల్పం తెలిపి, ఈ వారంలో వైకుంఠం చేరే మార్గం చెప్పవలసిందని అడిగాడు. అంతలో అక్కడకు శుకయోగి వచ్చాడు. ఆయనను చూస్తూనే ఎదురెళ్ళి నమస్కరించి తీసుకువచ్చి, ఆసీనుని చేసి, ఆయన పాదాలపై పడి, యోగీంద్రా! నా అదృష్టవశాన ఈ సమయానికి వచ్చావు.

ఆవు పాలు పితికే సమయం కంటే ఒక చోట ఆగని మీ దర్శనం కంటే మాబోంట్లకు ఏం కావాలి. నాపై అనుగ్రహం ఉంచి వారం రోజుల వ్యవధిలో నేను శ్రీమన్నా రాయణుని చేరే దారి చూపించండి అని ప్రార్థించగా శకుడు చిరునవ్వుతో

రాజేంద్రా! ఈ ప్రపంచంలో నరజన్మ కంటే దుర్లభ మైనది లేదు. అటువంటి మంచి పుట్టుక దొరికినందుకు జీవితాంతం నారాయణ చరణసేవ చేసుకోవాలి. కాని జీవితంలో సగభాగం నారీసంగమంతో, నిద్రతో, వ్యర్థమై పోతున్నది. మిగిలిన పగటికాలం అంతా పశు, పుత్ర, బంధు, బంధన, రక్షణ కోసం ధనార్జనతో సరిపోతుంది. ఇక వారికి హరినామస్మరణకు అవకాశం లేదే!

అశాశ్వతమైన ధారాపుత్ర ధనాల మీద వ్యామోహం లేకుండా శాశ్వతానందం యిచ్చే శ్రీమన్నారాయణునిపై మనస్సు లగ్నం చేయడం కంటే కోరదగ్గది లేదు.

మా పితృపూజ్యులు బారాయణులు నా మీది అనుగ్రహంతో భాగవతం వినిపించారు, దానినే నేను వినిపిస్తాను అంటాడు శుకమహర్షి.

భాగవత శ్రవణం వల్ల భవబంధాలు తెగి, మోక్ష సామ్రాజ్యం పొందుతాడు. ఎన్ని సంవత్సరాలు జీవించినా హరిస్మరన లేనివాడు పుడుతూ, చస్తూ సంసార సముద్రంలో కొట్టుమిట్టాడుతూనే ఉంటాడు.

నీ మనస్సు సర్వబంధాలు వదిలించుకుంది కనుక నీవు ఆ పురుషోత్తముని గాధలు వినిపిస్తాను. సావధానుడవై విను, నీకు ఏడు రోజుల గడువుంది.

పూర్వకాలంలో ఖట్వాంగుడనే మహారాజు దేవతలకు సహాయపడి రాక్షసులందరినీ సంహరించాడు. దేవతలు సంతోషంతో వరం కోరుకోమన్నారు. అప్పుడాయన యింకా నా ఆయుర్ధాయం ఎంత ఉంది? అని అడిగాడు. రెండు ఘడియలు అన్నాడు.

ఆ మాట వింటూనే ఆయన రాజధానికి చేరి తన సర్వసంపదలు, ధనధాన్యాలు ధారవోసి, భార్యాపుత్ర వ్యామోహబంధం తెంపుకొని శ్రీమన్నారాయణుని పైనే మనసు లగ్నం చేసి మహూర్తకాలం ముగియగానే వైకుంఠం చేరాడు.

బంధనాలు త్రెంచుకున్న వాడికి క్షణకాలం చాలు హరిస్మరణకు అదే ముక్తి హేతువు. నీకు ఏడు రోజుల వ్యవధి ఉంది. ధారణవల్ల కొందరు, యోగీంద్రులై కొందరు మోక్షం పొందుతారు.

ధారణ అంటే ఇక్కడ సర్వబంధాలూ వదలి, ఇంద్రియాలను జయించి, ఉచ్ఛ్వాస నిశ్వాసాలను నియమబద్ధంగా సాగిస్తూ, శ్రీమన్నారాయణుని యందు మనసు నిలిపి, అక్కడే బుద్ధిని కేంద్రీకరించాలి.

విరాట్పురుషుడైన శ్రీహరి యందు లగ్నమైన మనసుకు భూత, వర్తమాన, భవిష్యత్కాలాలో వుండే విశాల విశ్వం అంతా గోచరిస్తుంది.

ఈ శరీరం ఉన్నదే - యిది పృథివి, తేజం, వాయువు, ఆకాశం లాంటి ఏడు ఆవరణలతో నిండి ఉంటుంది. అటువంటి శరీరంలో వైరాజ పురుషుడు ప్రకాశించాలంటే ధారణ కావాలి. అంటే ఆ విరాట్పురుషుడే శతుర్దశ భువనరూపి. సర్వవ్యాపకుడైన ఆయనను మనసులో నిలుపుకున్న వాడే మోక్షగామి.

హరిమయము విశ్వమంతయు

హరి విశ్వమయుండు సంశయము పని లేదా
హరిమయముగాని ద్రవ్యము
పరమాణువు లేదు, వంశపావన, వింటే.

మనిషికి కలలువస్తాయ. ఆ కలలో ఏవో ఆకారాలు చూస్తాడు. తాను ధరిస్తాడు. ఎక్కడెక్కడో తిరుగుతాడు. మెలకువ వస్తుంది. అదంతా కలే అని గ్రహిస్తాడు. అలాగే పరమేశ్వరుడు సర్వజీవకోటిలోనూ వున్నా ఇవేమీ ఆయనను అంటవు.

మహారాజా! ఈ అజ్ఞానం వల్ల ఏవేవో సుఖాలనీ, భోగాలనీ కొట్టుమిట్టాడుతున్నారు. సుఖంగా తినడానికి రెండు చేతులను కలిపితే దోసిలి అవుతుంది కదా, బంగారు పాత్రలు ఎందుకు? అలాగే ఆచ్ఛాదనకు నార చీరలూ, చర్మాంబరాలూ ఉండగా, చీనాంబరాలెందుకు? వానయోగ్యమైన కొండ గుహలెన్నో ఉండగా భవనాలు, సౌధాలు నిర్మించుకోవలసిన అవసరం ఏమిటి?

హాయిగా విశ్రాంతి తీసుకోవాలంటే విశాలమైన పృథివి వున్నదే, నిద్ర కోసం హంసతూలికా తల్పాలు కావాలా!

చెట్లు మంచి రుచిగల పళ్లు నిస్తున్నాయి. స్వాదువులైన జలాలు నదులలో దొరుకుతున్నాయి. అతిథి, అభ్యాగతులకు ఆదరంతో అన్నంపెట్టే పుణ్య సతీమతల్లులున్నారు. ఇన్ని ఉండగా అధికార గర్వాంధులైన ధనమదోన్మత్తుల దగ్గర తలవంచి సేవలు చేయవలసిన దుస్థితి దేనికయ్యా!

"రక్షకులు లేని వారల
రక్షించెదననుచు చక్రిరాజైయుండన్
రక్షింపుమనుచు ఒక నరు
అక్షము ప్రార్థింపనేల ఆత్మజ్ఞులకున్"

అటువంటి నారాయణుని శరణువేడకుండా ప్రాపంచిక తుచ్ఛ సుఖాల కోసం అన్యాయాలూ, అక్రమాలు చేసే వారందరూ నరకద్వారం దగ్గర వైతరణీ నదీతీరంలో తీవ్రాగ్ని జ్వాలా శిఖలలో కాలుతూ ఉంటారు.

విజ్ఞానులై భక్తితో ఉండే వారి సంగతి వేరు. వెన్నెలల చల్లదనం కురిసే చిరునవ్వుల పురుషోత్తముని తమ హృదయలోనే దర్శించడానికి ధ్యానం చేస్తుంటారు.

యతీశ్వరులుంటారు. వారికి ఏ క్షణంలో శరీరం విడిచిపెట్టాలనిపిస్తే ఆ క్షణంలో పద్మాసనం వేసి కూర్చొని ప్రాణవాయువును మనస్సుతో నిరోధించి మనస్సును బుద్ధితో బంధించి దాన్ని జీవునితో చేర్చి ఆ జీవుని ఆత్మలోకి తెచ్చి, ఆత్మను బ్రహ్మ పదార్థంతో ఏకీభవింప జేసి తనువు చాలిస్తారు.

యోగీశ్వరులుంటారు. వీరు పాదాలతో మూలాధార చక్రాన్ని వేధించి ప్రాణాయామంతో నాభిదేశానికి తెచ్చి, క్రమంగా హృదయం దాకా నడిపి, కంఠాన్ని దాటించి భ్రూమధ్యానికి నడిపించి, కనులు, చెవులు, ముక్కు బంధించి, అర్థ ముహూర్తకాలంలో బ్రహ్మరంధ్రాన్ని ఛేదించి బ్రహ్మ ముందు కలుస్తారు.

ప్రాణాలు పోతున్నా ఇంద్రియాలను వశం చేసుకోలేని వారు మరణానంతరం ఈ వాంఛలతో పరిమేష్ఠిలోకం చేరుతారు.

వీరందరిలో ఎవడు పాంచ భౌతిక వికారాలకు లొంగకుండా ఉంటాడు. వాడు ఆనందమయుడై వాసుదేవినిలో లయమవుతారు. ఇది పరమ భాగవతులు అనుసరించే దారి అని శుకమహర్షి పరీక్షిత్ మహారాజుతో చెప్పగా విని పరీక్షిత్ మహారాజు యోగీంద్రా! మీ మధుర వాక్కులతో నాకు సర్వవాంఛలూ వైదొలగాయి. పురుషోత్తముని అవతార లీలలు వినాలనే ఉత్కంఠ కల్గుతుంది అనడంలో భాగవత కథ ప్రారంభమవుతుంది.

ప్రశాంతమైన జీవన విధానంతో ఉన్న దాంతో సంతోషంతో నిరంతరం భగవంతుని మీద ధ్యానం కల్గి ఉండటమే స్వర్గప్రాయం అని భాగవతం స్పష్టం చేసింది.

రంతిదేవుడు ఉదారుడు, దానధర్మాలతో సర్వ సంపదలూ హరించుకుపోగా, భార్యాబిడ్డలతో దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నాడు.

దొరికిన కాయ, పండు, ఆకు తిని, నీరు త్రాగి వారు జీవయాత్ర సాగిస్తున్నారు. ఒకనాడింత అన్నం, నీరు దొరికాయి. అది తిందామనుకుంటుండగా పేద బ్రాహ్మణుడు వచ్చి భిక్ష కోరగా, తన అన్నంలో సగం

యిచ్చి, మిగిలింది ఆరగిద్దామనుకుంటుండగా మరొక పేదవాడు ఆకలితో రాగా సగం పెట్టాడు. అంతలో మరొకడు వేటకుక్కలతో వచ్చాడు. మిగిలిన అన్నం వానికిచ్చి జలపానం చేద్దామనుకుంటుడగా మరొకడు వచ్చి స్వామి దాహం అన్నాడు. మంచినీరు వానికి పోసి దప్పిక తీర్చాడు.

అంతవరకు అన్ని వేషాలతో వానిని పరీక్షించిన బ్రహ్మాది దేవతలు ప్రత్యక్షమై వరం కోరుకొనగా, రంతి దేవుడు 'నా మనస్సు నిరంతరం పరమేశ్వర పాదారవిం సేవయందే లగ్నం కావాలి' అని అర్థించి వారి అను గ్రహంతో పరమపదించాడు. భూతదయ, పరోపకారం, ప్రశాంత జీవనం, దయాగుణం, రంతిదేవుని మోక్ష మార్గమానికి హేతువులయ్యాయి.

ప్రహ్లాదుడు సంతోషంతో ప్రశాంతంగా హరి నామస్మరణ చేసుకున్నాడు. గజేంద్రుడు ఆర్తితో భగ వంతుని చరణు వేడుకున్నాడు. కుచేలుడు సఖ్య భక్తితో శ్రీకృష్ణుని సేవించాడు. ఇచ్చిన మాట, చేసిన వాగ్దానానికి బలి కంకణ బద్ధుడయ్యాడు.

ఏ ప్రాణిని హింసించకుండా దొరికిన దానితో తృప్తిపడి ప్రశాంత జీవన విధానంతో నారాయణుని స్మరించే వారిని ఎవరూ ఏమి చెయ్యలేరు. సర్వం ఆయన కరుణే అనుకునే వారికి ఏ బాధలూ రావు.

అన్ని బాధలకూ హేతువైన మనస్సును నిగ్రహించాలి. సర్వబంధాలూ విడిచి సన్యాసియై ఏ అలజడులూ లేని ప్రశాంత ప్రదేశంలో పద్మాసనం వేసి, వెన్నెముక వంగకుండా తలపైకెత్తి నాసాగ్రాన దృష్టి నిలిపి ఓంకారం జపిస్తూ రేచక, పూరక, కుంభకాలతో ప్రాణాపానాలను నియమించిన వాని మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. అప్పుడది బ్రహ్మానుభూతి పొందుతుంది.

ఈ శరీరం రథం. బుద్ధి సారధి. ఇంద్రియాలు గుర్రాలు. మనసు పగ్గం. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన, నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనం, జయ అనే పది వాయువులూ ఇరుసు. ధర్మాధర్మాలు చక్రాలు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలే సంచార ప్రదేశాలు. జావుడే రథికుడు. ప్రణవమంత్రమే ధనుస్సు. శుద్ధజీవుడు బాణం. దీని లక్ష్యం బ్రహ్మానుభూతి. రాగద్వేషాలే వాని శత్రువులు. అందుచేత యీ శరీర రథాన్ని తన అదుపులో ఉం చుకొని భాగవతుల పాదపద్మసేవ అనే ఖడ్గంతో నారాయణుని అనుగ్రహ బలంతో రాగద్వేషాది శత్రువు లను నిర్మూలించి, శుద్ధ జీవశరీరాన్ని ప్రణవమనే ధనుస్సుకు సంధించి బ్రహ్మాపదం చేరాలి. అలాకాని వాడు ఇంద్రియాలనే గుర్రాలు బుద్ధి అనే సారధిని తమకు అనుకూలంగా త్రిప్పి విషయ సుఖాలనే శత్రువుల మధ్య విడిచిపెడతాయి. అంతలో సంసార కూపంలో పడతాడు. అందువల్ల వాటికి అతీతంగా శ్రీమన్నారాయణ సంకీర్తనం సాగిస్తూ ప్రశాంత జీవన విధానం సాగిస్తూ జన్మచరితార్థం చేసుకోవాలి.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. కరుణశ్రీ : 1983, భాగవత వైజయంతిక (వ్యాస సంకలనం), హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
2. నారాయణరెడ్డి సి : 1983, మందార మకరందాలు, సికిందరాబాదు, యువభారతి.
3. వేంకటశాస్త్రి చెళ్ళపిళ్ళ : 1983, 'బమ్మెర పోతన గారు' భాగవత వైజయంతిక (వ్యాస సంకలనం), (సం. కరుణశ్రీ, హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
4. శ్రీరామమూర్తి కొర్లపాటి : 1984, ఆంధ్రభాగవతావతరణము - చారిత్రక నేపథ్యం, 'పోతన సాహిత్య గోష్ఠి' (వ్యాస సంకలనం), (సం. కొర్లపాటి శ్రీరామమూర్తి), విశాఖపట్నం, ఆంధ్రా యూనివర్శిటి.
5. సంపత్కుమారాచార్య కోవెల : 1982, 'పోతనగారి కావ్య భావన' మహాకవి పోతన (వ్యాస సంకలనం) (సం. అమరేశరం రాజేశ్వరశర్మ, కోవెల సంపత్కుమారాచార్య), హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌర సబంధాల శాఖ.

❖

# నవయుగ వైతాళికుడు - గురజాడ అప్పారావు

- డా॥. పి. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి, ఏలూరు జిల్లా.

గురజాడ అప్పారావు గారు కౌసలమ్మ, వెంకట రామదాసు పుణ్య దంపతులకు 1862 సెప్టెంబరు 21 విశాఖపట్టణం జిల్లా యలమంచిలి తాలూకా రాయ వరంలో జన్మించారు. గురజాడ అప్పారావు గారు ఆధుని కాంధ్ర సాహిత్యానికి యుగకర్త. విప్లవాత్మకమైన మార్పు లను తెలుగు భాషయందు ప్రవేశపెట్టిన ఘనత గురజాడ గారికే దక్కింది. గురజాడ అప్పారావు నవయుగ వైతాళి కుడు, సంఘ సంస్కర్త, మానవతావాది, ప్రగతిశీలి, ప్రతిభావంతుడు. తెలుగు జాతికొక క్రొత్తచూపు, తెలుగు సాహిత్యమునకు ఒక క్రొత్త రూపు ఇచ్చిన మహనీయుడు గురజాడ.

తెలుగులో మొట్టమొదటి సాంఘిక నాటకం కన్యాశు ల్కం, మొట్టమొదటి ఆధునిక కథానిక దిద్దుబాటు రాసిన వారు గురజాడ అప్పారావు. క్రొత్తబాణీలో కవిత్వం చెప్పినవారు గురజాడ వారే. గురజాడ అప్పారావు గారు రచించిన కన్యాశుల్కం ఏడంకముల సాంఘిక నాటకము. ఇది తెలుగులో వెలవడిన మొట్టమొదటి స్వతంత్ర నాటకము. ఇది హాస్యరస ప్రధానమైన నాటకము. కన్యాశు ల్కం నాటకం జీవం, జవము కలిగిన వాడుక భాషల్లో ప్రయోగింపబడింది. గురజాడ వాడుక భాషను సాహిత్య భాషగా గుర్తించి, ప్రయోగించి గౌరవించెను. తెలుగు నాటక రంగమున కన్యాశుల్కం ఒక విప్లవము తెచ్చి పెట్టెను. ఆనాటి దురాచారాలను, మూఢ నమ్మకాలను, సాంఘిక దుస్థితులను గురజాడ బట్టబయలు చేశారు. నాటకములో గిరీశము, మధురవాణి పాత్రలు మరపురాని సజీవ పాత్రలు. గురజాడ రచించిన 'కొండుభట్టీయము' 'బిల్హణీయము' అను మరి రెండు నాటకములు అసంపూర్ణముగా నిలిచిపోయినవి.

గురజాడ రచించిన కథానికలే ఆంధ్రమున మొదటివిగా భావించబడుచున్నవి. దిద్దుబాటు అనునది మొదటి తెలుగు కథానిక. ఈ కథానికను గురజాడ గారు మొదట గ్రాంధిక భాషలో రాసి, పిమ్మట వ్యవహారిక భాషలోకి మార్చి రాశారు. కథను ఒక ఆధునిక సాహిత్య ప్రక్రియగా రూపొందించిన ప్రతిష్ట గురజాడ గారికే దక్కింది. గురజాడ రాసిన కథలు ఐదు మాత్రమే. అవి 1) దిద్దుబాటు, 2) దేవుడు చేసిన మనుషుల్లారా మనుషులు చేసిన దేవుళ్లారా మీ పేరేమిటి? 3) మెటిల్డా 4) పెద్ద మసీదు 5) సంస్కర్త హృదయము.

దిద్దుబాటు అను కథ వస్తువులో, రూపములో క్రొత్తదనము చూపింది. తన సంగతి పట్టించుకొనకుండా పరస్త్రీ వ్యామోహంలో పడిన భర్తను నేర్పుగా చక్కదిద్దిన ఇల్లాలి చుట్టూ నడిచిన కథ 'దిద్దుబాటు'. మౌఢ్య సమాజమును కళ్లకు కట్టించు కథ 'మీ పేరేమిటి'? ఈ కథలో కనువిప్పు కలిగించు పాత్ర నాంచారమ్మ. ముసలి మొగుని పంజరములో పడియున్న పడుచు ఇల్లాలి ఎంత పరాధీనమైనదో తెలుపు కథ 'పెద్ద మసీదు' ఒక సంస్కరణ వాది క్రిందికి దిగజారిన కథయే 'సంస్కర్త హృదయం' ఈ కథలే ఆణిముత్యాలు. గురజాడ ముత్యాల సరాలు పేరుతో మాత్రా చంధస్సు సృష్టించారు. ఈ విధముగా గురజాడ కావించిన కృషి కొనియాడదగినది. గురజాడ స్థానము విశిష్టమైనది.

గురజాడ కొత్త ఛందస్సులో రాసిన ముత్యాల సరాలులో ఉన్న కొన్నింటిని వివరిస్తాను.

## ముత్యాల సరాలు :

ముత్యాల సరాలు అనే కొత్త ఛందస్సులో కొత్త కథా వస్తువులు, సాంఘిక అంశాలు గలవి తీసుకొని కృత్రి మత్వం లేకుండా తెలుగు భాషకి ప్రాముఖ్యం ఇస్తూ, సహజ వర్ణనలతో, తేటైన మాటలతో రాయబడిన కవితల, ఖండకావ్యాల సంపుటి "ముత్యాల సరాలు". లవణరాజు కల, కన్యక, పూర్ణమ్మ, లంగరెత్తుము, డామన్, పితియస్,

దేశభక్తి గేయం, నీలగిరి పాటలు వంటి గొప్ప కవితలు పుస్తకంలో వున్నాయి. అప్పటి వరకు అగ్రవర్ణాల, ధనికుల, మహాపురుషులనబడేవాళ్ళ గాథలే, ఆ పాత్రలే ఉండేవి. గురజాడ సామాన్యులకి, పేదవారికి కూడా తమ కవిత్వంలో పెద్దపీట వేశారు. లవణరాజు కలలో 'మాలేత' కావ్యనాయిక, 'కన్యక'లో సెట్టికూతురు, 'పూర్ణమ్మ'లో పూజారి కూతురు నాయికలు.

గురజాడ వారి జాతీయ ధృక్పథానికి, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి, విశాల దృష్టికి, అభ్యుదయ భావాలకి స్వర్ణపతాక 'దేశభక్తి' అనే గేయం.

"దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వొట్టి మాటలు కట్టి పెట్టోయి
గట్టిమేల్ తల పెట్టవోయి"

అని వ్యవహార భాషలో బుజ్జగిస్తూ - సుతిమెత్తగా మందలిస్తూ ప్రభోదించారు. స్పర్థ విద్యలందే అవసర మన్నారు. మాటలు కాదు చేతలు కావాలన్నారు.

"చెట్టాపట్టాల్ పట్టుకొని
దేశస్థులంతా నడవవలెనోయ్
అన్నదమ్ములవలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయ్"

అని మానవ సమైఖ్యతను చాటి చెప్పారు. శ్రమశక్తిని గౌరవించమన్నారు. సాటి మనిషికి తోడ్పడాలన్నారు.

'లవణరాజు కల'లో ముఖ్య ఉద్దేశ్యం అస్పృశ్యత నివారణ

"మలిన దేహుల మాలలనుచును
మలిన చిత్తుల కధిక కులముల
నెలవొసంగిన వర్ణ ధర్మమ ధర్మంబే

మలిన దేహము కలిగిన వారిని మాలలు అన్నారు. మలినమైన చిత్తము కలిగిన వారిని అధిక కులము అంటారు. ఇలాంటి వాటికి తావు ఇచ్చిన కుల ధర్మం అధర్మమే అని అస్పృశ్యతని నిరసించారు.

మంచి - చెడు అన్నవి రెండే కులాలన్నారు.

'యెల్ల లోకము వొక్కయిల్లై, వర్ణ భేదములెల్ల కల్లై
వేలనెరగని ప్రేమబంధము, వేడుకలు కురియ"

అని సర్వ మానవ సమానత్వాన్ని, విశ్వమానవ ప్రేమను ఆకాంక్షించారు.

"మతములన్నియు మాసి పోవును
జ్ఞాన మొక్కటి నిలచి వెలుగును"

అని భవిషద్దర్శనం చేసింది గురజాడ వారే!

'కన్యక'లో కులంకన్నా గుణం మిన్నా అనీ, అధికారం కన్ను కాననివ్వదని చాటారు. రాచరిక వ్యవస్థ లోపాన్ని, సమాజంలో స్త్రీ దుస్థితిని గురజాడ అద్భుతంగా వర్ణించారు. 'ఒక పట్నంరాజు చెలికత్తెలతో దేవాలయానికి వెళ్తున్న 'కన్యక'ను చూసి చలించి

"పట్ట వలెరా దీని బలిమిని
కొట్టవలెరా మరుని రాజ్యం
కట్టవలె రాగండ పెండెం
రసికమండలిలో" అని బలాత్కరించబోతాడు.

"దేవకార్యం తీర్చివచ్చెద"
"బలిమిని పట్టవలెన? నీదు సొ
మ్మేకాద, కన్నియ"

అని కన్యక, కన్యక తండ్రి అంటారు. అగ్నిసాక్షిగా వివాహం చేసుకోమంటే రాజు రాజ్యగర్వంతో అంగీకరించడు. దేవాలయానికి వెళ్ళి వస్తానని ఆత్మత్యాగం చేసుకుంటుంది. ప్రబంధనాయికలకి పూర్తిగా వ్యతిరేకమైన స్త్రీ పాత్ర ఇది.

ఆత్మత్యాగం చేసుకొనే ముందు ఇలా కర్తవ్యాన్ని బోధిస్తుంది.

"కాసువీసం కలిగి వుంటే చాలుననుకొని
వీర్యమెరుగక, విద్య నేర్చక
బుద్ధిమాలినచో
కలగవా యిక్కట్లు?" అని

మేల్కొని బుద్ధిబలాన్ని పెంచుకోమంటుంది కన్యక. రాజును

"కండకావరమెక్కిన నీ వీ
దుండగము తల పెట్టినందుకు
వుండడా వొక దైవమంటూ
వుండి వూర్కొనునా?" అని నిలదీసి నిందిస్తుంది.

గురజాడ భావ నవ్యతకి, శైలీ నవ్యతకి, రసపోషణా నైపుణ్యానికి నిలువుట్దం పూర్ణమ్మ' ఖండిక. పుత్తడి బొమ్మలాంటి పూర్ణమ్మను తల్లిదండ్రులు డబ్బుకి ఆశపడి ముసలివాడికిచ్చి పెళ్లి చెయ్యాలనుకుంటారు. ఆత్మ త్యాగం ద్వారా పూర్ణమ్మ దుర్గ'లో లీనమైంది. ఇందులో ఇతివృత్తం కాన్యాశుల్క దురాచారామే.

"మేలిమిబంగారం మెలతల్లారా
కలవల కన్నుల కన్నెల్లారా
తల్లులు గన్నా పిల్లల్లారా"

అనే సంబోధనతో ప్రారంభమైన ఈ గేయం ఆత్మ త్యాగం చేసుకొనే ముందు పూర్ణమ్మ

"నలుగురు కూచుని నవ్వే వేళల
నా పేరొకతరి తల వండి
మీమీ కన్నబిడ్డల నొకతెకు
ప్రేమను నా పేరివ్వండి"

అన్నప్పుడు మన హృదయాలు ద్రవించిపోతాయి. గుండెల్లో గుబులు మొదలవుతుంది. దుర్గలో లీనం కావడాన్ని గేయకావ్యములోని చివరి పద్యము.

"కన్నుల కాంతులు కలవల చేరెను
మేలిమి జేరెను మేనిపసల్
హంసల జేరెను నడకల బెడగులు
దుర్గను జేరెను పూర్ణమ్మ"

అని వ్యంగ్య వైభవంతో చెప్పడం గొప్ప పద్ధతి. కన్యక, పూర్ణమ్మ అను ఈ రెండు గేయాల ద్వారా గురజాడ ఆ కాలములో ఇంట, బయట స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను బలంగా వ్యక్తీకరించాడు.

ఆ రోజుల్లో పుట్టింటిలోనే స్త్రీకి రక్షణ లేని స్థితిని వెల్లడించారు. ఆనాడు స్త్రీల జీవితాలు బాల్యంలోనే బుగ్గయిన తీరును, డబ్బుకు ఆశపడి కన్నవారే కసాయిలుగా మారిన దుస్థితిని వివరించారు.

ఇందులో పూర్ణమ్మ కుటుంబం లోపల కుటుంబ వ్యవస్థకు బలైన బాలిక. కన్యక కుటుంబము వెలుపల సమాజ దౌష్ట్యానికి, మగవాడి పశుబలానికి బలై ప్రాణ త్యాగం చేసిన పడతి. కండకావరంతో కన్నుమిన్ను కానని అధికారి బలానికి లొంగిపోకుండా, చావు ద్వారా తనను తాను కాపాడుకున్న స్త్రీ కన్యక. ఇలా ఈ రెండు గేయాల ద్వారా గురజాడ ఇంట, బయట స్త్రీ కి రక్షణ లేని స్థితిని వెల్లడించారు.

క్రొత్త పాతల మేలు కలయికతో తెలుగువారి మత్తు వదలగొట్టిన భావ విప్లవకారుడు అప్పారావు. గురజాడ అప్పారావు గారు తెలుగు సాహిత్యాన్ని సరికొత్త దారుల వెంట ముందుకు తీసుకువెళ్లిన మహాకవి. ఛందస్సు లోనూ, భావములోనూ, భాషలోనే కాకుండా ఇతివృత్త స్వీకరణలో కూడా సరికొత్త దనాన్ని ప్రవేశపెట్టి "కొత్తపాతల మేలు కలయికతో, క్రొమ్మెరుగులు చిమ్మేలా" కవితా రచన సాగించిన మహాకవి. తాను నివశిస్తున్న సమాజంలో ప్రజలు మరింత ఆనందంగా జీవించాలని తపించిన కవితా తపస్వి, ముఖ్యంగా ఆ కాలం నాటి స్త్రీ దయనీయ జీవితాల పట్ల మనసు పెట్టి ఆలోచించిన మహా మనిషి. స్త్రీల జీవితాలు బాగుపడాలని తపించిన మానవతా మూర్తి. తన రచనల ద్వారా అందర్నీ ఆలోచింపజేసి యుగకర్త.

**ముగింపు :**

గురజాడ అనేక రచనలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన నవయుగ వైతాళికుడు. సాహిత్యం సమకాలీన సమాజానికి ప్రతిబింబం కావాలని నమ్మిన వాడు, సాహిత్యం సమాజానికి హితం కలిగించాలని ఆశించినవాడు, తన కాలం నాటి మూఢాచారాలను తన

రచనల ద్వారా ఎండగట్టి ప్రజలలో చైతన్యాన్ని కలిగించడానికి అహర్నిశలు ప్రయత్నించినవాడు గురజాడ. కేవలం రాజుల కథలతో విసుగెత్తిపోయిన తెలుగు సాహిత్యానికి సమాజంలోని అన్ని వర్గాల ప్రజలనూ పరిచయం చేసిన ప్రజల మనిషి, నవయుగ వైతాళికుడు గురజాడ.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. గురజాడ - ముత్యాల సరాలు.
2. తెలుగు సాహిత్య చరిత్ర - తెలుగు అకాడమి.
3. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా. శాస్త్రి.

❖❖❖

# లంబాడాల సంప్రదాయంలో హోళి పండుగను జరుపుకునే విధానం

- డా॥. లక్ష్మణ్ నాయక్ భూనోత్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆలేర్, యాదాద్రి జిల్లా.

లంబాడాలు జరుపుకునే హోళి పండుగ ఇతరుల కంటే భిన్నంగా జరుపుకుంటారని చెప్పవచ్చు. ఫాల్గుణ మాస చంద్రదర్శనం మొదలుకొని పౌర్ణమి వరకు దీన్నే లంబాడాలు "హోళిర్ పాగ్" అని అంటారు. అనగా చంద్రుడు మొదటిరోజు కన్పించునప్పటి నుంచి పౌర్ణమి వరకు పదిహేను రోజుల వెన్నెల రాత్రిని వీరు అంగరంగ వైభవంగా జరుపుకుంటారు.

హోళి పండుగలో వివిధ రంగులు చల్లుకోవడం ఓ భాగం వదినలు, మరదులు మొదలైన వరుస అయిన వాళ్లు ఒకరినొకరు బూతులతో, బూతు గేయాలతో గెరియా, గెరణీ నృత్యం చేస్తూ రంగులు చల్లుకుంటూ ఆనందకేళిలో మునిగితేలుతారు. ఎటు విన్నా చూసినా శృంగార రస ప్రాధాన్యమే తాండవిస్తుంది. హోళి పండుగలో భక్తి భావానికి అంతగా ప్రాధాన్యత ఉండదు. కాని లంబాడాలు ఏ పని చేసినా కూర్చున్న, లేసినా, పడుకున్నా ఒకరినొకరు కలుసుకున్నప్పుడు మాట్లాడినా రమా నామం లేనిదే ఆ పని, పాట, కార్యం జరగదు. వారి మాటల్లో, పాటల్లో ముందుగా రామ నామస్మరణ చేయాల్సిందే.

"అసిధరతీ పరె రామన్ లచమణ్ చలెగె
ఓరి బిరె చాలిరె సీతా మాతో ధరతి టోపరె భోయిరె
ధరతి టోపరె డ్వాలేతి ధరతి టోపరె గమతేతి
అసి ధరతీ పరె రూపాన్ రాము చలెగె
ఓరి బిరె బాలిరె సీతామతో ధరతి టోపరె భోయిరె
ధరతి టోపరె డ్వాలేతి ధరతి టోపరె గమతేతి
అసి ధరతీ పరె నాయక్ లోక్ చలెగె
ఓరి బీరె చాలిరె సీతామాతో ధరతి టోపరె భోయిరె
ధరతి టోపరె డ్వాలేతి టోపరె గమతేతి
కూర వీరి దేవళేమా ఘాలేరె హింజెళో
ఉతో రామన్ లచమణ్ హించెరె హింజెళో
దేవళేమా భోయిరె దేవళేమా డ్వాలేతి దేవళేమా గమతేతి"

**భావం :**

ఈ పుణ్యభూమిపై రామలక్ష్మణులు నడిచారు. జగన్మాత సీతావారి వెంట నడిచింది. వాళ్ల పవిత్రమైన పాదాల తాకిడికి భూమాత మహానందంతో పులకరిస్తూ నృత్యం చేసింది. ఈ భూమిపై రూపా, రాము నాయక్‌లు నడచి ఉన్నారు. వారి వెంట వారి సతీమణులు సీతామాతలై నడిచారు. వారి పాదాలకు భూమాత పరవశించి నాట్యం చేసింది. ఈ భూమిపై ఎంతోమంది నాయకులు నడిచి ఉన్నారు. వారి వెంట వారి వారి శ్రీమతులు సీతామాతలై నడచారు. వారి పాదధూళికి భూమాత పరవశించి నాట్యం చేసింది. కురవి వీరన్న దేవాయలంలో ఉయ్యాల కట్టారు. అందులో రామ లక్ష్మణులు జనుల కరతాళ ధ్వనుల నడుమ గమ్మత్తుగా ఉయ్యాలలూగినారు.

మామిడి కాయలతో గెరణి, గెరియాలను పోల్చే గేయం

"ధిరె ధిరె అంబా లాగేరే లాల్ గెరియారి సేడే ఘటిరే లాల్
ధీరె ధీరె అంబా లాగెరే లాల్ గెరణిరి సేడే ఘటిరే లాల్
వేరారో పాణి ఖుటరే లాల్

**భావం :**

మామిడి చెట్టుకు పూతపూసే ముందు చెదురు ముదురుగా పిందెలు కాస్తుంటాయి. తర్వాత చెట్టునిండ గుత్తులు గుత్తులుగా కాయలు కాస్తుంటాయి. అట్లే గెరణి గెరియాలు (స్త్రీ పురుషులు) హోళి ఆడటానికి ముందు ఒక్కొక్కరు ఆ తర్వాత గుంపులు గుంపులుగా చీమల దండువలె వస్తూ చలమ నీళ్లు త్రాగడం వల్ల నీళ్లన్ని అడుగంటాయి.

ఈ పాటలో స్త్రీ పురుషుల ఆటల సదర్భంగా వచ్చే గుంపులను ప్రకృతి సహజమైన మామిడి కాయల

గుత్తులతో, చీమల దండుతో పోల్చారు. ఇది వాళ్ల పరిశీలనా చమత్కృతికి తార్కాణం.

"లాలె లాలె గెరియాయే పటాలేపర్ ఝుమరె
లాలె గోలలె గెరియో
శేలా ఝుమ్మర్కో డ్వాలేతి శేలా ఝుమ్మర్కో గమతేతి
నాయక్ తారి ఘరే అంగె సాండియా భాందోచె
ఓ సాండియానె ఛోడె పరేసి భాందియో
గెరియా అవచె కూదెనె గెరియా అపచె నాచెనె
నాయక్ తారి ఘరె అంగె నంగారా పడోచె
ఓ నంగారానె పాడె పరేసి మెలియో
గెరణి అవచె నాచెనె గెరియా అవచె కూదెనె
రాతీయే అందారి ఘోడి ఘుంగటో చళకె
ఓ ఘుంగటెనె పాడె పరేసి మెలియో
గెరణి అవచె నాచెనె గెరియా అవచె కూదెనె"

**భావం :**

ఓ నాయక్ నీ ఇంటి ముంగిట విశాలమైన ప్రాంగణంలో రంగు రంగుల గెరియా, గెరణీలు ఆట పాటలతో అలరించడానికి వస్తారు. ఓ నాయక్ నీ ఇంటి ముందు అంబోతు కట్టేసి ఉంది. దాన్ని విడిచి దూరంగా కట్టేసిరా! అప్పుడు గెరిణి గెరిణి గెరియాలు అలరించడానికి వస్తారు. ఓ నాయక్ నీ ఇంటి ముందు నగరా ఉంది. దానిని దూరంగా పెట్టేసిరా! అప్పుడు గెరణి గెరియాలు ఆడుతూ పాడుతారు. ఓ నాయక్ నీ ఇంటి ముందు చీకటిలో ముసుగు గుడ్డుకున్న అద్దాలు మెరుస్తున్నాయి. వాటిని దూరంగా ఉంచు అప్పుడు గెరణి గెరియాలు ఆనందంతో ఆటపాటల్లో లీనమవుతారు.

ఈ గేయంలో తండాకే సర్వాధికారి అయిన నాయక్ ఇంటి ముందు ఆడిపాడడం సంప్రదాయం. స్త్రీ పురుషుల గుంపు ఆటలకు ఆటంకం కలగకుండా అంబోతును, నగారాను దూరంగా ఉంచాలని సూచిస్తున్నారు.

మరో గేయంలో గేరియ, గేరాణిల గుంపు లూటీ చేయడానికి వచ్చారంటూ

"పుళియాపర్ పుళియాయే ఖడెకేరో పుళియా
పుళియా ఖడెక్ పడో దాతల రపెటె పడో
రూపారే నాయక్ తారో గడె లుటాయెూ
ఖోరియదోప్పెర్
భోయి భోయిరె జంగలెమా డ్వాలేది జంగలేమా
గమతేతి

**భావం :**

ఓ రూపానాయక్ మోపు మీద మోపు కూలిపాయే. కొడవలి జారిపాయే గెరియా గెరణీలు నీ గడిని గమ్మత్తుగా మిట్ట మధ్యాహ్నమే లూటీ చేయడానికి వచ్చారు.

ఎవరైన దొంగలు రాత్రిపూట వస్తారు. కాని! పట్టపగలు రారు. అయితే పట్టపగలే లూటీ చేయడంలో ఉద్దేశం కోలాటం వేస్తూ గేయాలతో రంజింప జేస్తూ వాళ్లు అనుకున్నంత డబ్బులు వసూలు చేసే వరకు ఊరుకోరు అందుకే ఇలా చమత్కరించారు.

సమాజంలోని అత్తా కోడళ్ల సన్నివేశాన్ని గేయ రూపంలో ఇలా రచ్చకీడుస్తున్నారు.

"కాళో తేవారెఛె ఖిచడిరో ఝూడె ఛె
ఒరె హెటె గెరియా లూమరే ఝుం ఝుమరేచె
దొప్పరె పాణానె గాయిరె లాల్ భోయి భాయిరే లాల్
ఖాళెయా మాయేతి సాళాయా నిసెరో
లుంకడి ఖేలె బిగాడిరే లాల్
ఎనె ఝులె ఝుటికి ఒనె పాడె పటెకి
గెరియారి ల్యారె వతారిరే లాల్ భోయి భాయిరే లాల్"

**భావం :**

ఏటి ఒడ్డున చెట్టుకింద హోళి ఆడటానికి వెళ్లుటకు స్త్రీ పురుషుల గుంపు సిద్ధంగా ఉన్నారు. ఇదే సమయంలో ఓ స్త్రీ పగలు నీళ్లకోసమని సాకుతో ఏటికి వెళ్లింది. కాని ఈ హోళి గుంపుకు ఆడనక్కతో మగ నక్క పోట్లాడి ఏటిలో ఎదురైంది. దీన్ని అపశకునంగా భావించిన గెరణి గెరియాలు పోరుగూరుకు వెళ్లే కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. హోళి ఆడడానికి వచ్చి అత్త చాటు కోడలుకు పట్టరాని కోపం వచ్చింది. దీనితో ఆమె చేతికొచ్చిన వాటితో కొడుతూ గేరియాల పూనకాన్ని వదిలించింది.

హోళి ఆడడానికి ఎంత ఉత్సాహంగా ఉండేవారో ఈ సందర్భాన్ని బట్టి తెలుస్తుంది.

అంత్య ప్రాసల అందాన్ని చిందిస్తూ మరో గేయం ఇలా ఉంది.

"బొలె భాయి బొలెడ బోలరేతుఁ
తారి గౌరణితి మత్తరో చాణరేతుఁ
పాంచె పచ్చీసె మెలరే తుఁ
గెరణిరి అసీస్ లరే తుం
పాంచె పచ్చీసె దరేతుఁ
గెరియారి ఆసీస్ లరేతుఁ"

**భావం :**

ఓ సోదరా! నీవు ఇచ్చేది ఎంతో చెప్పు? నీ భార్యతో విచారించి ఇరవై అయిదు రూపాయలు గెరణి గెరియాల చేతిలో పెట్టి మా ఆశీస్సులు పొందు.

హోళి డబ్బుల ప్రాముఖ్యతే కాకుండా వాళ్ల చల్లని ఆశీస్సులు అందిస్తామని అంటున్నారు. ఈ హోళి పండుగ రక్తి కట్టాలంటే వరుసైన యువతీ యువకులు నడుమ గేయ సంవాదం ముచ్చట గొల్పుతుంది.

మరో పచ్చి శృంగార గేయం ఇలా వుంది.

"ఫాటి టూటి గోదడినె సూయి దియో కాఁయి
టాండేర్ వచ్చె తిత్తర్ బోలె చోదే దియా కాయి
ఫాటి టూటి గోదడినె సూయి దియో కాఁయి
టాండేర్ వచ్చె తిత్తర్ బోలె చోదే దియా కాయి"

**భావం :**

చినిగిన బొంతను కుట్టడానికి సూది కావలిసినట్లుగానే కౌజుపిట్ట తండ మధ్యలో కూసినందుకు మీతో కలువనిస్తారా? ఇక్కడ నర్మగర్భంగా శృంగార రసాన్ని ప్రవేశ పెట్టారు. బొంత, తిత్తరం స్త్రీ సూచకాలు అక్కడ తండాలో కౌజు కూసింది అంటే లైంగిక చర్యను కాంక్షిస్తుందని భావం. అందుకు పురుషులు సూయిని పురుషాంగానికి తార్కాణంగా పేర్కొంటూ నవ్వులు పండించుకోవడంలో వీళ్లకు వీళ్లే సాటి.

అందుకే ఉత్సవాలు పండుగలు స్త్రీ పురుషుల సంగమాన్నే సూచిస్తాయంటూ తాపి ధర్మారావు గారు దేవాయాల మీద బూతు బొమ్మలెందుకు అనే గ్రంథంలో ఇలా అన్నారు. పూర్వకాలంలో ఉత్తర భారతదేశంలో రామమేళా అనే ఉత్సవం సంవత్సరానికి ఒకసారి జరిపేవారు. ఆ పర్వదినం నాడు జనమంతా ఏటి ఒడ్డున జమ అవుతారు. ఆడవాళ్లంతా ఎగువరేవున ఉంటారు. మగవాళ్లు దిగువ రేవున ఉంటారు. పుణ్యకాలం చూసుకొని అక్కడ ఆడవాళ్లు ఇక్కడ మగవాళ్లు స్నానానికి నీటిలో దిగుతారు. ఆడవాళ్లు స్నానం చేస్తూ వాళ్ల రవికలను నీటిలో విడిచి పెడతారు. అవి కొట్టుకొని వస్తూ వుంటే ఇక్కడ మగవాళ్లు తలా ఒక రవికను పట్టు కొంటారు. ఆ రవిక ఎవరిదైతే ఆ ఆడి ఆ రాత్రి అతని సొమ్ము అతను ఆ రాత్రి ఆ స్త్రీకి సాక్షాత్తు కామదేవుడు. వాళ్లు చేసిన పని అంత పుణ్యము దేవతా ప్రియము అది పవిత్ర కార్యం పాతివ్రత్య భంగం కాదు.

పూర్వం సంవత్సరానికి ఒకసారి రవికల పండుగ (కంచు కోత్సవమని) జరుపుకునేవారు. పండుగనాడు ఆడవాళ్లందరూ కోవెలలోకి వస్తారు. పూజలు పునస్కారాలు అన్ని జరుగుతాయి. తర్వాత ఆడవాళ్లందరూ తాము తొడుగుకున్న రవికలు తీసి ఒకచోట పోగుగా పడవేస్తారు. తర్వాత మగవాళ్లందరూ ప్రవేశిస్తారు. తలా ఒక్కొక్క రవికను తీసిపట్టుకుంటారు. ఆ రవిక ఎవరిదో ఆ స్త్రీ ఆ రాత్రి అంతా ఆ మగవాడితో భోగించాలి. దానిలో తప్పు లేదు అలా చేయకపోతే తప్పు అతన్ని అన్ని విధాలా సంతోషపెట్టాలి. తెల్లారిన తర్వాత ఎవరి భర్తల దగ్గరికి వాళ్లు వెళ్లి సంసారం చేస్తారు దాని వల్ల పుణ్యం వస్తుందని వారి నమ్మకం".

ఒకప్పుడు ఇవి ఆచారాలుగా ఉన్నాయి. ఇప్పుడు అనాచారాలు, దురాచారాలుగా మారినాయి. ఇలా ఒక్కో సమాజంలో ఆనాడు లైంగిక వాంఛలు సహజమైనవిగా ఒప్పుకున్నారు. అందుకే లంబాడా సమాజంలో కూడా బూతు మాటలు, పాటలు తప్పుగా భావించలేదు. అదొక ఆచారంగా కొనసాగుతుంది. వీళ్ల మాటల్లో బూతు పదాలు శృంగార రసాన్ని రేకెత్తిస్తూ ఉల్లాసభరితంగా కనువిందు గొల్పుతుంటాయి.

మరో గేయంలో ఇలా ఉంది.

"గెరియా డుబేగో గెరణీరి భోసడేమా సాసీజ్
ఆంకిజ్ కాడరో గెరణీరి భోసడేమా సాసీజ్
ముండో ఫాడరో గెరణీరి భోసడేమా సాసీజ్
దాంతె కాడరో గెరణీరి భోసడేమా సాసీజ్
చాందా ఛపగో గెరణీరి భోసడేమా సాసీజ్"

**భావం :**

గెరియా కళ్లు, నోరు, పళ్లు కన్పించకుండా పూర్తిగా గేరణీ ఒడిలో చంద్రుడు మబ్బుల్లోకి కన్పించకుండా వెళ్లినట్లు మునిగిపోయాడు.

ఈ గేయంలో పైకిమాత్రం సామాన్యభావం కన్పిస్తుంది. కాని అంతర్గతంగా పురుషాంగం యోనిలో ఏమి కన్పించ కుండా మునిగిపోయిందని స్ఫురిస్తుంది. ఇది వీళ్ల చమత్కారానికి ప్రతీక.

మరో గేయంలో గెరియాలు అందెలు అపహరించారని ఓ అమ్మాయి వేదన.

"టాంగే కేరి చటకి కతె ఖోయి భోళి భావజ్
ఆనె పడే గెరియానె కొసలెగె చటకి
పాణారి ఘాటేపర్ లాలే గోలాలె గెరియా
హోళి ఖేలరె డ్వాలేతి
హోళి ఖెలరె గమతేతి"

**భావం :**

ఓ వదినా! నీ కాళ్ల అందెలు ఏమైనాయి? అని మరదలు ప్రశ్నించగా మంచి నీళ్ల బావి దగ్గర ఎర్రని గెరియాల దండు హోళి పాటలు పాడుతూ ఆడుతూ నా గజ్జెలు అపహరించుకుపోయారు. హోళి ఆడే గుంపు వచ్చారంటే వాళ్లకు ఏదైన ఇవ్వనిదే వెళ్లరని భావం ఇందులో కన్పిస్తుంది. లంబాడాలు గిరిజనులైన పాటలో యతిప్రాసలకు ప్రాధాన్యమివ్వడం విశేషం. ఉదా హరణకు హుని - హాంస్ భూలి - భూరియా అని హాస్యంతోపాటు అలంకార ఛందస్సు శాస్త్రాన్ని కూడా మేళవిస్తున్నారు.

తమకు అప్పులిచ్చే శావుకార్లను గేయాల్లో బంధించి పండుగ విరాళాలను సేకరిస్తారు. తెలుగు భాషలోను అద్భుతమైన కవిత్వాన్ని చెప్పే లంబాడ స్త్రీల గేయ నడకను గమనించండి.

"ఆడా మోడాలంటే ఓరి సావుక్కారి ఆడోళ్లు లేరంటి
ఓరి సావుక్కారి
పెట్టెనిండ పైసలున్న దోరి సావుక్కారి పెట్టెటోళ్లు
లేరంటి ఓరి సావుక్కారి"

అని గేయాలు ఆలాపిస్తూ దాతలిచ్చేది పుచ్చుకొని విరాళమిచ్చిన దాతకు ఒక కుమారునికి పది మంది కుమారులు పుట్టుగాక అంటే అతని వంశం వృద్ధి చెందాలని దీవిస్తారు. అంతేగాక అతనికున్న ధనం హోళి పండుగ నాటికి రెట్టింపు ఆగుగాక అని అందరూ కలిసి ఒకేసారి బిగ్గరగా కేకలేస్తూ ఆశీస్సులిస్తారు.

**ముగింపు :**

హోళి పండుగ సందర్భంగా ఇలా హోళి ఆడుతూ పాడుతూ వసూలు చేసి విరాళాలు మొత్తం జమ చేసికొని తండా ప్రజలు సంఖ్యను బట్టి మేకపోతులను కొని తండా నాయక్, కార్బరి ఇతర పెద్దల సమక్షంలో కోసి అందరూ మాంసాన్ని పోగులేసుకొని పంచుకుంటారు. కోయగా వచ్చిన రక్తాన్ని పట్టి అందులో కొంత మాంసాన్ని వేసి "సోజోయి" అనే ప్రత్యేక వంటకాన్ని చింతపండుతో కలిసి వండుతారు. చివరి రోజు పిండి వంటలు చేసుకొని సామూహికంగా భుజిస్తారు. వాళ్లమేనుపై ఉన్న రంగులో మునిగిన బట్టల్ని విడిచి స్నానాలు చేస్తారు. నూతన వస్త్రాలు ధరించి యువతి యువకులు ఊయలలు కట్టుకొని ఊగుతూ ఆనందాన్ని పంచుకుంటారు.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. తాపీ ధర్మారావు, దేవాలయాల మీద బూతుబొమ్మలెందుకు, పుట : 73.
2. డా॥. జనపాల శంకరయ్య, తెలుగు లంబాడీల గేయా సాహిత్యం, పుట : 174.
3. బి. చీనియా నాయక్, బంజారా చరిత్ర సంస్కృతి ప్రగతి, పుట : 242.

❖

# వేయిపడగలు నవలా శిల్పం-ముదిగొండ వీర భద్రయ్య విమర్శ

-సి. బాలమణి, తెలుగు అధ్యాపకులు, టి.ఎస్.ఆర్.డి.సి., ఆర్మూర్, నిజామాబాద్.

వేయిపడగలు నవలను విశ్వనాథ సత్యనారాయణ రచించిన నవలలలో అత్యంత ప్రసిద్ధమైన నవలగా ప్రజాదరణ పొంది పలుమార్లు పునర్ముద్రితమైనది.ఈ నవల విశ్వనాథ స్వీయానుభవాల సారాంశం అని, అందులోని పాత్రలలో ఆయన కుటుంబం, దగ్గరి సమాజం ఛాయలు గోచరిస్తున్నాయని పరిశీలకులు అభిప్రాయపడ్డారు. కథా విశేషాలలో కళితే ఒక గొల్లవాడి దగ్గరుండే ఒక ఆవు ఇచ్చే అపారమైన పాల వలన అతడు ఏ చీకూ చింతా లేక జీవిస్తుంటాడు. అయితే కొద్ది రోజులుగా ఆవు సాయంకాలం పాలివ్వడం మానేయ్యడంతో ఒక రోజు కాపరి దానిని అనుసరించి వెళతాడు. సాయంకాల సమయానికి గోవు మందకు దూరంగా పోతుంతే దానిని అనుసరించి వెళ్ళిన అతడు గోవు ఒక పుట్టవద్దకు నడచి దానిపై ఆగటం అందునుండి ఒక తెల్లని సర్పం వచ్చి గోవు పాదుగునుండి పాలు త్రాగటం చూస్తాడు. అయితే అతడు చూస్తున్నది నిజమో కాదో తెలియనట్టుగా ఆసర్పమునకు అనేక శిరసులు కనిపిస్తాయి. ఆ రాత్రి అతడి కలలో కనబడిన ఆసర్పము తనకు అక్కడ దేవాలయం నిర్మించవలసినదిగా చెప్పి మాయమవుతుంది. తదనంతరం అక్కడ ఒక గ్రామం ఏర్పడి విలసిల్లి తర్వాతా ఎలా శిథిలమయిందనే దానిని కథకు మూలంగా చెపుతూ కొన్ని ముఖ్యపాత్రల ద్వారా కథను అప్పటి స్థితి గతులను తెలియ జేస్తూ సాగించారు.

గాంధీజీ నాయకత్వంలో స్వాతంత్ర్యోద్యమం తీవ్రంగా జరుగుతున్న రోజుల్లో రాసిన నవల ఇది. రాజకీయాల్లో గాంధీజీ చేసిన పనినే సాహిత్యంలో, సాహిత్యం ద్వారా, విశ్వనాథ వారూ చేశారు. ఐతే అన్నీ గాంధీకి నకలని కాదు. కొన్ని విషయాలలో విశ్వనాథ అభిప్రాయాలు వేరు. ఏ భేదం ఉన్నప్పటికీ, భారత దేశాన్ని ఇక్కడి మనిషి చూడాల్సిన పద్ధతిలో చూడ్డంలో ఇద్దరిదీ ఒక్కటే పద్ధతి. దేశాన్ని ఒక భౌగోళిక ప్రదేశంగా కాక, అంతకన్నా సార్థకమైన విషయంగా విశ్వనాథ ఈ నవలలో చిత్రించారు.ఈ దేశంలో పుట్టిన వాళ్లల్లో ఈ చైతన్యం కల్గించడానికే ఈ నవలా రచన చేశారు.ఈ దేశం మీద బ్రిటిష్ వారు చెలాయించిన అధికారం కేవలం రాజకీయాధికారం మాత్రమే కాదు. ఆ రాజకీయాధికారం స్థిర పడడానికి ఇక్కడి మత, సంఘ, ఆచారాలలో వారి భావ ధోరణి మార్చడం వారి విస్తృతమైన కుట్రలో ఒక భాగం. మన దేశంలోని మనల్నే మనం కాకుండా చేయడంలో వారు చాలావరకు సఫలీకృతులైనారు. దీన్ని ఎదుర్కొన్న మహా రచయిత విశ్వనాథ సత్యనారాయణ, వారి ఈ ఎదురు దాడి అంతా కళ్ళకు కట్టిన రచనే వేయి పడగలు నవల.

ముదిగొండ వీర భద్రయ్య ఈ నవలలోని శిల్పదృష్టిని వేయి పడగలు - నవలా శిల్పం పేరుతో ఈ నవలలోని శిల్ప సౌందర్యాన్ని విశ్లేషించారు. రచయిత అభిప్రాయాలు, నవలలో చాలా చోట్ల వారు తమ పాత్రలద్వారా చేయించిన చర్చలు కూడా ఈ నవలలో శిల్పదృష్టితోనే తీర్చబడినాయి. నవలతో అవి విడిబడిలేవు. నవలా పరమార్థానికి పాత్రలు, ప్రకృతి వర్ణనలు, ప్రతీకాత్మకత, అభిప్రాయాలు ఎట్లా తోడ్పడినాయన్నదే ముదిగొండ వీర భద్రయ్య విమర్శ యొక్క ప్రధానలక్ష్యం. తెలుగు విమర్శలో 'శిల్పం' అన్నదాన్ని ఒక ప్రత్యేకమైన అర్థంలో వ్యాప్తి చేసినది విశ్వనాథ సత్యనారాయణగారే. కట్టమంచి రామలింగారెడ్డిగారు కూడా శిల్పం అన్న శబ్దాన్ని తమ కవిత్వతత్త్వ విచారంలో వాడారు. కాని అది కేవలం కళ అనే అర్థంలోనే అక్కడ కన్పిస్తున్నది.' ఈ అర్థంలో విశ్వనాథ కూడా తమ వేయి పడగలు నవలలో వాడారు.

శిల్పాన్ని గురించి ముదిగొండ వీర భద్రయ్య చెప్పూ అందులో ఇమిడి ఉన్న అంశాలు ఇలా పేర్కొన్నారు.

"(1) కవి స్వీకరించిన వస్తువుకు బాగా తగి ఉన్న మహా విషయాలలోని సామగ్రిని సంపాదించి కావ్యంలో గ్రథించడం

(2) ఇట్లా ఆయా భిన్న విషయ సంగ్రహణం చేత కావ్య సౌందర్యం అధికంగా భాసించడం."

(పుట:11, వేయిపడగలు - నవలా శిల్పం, ముదిగొండ వీర భద్రయ్య)

రెండవది కావ్య ప్రయోజనం శిల్పం ద్వారా సిద్ధిస్తుందని, మొదటిది కావ్య వస్తువుకు పరమోచితములైన మహా విషయాలలోని సామగ్రీ సంపాదనం చేయడం అన్నది శిల్పంగా భావించచ్చు అని చెప్పాడు.

వేయి పడగలు - నవలా శిల్పం అనే విమర్శలో వీర భద్రయ్య గారు శిల్ప దృష్టి ఉన్న నవలా రచన సార్థకం అవుతుందని ఈ దృష్టిలేని నవలా రచన పాఠకుణ్ని తికమక పెడ్తుంది. అలాంటి నవల అప్రయోజకమని పాఠకుడు భావించేటట్లుగా చేస్తుంది అంటారు. అంటే ఒక నవల ప్రయోజనకరంగా ఉండాలంటే రచయితకు శిల్ప దృష్టి ఉండాలి. కేవల వస్తు ఘనత సరిపోదు. ఆ వస్తువును కళగా రూపాంతరీకరించాలంటే దాన్ని ఎట్లా ప్రతిపాదించాలి అన్నది శిల్పంలో ముఖ్యాంశం.

ముదిగొండ వీర భద్రయ్య శిల్పంలో ఇమిడి ఉన్న అంశాలను ఈ క్రింది విధంగా క్రోడీకరించారు.

"(1)నవల ఎందుకోసం రాస్తున్నదీ స్పష్టంగా రచయిత తేల్చుకున్నాడన్న అంశం పాఠకునికి అర్థం కావడం

(2) అధ్యాయాల విభజన యుక్తంగా చేసి ముగింపుకి అవన్నీ సమన్వయం కావడం.

(3) కాలం గడిచినట్లుగా రాస్తూనే దాని వెంట జీవితం కూడా గడుస్తున్న స్ఫూర్తిని పాఠకులకు కలిగించడం.

(4) ప్రతి సంఘటనకు వెనకన నేపథ్యంలో ఉండే వాతావరణాన్ని చిత్రించడం.

(5) పాత్రల రూపకల్పనలతో పాటు వారి స్వభావాలను కూడా స్పష్టంగా పాఠకులకు అనుభూతిలోకి వచ్చేట్లుగా చిత్రించడం.

(6) ప్రకృతి వర్ణనల వంటివి చేస్తున్నప్పుడు, వాటికోసం అవిగా కాకుండా, నవలా పరమార్థానికి అవి దోహద పడేట్లుగా చేయడం.

(7) ప్రతీకాత్మకమైన పాత్రల్ని సృష్టించినప్పటికీ, వాని సహజత్వానికి భంగం కలుగకుండా జాగ్రత్త పడడం.

(8) అవాస్తవాలను అంటే అసంభావ్యమైన విషయాలను చిత్రించకపోవడం

(9) నవల ఆది అంతాలకు స్థూలంగా సమన్వయం చేయడం

(10) నవలలో ఆయా సందర్భాలలో చేసిన చర్చలు కథానుభవానికి అడ్డంకి కాకుండా చూడడం."

(వేయిపడగలు - నవలా శిల్పం, ముదిగొండ వీర భద్రయ్య, పుట : 19)

వాస్తవికత నవలకు ప్రాణమని చెప్తారు. ఐతే వాస్తవానికి కళా స్పర్శ లభిస్తేనే గానీ అది వాస్తవికత కాదు. నవలలో రూపాన్ని సృష్టించడం వాస్తవికతకు వ్యతిరేకం కాకుండా మహా వాస్తవికతలకు అది సోపానం. నవలా పరమార్థానికి వాస్తవికతా, దాని కళాత్మకతా రెండూ తోడ్పడాలి. ఇవి రెండూ పరస్పరాశ్రితాలు అవుతాయని వివరించారు. చాలా మందికి జీవితం ఆహ్లాదకరంగా ఉండదు. కాని ఒక నవల అట్లా కాదు. దీనికి ప్రధాన హేతువు నవలా కారుని శిల్ప దృష్టి. మనిషి జీవితంలోని అనేక అంశాలు ఈ శిల్పదృష్టి వల్ల వదలి వేయబడి, కొన్ని మాత్రమే రచనా చట్రంలోకి వస్తాయి. ఆ వచ్చిన వాటి సంబంధాల క్రమాన్ని తెల్పడమే శిల్ప వివేచన అన్నారు. అలాగే శిల్పం సరిగ్గా లేని నవలలోని వస్తువు అప్రయోజకం అవుతుంది. అంటే పాఠకుని ఆకర్షించదు. వాళ్లకు జీవితానుభవాన్ని కల్గించదు. రచయిత ఉద్దేశించిన పరమార్థం పాఠకునికి అందకుండా పోతుంది. మహా రచయిత ఇట్లా చేయడు. ప్రతిభావంతుడైన మహా రచయిత పై అంశాలన్నీ రచనలో చూపుతాడు అని తెలిపారు.

విశ్వనాథ సత్యనారాయణ 'వేయి పడగలు' అని ఈ నవలకు పేరు పెట్టి, ఈ పేరే ఎందుకు పెట్టినది వివరించారు. అంతే కాకుండా నవలలో కూడా అక్కడక్కడ వేయి పడగల సంకేతార్థాన్ని సృష్టీకరిస్తూ, నవల ముగిసేదాకా దానికి భంగం కానీ, విరోధం కానీ రాకుండా చూశారు." ఆది శేషువునకు వేయి పడగలున్నై... అనగా సహస్ర ముఖంగా ధర్మం ఉంటుంది. ఆ ధర్మము చేత భూమి పాలించ బడుతుంది అన్న యర్థమే. సర్వత్రా ధర్మమే వుంటే అది సహస్రముఖంగా వున్నదని చెబుతాం. అది వేయి పడగలు." (పు. ii - వేయి పడగలలోని యంతరార్థము.) అన్నారు విశ్వనాథ. సహస్ర శిరస్సులకు ఆధారం స్వామి ఏక శరీరం. అది ధర్మం. ఆ ధర్మం మీద వేయి సంస్థలు నిలవాలి అని ఉద్దేశ్యం.

గత కాలంలోని వ్యవస్థ యొక్క ఔజ్వల్యాన్ని, నేటి కాలపు వ్యవస్థ యొక్క ధర్మచ్యుతినీ వివరించడానికే ఈ నవలా రచన జరిగిందని చెప్పడానికి ఈ 'వేయి పడగలు' అన్న సంకేతాన్ని ఆయా చోట్ల ఈ నవలలో వారు వాడుకొన్నారని ముదిగొండ వీర భద్రయ్య తెలిపారు.

విశ్వనాథ వారి నవలకు వేయిపడగలు అని పేరు పెట్టినప్పటికీ, ఈనవలలోని ప్రధాన ఇతివృత్తం వేయి సంస్థలుగా ధర్మం నడిచిన రోజులని తెలిపేది కాదు. కేవలం దాంపత్య ధర్మమే ప్రధానంగా ఈ నవలలో చిత్రింపబడింది. అదొక్కటే మిగిలి ఉన్నదని విశ్వనాథ ఉద్దేశ్యం కదా అయి ఉండవచ్చు అన్నారు. ధర్మారావు అరుంధతులు కాకుండా ఈ నవలలో దాంపత్యజీవనానికి పరాకాష్ఠ అనదగ్గ జంటగా శశిరేఖా కిరీటులను విశ్వనాథ చిత్రించారు. పురుషుల పక్షం నుంచి స్త్రీకి ప్రణయం కిరీటి ద్వారా విశ్వనాథ చిత్రించినట్లు తెలుగులో మరే నవల లోనూ కన్పించదు అని వ్యాఖ్యానించారు.

అంతేకాకుండా నవలా రచనకు పాత్ర చిత్రణ అన్నది పునాది రాయి. ఇదే లోపిస్తే నవల సజీవతకు భంగం కల్గుతుంది. కొన్ని పాత్రల జీవితాన్ని ఒక పరమార్థం కోసం చిత్రించడమే నవలలో మనకు ప్రధానంగా కన్పిస్తుంది. పాత్ర చిత్రణలో ప్రధానాంశం పాత్ర యొక్క స్వరూపాన్ని, స్వభావాన్ని పఠిత కళ్లకు కట్టించడం. నవల పరమార్థానికి పనికి వచ్చే అన్ని అంశాలనూ పాత్ర చిత్రణలో రచయిత చేయాల్సి ఉంటుంది. లోపం జరిగితే నవలా నిర్మాణం శిథిల మవుతుంది. అందువల్ల నేర్పరీ, శిల్పీ అయిన నవలాకారుడు పాత్ర చిత్రణకు కూడా ధ్వన్యాత్మకమైన వర్ణన నాశ్రయిస్తాడని ముదిగొండ వీర భద్రయ్య గారు విడమరిచి చెప్పారు.

చర్చలు ఉండకుండా మహా రచన ఏదీ ఉండదు. అయితే వాటిని రచనా శిల్పంలోకి ఇమిడించడం అన్నది చాలా అవసరమని రచన పరమార్థానికి అనుగుణం కాని చర్చలు నవలను చంపివేస్తాయని సూచించారు.పాఠకుడు నవలలోని ఇతివృత్తంతో సాధారణంగా విభేదించడు. అతడు విభేదించేదల్లా చర్చల ద్వారా వ్యక్తమయ్యే రచయిత అభిప్రాయాలతోనే. దానితో పాటుగా సన్నివేశ కల్పన, సంఘటనా సృష్టికూడా బలంగా ఉండేట్లు రచిస్తే చర్చలు పాఠకులమీద ప్రభావాన్ని వేస్తాయి. అనవసరమైన విషయాలను చర్చించకుండా రచయిత తన నవలా పరమార్థానికి అనుకూలంగా ఉండే విషయాలనే నవలలో చర్చిస్తే అవి ఉచితమైన చర్చలు అవుతాయని తెలిపారు. ఇతివృత్త నిర్వహణకు పాత్రలు లేనిదే కుదరదు. పాత్ర సృష్టే ఇతివృత్తం కదలికకు మూలం. సంఘ సంస్కారాది వస్తువులు నవలలోని కళాత్మకతను కప్పివేస్తే దాని ప్రాణమే పోతుంది. అందుచేత పాత్ర సృష్టినుంచి, రచనా పరమార్థ దృష్టివరకుండాల్సిన 'ఏకత'ను శిల్ప దృష్టి ఉన్న రచయిత విడిచి పెట్టడని ఈ దృష్టితో ఇందులోని పాత్రలను పరిశీలిస్తే వేయి పడగలు నవలలోని శిల్ప సౌందర్యం స్పష్టమౌతుందని ముదిగొండ వీర భద్రయ్య తెలిపారు.

**ఆధార గ్రంథాలు :**

1. వేయిపడగలు - నవలా శిల్పం,ముదిగొండ వీర భద్రయ్య
2. వేయిపడగలు నవల - విశ్వనాథ సత్యనారాయణ

❖

  ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

# వైవిధ్యభరిత గీతం మాస్టార్జీ వెన్నెల గానం

- కత్తెరపాక నవీన్, తెలుగు అధ్యాపకులు, కమ్మర్ పల్లి, నిజామాబాద్.

'వెన్నెల గానం' మాస్టార్జీ వివిధ సందర్భాల్లో స్థల, కాలాల్లో రాసిన పాటల సంపుటి. దళిత పాటలు, స్త్రీతత్వ గీతాలు, మూలవాసుల పాటలు, మట్టిపూలు కవితా సంపుటాల్లో చేరకుండా ఉండిపోయిన పాటలన్నిటినీ కలిపి ఈ సంపుటిలో చేర్చడం జరిగింది. మాస్టార్జీ సాహిత్య ప్రస్థాన పరిణామం తెలుసుకోవడానికి ఈ పాటలు ఉపయోగపడతాయి. అలా ఇవి ఒక చారిత్రక ప్రాధాన్యత గల రచనలు, దళిత అవగాహనకు రావడానికి ముందు రాసిన పాటలతో పాటు మూలవాసుల దృక్పథానికి ఎదిగిన తర్వాత రాసిన పాటలు కూడా ఇందులో చేరాయి. ఈ పాటలు దేనికవి ప్రత్యేకమైనవి. కొన్ని పాటలు తన వంశ మూలాల గురించి రాయడం జరిగింది. ఇందులో బి.ఎస్.రాములు 50వ జన్మదిన స్వర్ణోత్సవ సందర్భం రాసిన 'పుట్టిండోయ్ పుట్టిండు..సి. నారాయణ ఒడ్డి గురించి రాసిన పాట, సిస్టరమ్మ గురించి రాసిన పాట, ఉస్మానియా యూనివర్సిటీలో లా కాలేజీలో ఫే వ్వెల్ సందర్భంగా పాడిన పాట ఇందులో చేర్చబడ్డాయి. ఇలా, వ్యక్తులపై రాసిన ప్రతి పాట ఒక ప్రత్యేక చారిత్రక సందర్భంగా వెలువడింది.

'చిన్నదాన నిన్ను చూడ... చింతలంతరించునే... అందానికి మారుపేరు నీ రూపమందునే...' అనే పాటలో ఊహాప్రేయసి ఎలా ఉంటుందో, ఎలా ఉండాలో తొలి యవ్వన దశలో రాసిన పాట, మాస్టార్జీగారి శ్రీమతి ప్రమీలను తొలిసారి చూసినప్పుడు కలిగిన భావన ఇలా పాటగా రూపు కట్టింది. తొలి యవ్వన దశలో వ్యక్తిత్వం కన్నా రూపానికి, నవ్వుకు, హెయలుకు పడిపోవడం సహజమైన దశ. ఆ తరువాత అవగాహన పెరుగుతుంది. ప్రేమలో అందం కన్నా సౌశీల్యం, ఆర్ద్రత, ఆదరణ, వ్యక్తిత్వం, స్వభావం వంటి గుణగణాలు ప్రాధాన్యతలోకి వస్తాయి. అవి పరస్పరం కలిసి సంభాషించే క్రమంలో, కలిసి పనిచేసే క్రమంలో వ్యక్తిత్వం తెలుస్తూ వుంటుంది. అలా, ఒకరి గురించి ఒకరు తెలుసుకునే క్రమంలో కలిగే ప్రేమ వాస్తవికంగా ఉంటూ రూపలావణ్యాలు అప్రధానమౌతూ ఉంటాయి.

భావకవిత్వం దశలోనూ సినిమాల్లో, రేడియో, లలిత గీతాల్లో ప్రేయసీ ప్రియుల ప్రేమను ఎన్నో రకాలుగా అద్భుతంగా వర్ణించారు. ఒకొక్క పాట దానికదే కావ్యంలా భాసించే పాటలెన్నో వెలువడ్డాయి. ఇందులోని కొన్ని పాటలు ఆ కోవలో, ఆ స్థాయిలో ఉండడం గమనించవచ్చు. ఈ పాటలు మాస్టార్జీ నోట విన్న తర్వాత వీటిని సినిమా వాళ్లకు వినిపించి వుంటే ఎప్పుడో సినిమాల కక్కేవి అని అనిపించింది. ఇప్పటికీ ఇవి నవనవోన్మేషంగా... తాజా పువ్వుల్లా పరిమళాలు వెదజల్లుతున్నాయి. కనుక, త్వరలోనే ఇందులోని ప్రణయగీతాలు సినిమాల్లోకి తీసుకోబడి తద్వారా లక్షలాది ప్రజల హృదయాల్లో గిలిగింతలు పెడతాయని ఆశిస్తున్నాను. అలాంటి భావ గీతాలు కొన్ని మచ్చుకు .......

ఓహో హోహోరీ చెలియ నీ అందం నను దోచి వేసే...
నాలోన ఏవో తెలియని భావాలు చెలరేపి వేసినే
గానము చేసే ఓ కోయిలా -
నా ప్రాణము నీవె తెలుసుకోవేలా
నేటి రేపటి పడుచులయ్యా - పెంచినోళ్ళకు తెలియకుండ
లవ్వు చేస్కుంటారయ్య - పేదోళ్ళంటే చులకనయ్య-
అతి పేదోళ్ళంటే కోపమయ్య- అతడే చివరకు గొప్పోడైతే
ఇతడే నా లవ్వరంటారయ్యా

ఈ పాటలో ప్రేమలోని ధనిక, పేద తేడాలను కవిత్వీకరించారు.

కాలమే కదలిపోతున్నదీ ఆశలే మిగిలి వుంటున్నవీ
చిన్ననాటి జీవితానా - ఏ హాయి నే కన్నానో... అంటూ

బాల్య జ్ఞాపకాలను సార్వజనీనం

నిన్ను ప్రేమించాను ఓ హేమ నే కోరుతున్నాను నా భామ

నను పలకరించవే ఓ చెలి వలపోలకరించవే నా సఖి? నీ ప్రేమ? ఇలా ప్రేమతో పాటు దైవ భక్తి, దేశభక్తి, ఆకలి, నిరాశ, నిస్పృహ, ఉక్రోషం, ఆనందం, అన్ని భావాలకు మాస్టార్జీ అక్షర రూపాన్నిచ్చిన సందర్భాలు బోలెడున్నాయి. అవన్ని పుస్తక రూపంలో రావడం అవసరం, అప్పుడే మాస్టార్జీ గారి బహుముఖీన వస్తు వైవిధ్యం, శిల్ప వైవిధ్యం, గాన వైవిధ్యం సమగ్రంగా తెలుస్తుంది.

ప్రేమలో సాధారణంగా ప్రేమికుడు తనను తాను తగ్గించుకుని ప్రేయసిని ఉదాత్తంగా భావిస్తూ చిత్రిస్తారు. అరబ్బీ, ఉర్దూ సాహిత్యాల్లో శతాబ్దాలుగా ప్రేమ సాహిత్యం సూఫీ వాదం తాలూకు తాత్విక చింతనతో ఆధ్యాత్మిక, ఆత్మిక సంవేదనను సంలీనం చేసుకుని అపూర్వంగా వికసిస్తూ వచ్చింది. భావ కవిత్వం అదే కోవలో సాగింది. నూతన వ్యక్తీకరణలు పెరుగుతూనే వున్నాయి, ఇందులో 'చంద్రముఖివో... నా ప్రాణసఖివో... చారుపోసివో.... నా ప్రేమ శృతివో... నీ మోహన రూపం... మది రేపును తాపం...' అని ఒక చోట మరో చోట 'నిషా నీ కళ్లల్లో వుంది... ఖుషీ నీ నవ్వులో వుంది...' అని... ఇంకో పాటలో 'వీణా... నా... ప్రవీణా... నా గానం నీవేనా... నీ రూపు నేను కన్నా ఈ బ్రతుకు ధన్యమన్నా...' అని రూప లావణ్యాలను వర్ణించారు. ఇది జీవన సహచరి ప్రమీలను ప్రేమిస్తూ రాసిన పాట. అలా ముందు ఇష్టపడి ఆ తర్వాత పెళ్లితో ఒక్కటైనారు. ప్రమీల గురించి 'ఆ కోనసీమల్లే... సిరిమల్లె పువ్వల్లే.... పాలల్లో నీళ్లల్లే.. కడదాక ప్రతి జన్మలో కలిసే ఉందాం..... కలిసే ఉందాం...' అని బాసలు చేసిన క్రమం చక్కని పాటగా రూపొందించారు.

విను ఇది... విను విను నా ప్రియా... ఇన్నాళ్లూ నే నిను చూసి అనుకొన్న మాట...కవిత కొరకు కవి వెతికే కమ్మని రూపానీవో...' అని చెప్తూనే 'అందరాని పండు కొరకు ఆశ పడుట లేదు.... నేను పొందలేని భాగ్యానికి గుండెలోన కుమిలేను...' అంటూ 'నీ కాలి అందె నవుతాను' అంటాడు.నువ్వు రాకపోయినా.. ఏ చోట నున్నా... నీ సుఖమే మిన్న... నిను పొందకున్నా...' అని ప్రేమలోని ఉదాత్తతను వ్యక్తీకరించారు.ఒక ప్రేమికు రాలు, ప్రేమికుడి గురించి 'నువ్వొచ్చాక వచ్చింది.... నా బతుకులోన వెలుగు.... నువ్విచ్చాక పోయింది... మనను దిగులు... ఇలా ప్రేమికుడు, ప్రేయసి పరస్పరం ప్రేమించుకోవడంతో ఎన్నో భయాలు తీరి ధైర్యంగా ముందుకు సాగుతారు. పరస్పరం ప్రాణం అనుకుంటారు. ఆ ధైర్యమే ప్రేమికులు, అందరినీ ఎదిరించి ఒక్కటవ డానికి కారణం. ఇది వనిత మనసు తెలిపే పాట.

"నేను ఓ మనిషినా? నాదీ ఓ బతుకేనా.... ఏ జన్మల పాపమో... ఈ జన్మల శాపమై వెంటాడెను... నాడు నా కంఠాన ఉన్న తాడు... అని దుఃఖిస్తూ వుంటే.... నీకేమిటి దిగులు... నీకేమిటి లోటు... అని మోదువారిన లతకు తోడు నేనుంటానని అన్నారిప్పుడు మీరు... అది విన్నాను ఇప్పుడు నేను' అని మహిళా హృదయాన్ని ఒక సన్నివేశం పాటలో ఆవిష్కరించారు. విషాద విలాపాలు ప్రేమికు లకు కొత్త కావు. 'ఏమైనా మన ప్రేమ అని... నీ వారెవరొచ్చి అడిగినా... నా సమాధి కుహరంలో ఆగిపోయిన ఈ గుండెలో పదిలంగా గూడుకట్టే నిన్నడిగిన ప్రతి వారికి నా సమాధి చూపి నీవు... నయనాల జలతారు రాల్చిన తుది వయనాన్ని నే సాగింతునే..." అని విలాపం ప్రకటిస్తాడు. పాటలు రాయడానికి ఏవేవో కావాలని భయపెట్టే వారిని గురించి భయపడ వద్దని పాట ఎలా రాయాలో జనం ఎలా మెచ్చుతారో 'కాలు ఆడిందంటే పాట హిట్టనే అర్థం... తల ఊగిందంటే సూపర్ హిట్టని అర్థం..... అంటూ జన మాధ్యంలోని పాటకు చక్కని నిర్వచనం ఇచ్చారు.

అమ్మ నాన్నల గురించి, గురువుల గురించి చక్కని పాటలు రాశారు. వీడ్కోలు పాటలు 'గురువే దైవము... గురువే మార్గమని... గురువు లేని విద్య గుడ్డిదని తెలియ జెప్పిన మా కళాశాల...' అని అంటూ 'తల్లి ఒడి వీడినా

ఢిల్లీకే రాజులై దేశం పాలించిన.... అంటూ కళాశాలను తల్లి ఒడిగా భావించి అందరినీ గుర్తు చేసుకున్న వీడ్కోలు పాట ఇది. 'దేవత అంటే తల్లి... దేవుడు అంటే తండ్రి... అని తల్లిదండ్రులకు నమస్కరిస్తారు. 'కనిపించే జిమ్మ (దైవం)... జన్మనిచ్చిన అమ్మ...' అని మరో పాటలో అమ్మను పలవరిస్తాడు. 'నాన్నా... ననుగన్న తండ్రి రాజయ్యా.... నీకన్న లోకాన ఎవరు మిన్నయ్యా..... అని కన్నతండ్రి చరిత్ర నిలిపారు. ఇంకో పాటతో సిస్టరమ్మకు వందనాలు చేస్తాడు. 'నింగిలోన పావురాయి... నైటింగేలై వారి సేవ మానవ సేవ చేస్తుందని' అని సేవలను కొనియాడుతూ అవనిందలను కూడా క్షమించే ఉదాత్తు రాలివని వినమ్రంగా నమస్కరిస్తాడు. 'అందరూ బాగుం డాలి... అందులో నేనుండాలి... అందులో నువ్వుండాలి... అందులో సిరి పండాలి...! అని రాసిన పాటలో ప్రేమతో పాటు విశ్వజనీన ప్రేమ కూడా కనపడుతుంది.

ఇలా ఇందులోని పాటలు ముందే చెప్పినట్టు ఎంతో వైవిధ్యంతో సాగాయి. 'వెన్నెల గానం' అనే పేరు దానికదే ఒక చక్కని కవితా పంక్తి. 'ఎగశ్వాసల దిగ శ్వాసలు.. స్వర. సవ్వడిని... వేల వేల గీతాలను అందించారు...' అని పాట సృష్టికర్తలెవరో, పాట ఎలా పుట్టిందో వర్ణించాడు. మాస్టార్జీ 'వెన్నెల గానం' దళిత బహుజనులతో పాటు మొత్తం ప్రజలను అలరిస్తుందని ఆశిస్తున్నాను.ప్రకృతికి, మనిషికి మధ్య గల సంబంధంలో ప్రకృతిని మానవీయం చేస్తూ మానవతను ప్రకృతి ప్రతీకల్లోంచి వెలికితీస్తూ తాత్త్విక గీతాలను రాసే పరిణత వయసులో పడ్డారు మాస్టార్జీ. ఇలాగే, ఇక నుండి మొత్తం మానవాళిని తన కవిత్వంలో, పాటల్లో తలఎత్తుకుని మానవ సమాజానికి శతాబ్దాల పాటు 'వెన్నెల గానం' చేస్తూ ఉండాలని.. అవి రసజ్ఞుల హృదయాలను దోస్తూ కలకాలం నిలిచిపోవాలని కోరు తున్నాను.

ఈ వెన్నెల గానం ఎందుకోసం? నా కోసం. నాలో కలిగిన భావ ప్రకంపనలకు అక్షర రూపం ఇవ్వడం కోసం, బాల్యంలో ఊహ తెలిసినప్పటి నుండి రాసిన పాటలు ఇవి. దళిత కళామండలి సంస్థను స్థాపించక ముందు అంబేడ్కర్, మూలవాసి సిద్ధాంతాల అవగాహనకు చేరక పూర్వం నేను నడిచి వచ్చిన క్రమం ఏమిటో తెలపడం కోసం, ఇలాంటి పాటలు ఎప్పుడో రాశానని చెప్పడం కోసం మాత్రమే కాదు, ఇప్పుడు కూడా రాయగలనని నలుగురికి తెలియజేయడం కోసమే ఈ వెన్నెల గానం అని ఈ రచన గురించి చెప్పుకున్నారు మాస్టార్జీ.

వినీల ఆకాశంలా పున్నమినాడు విరబూసిన వెన్నెల అందాలను చూసి భావుకుడు ఎలా. తన్మయత్వం చెందుతాడో... అలా ఊహ తెలిసిన తర్వాత ఆయా సందర్భాలలో పరిచయమైన వ్యక్తులను చూసిన పరిసరా లను గురించి నాలో కలిగిన భావ ప్రకంపనలకు అక్షర రూపాలే. ఈ వెన్నెలగానంలోని పాటలు. చిన్నప్పుడు వారి నాన్న అడే వీధి భాగోతం, నాన్న అక్క (మేనత్త) పాడే పల్లె పదాలు, అమ్మ పాడే జోల పాటలు ఆయన్ను ఇంట్లో ప్రభావితం చేస్తే బయటి బుర్ర కథలు, చిరుతలు, కొడుతూ బిచ్చపోల్లు సాపలల్లుతు పాడే పాటలు, ఇలా రకరకాల కళారూపాలతో పాటు సినిమాలు వారిని గాయకుడిగా తయారు చేశాయి.

ఏ సంఘటన చూసినా, ఏ స్పందన కలిగినా వెంటనే దానికి అక్షర రూపాన్నివ్వడం మాష్టార్జీకి చిన్నప్పటి నుండి మొదలైంది. పుస్తకంలో ఉన్న ఈ కింది పాట 11వ ఏట రాశారు...

"ఓహోరీహోరీ చెలియా నీలోని అందం నను దోచి వేసెనే
నాలోన ఏవో తెలియని భావాల పెన రేపి వేసినె?
పెన రేపి వేసినే?
చిలిపి గాలికి - చెలరేగు కురులలో
ఉయ్యాల లూగేను -2
వలపు కౌగిట నిను బంధీ చేసి
నా మురిసి పోయేసులే ? ఓహోహో ?
పెదవి పైని - మధుధారులన్ని
నను నిలువ నియ్యవులే - 2
హృదయ లాహిరి విహరించే వనమై
నా మదిని దోచెనులే..
కనుల కాటుక కలిగించే చీకటి

నా వెలుగు రేఖలు లే ...
మునులు వోలె - ఆ పెదవి మెరుపు
నను నిలువ నియదులే"

అంత చిన్నప్పుడ ఈ పాట రాయడం ఆశ్చర్యం అనిపిస్తుంది. ఇలా చిన్నప్పటి నుంచి ఆయన్ను ప్రభావితం చేసిన అనేక అంశాలకు పాటరూపం ఇచ్చారు. భక్తితో పాడే భజన పాటలు దాదాపు ఇరవై వరకు రాశారు. అందులోని కొన్ని పాటలు ఇప్పటికి వారి చిన్ననాటి పరిచయస్తులు ముఖ్యంగా ఆర్, చంద్రశేఖర్ ఎక్కువగా పాడుతూ ఉంటాడు..

అలా అంతర్లీనంగా ఆయనలో అప్పటికే సినిమాలకు కథ, మాటలు, పాటలు రాయాలన్న జిజ్ఞాస ప్రబలంగా ఉండేది. అది 2003 సంవత్సరంలో "జాని" సినిమా ద్వార నెరవేరింది. ఈ విషయం ఎందుకు ప్రస్తావించానంటే అందరికి మల్లె ఆయకు ఇష్టాలు, కోరికలు ఉండేవి... కానీ ఈ సమాజంలో అవి నెరవేర్చుకునే హక్కు కొందరికే వుందన్న విషయాన్ని గ్రహించాక నా అవగాహన మారింది. ఈ కుల వివక్ష సమాజం ఎన్ని కోట్ల మంది ఆశలను, ఆకాంక్షలను, మేధస్సును నాశనం చేసిందో...!

అలాంటి ఈ సమాజాన్ని మార్చాలని కుల, మత వివక్ష లేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా సామాజిక న్యాయం ద్వారా సామాజిక మార్పు లక్ష్యంగా ముందుకు నడిచారు. ఆ క్రమంలోఅడుగు బడుగు, బహుజనుల కనీస మానవ హక్కులకు సంబంధించిన పాటలు రాయడం, అలాంటి పాటలు రాసే కవిగానే ఎక్కువ గుర్తింపు రావడం జరిగింది. అయితే ఆయనలో చిన్న నాటి నుండి గూడు కట్టుకొని వున్న ఈ భావగీతాలు బయటకు రావాలని చేస్తున్న ప్రయత్నం ఇన్నాళ్ళకు ఈ వెన్నెల గానం ద్వారా కొన్నింటిని మీకు పరిచయం చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. మస్టార్జీ కన్న తల్లి ఆయనకు జన్మనిచ్చినందుకు ఆ ఇచ్చిన జన్మను సార్థకం చేసుకోవడానికి నిరంతరం కష్టాల కడలిలో తేలుతూ తోబుట్టువులను, ఇంటిల్లిపాదిని ఒడ్డుకు సురక్షితంగా చేర్చిన నాన్నకు కొడుకు అయినందుకు గర్వించారు.. ఆ పుణ్య దంపతుల ఆత్మ గౌరవానికి భంగం కలగకుండా కొనసాగిస్తూ వస్తున్న జీవిత ప్రయాణంలో కౌమార, యవ్వన, ప్రౌఢ, వయసులో కలిగిన అనుభవాల సారంగా వెలసిన ఈ పాటలు మీలోనూ అనుభూతులు కలిగిస్తాయన్న సమ్మకంతోనే ఈ సంపుటిలో పొందుపరిచారు.

వుట్టి ఊహ తెలిశాక అంత్యకులం గొలుసులకు కట్టేసిన శృంఖలాలను తెంచుకునేందుకు పాటను ఆయుధంగా చేసుకుని జీవితమంత మనిషిగా గుర్తింపబడేందుకు పనికొచ్చే పాటలనే రాసారని చాలామందికి తెలుసు, అయితే మనిషి ఏ సిద్ధాంతాలతో, లక్ష్యాలతో జీవితాన్ని అంకితం చేసి ముందుకు సాగినా మనిషికుండే అనేక స్పందనలు కలుగుతునే వుంటాయి. వాటిని కొందరు చెప్పుకోరు. కొందరు రికార్డు చేస్తారు. ఈ క్రమంలో ఒక సామాన్య మానవుడిగా కలిగిన అనుభవాల సారాన్ని అపుడప్పుడు రాసి పెట్టుకున్న పాటలివి.

ఇందులో వారి అమ్మా నాన్నల పాటలతో పాటు మహాకవి, తెలుగుజాతికి గర్వకారణమైన డా? సి.నారాయణరెడ్డి గారిపై రాసిన పాట, సామాజిక తత్వవేత్త బి. ఎస్. గారి జన్మదిన స్వర్ణోత్సవం సందర్భంగా రాసిన పాట, అలాగే అన్నమయ్య కీర్తనలతో ప్రపంచ వ్యాప్తంగా వున్న అన్నమయ్య అనుయాయులచే ముద్దుగా పిలుచు కునే గాన కోకిల శ్రీమతి శోభారాజు గారి పాట, చివరగా ఇందులో చేర్చిన "అందరు బాగుండాలి అందులో నేనుండాలి" అనే పాటని ధాత్రి సంక్షేమ సంఘం సంస్థ కోసం రాసినది. తనువులోని అణువణువు నగం ఆక్రమించిన శ్రీమతి ప్రమీల గురించి రాసిన పాటలు... అదే విధంగా ఆయా సందర్భాలలో వారి చిత్తాన్ని దోచుకున్న వారి గురించి రాసుకున్న కొన్ని పాటలను ఈ సంపుటిలో నేర్చారు.

## ఆధారగ్రంథాలు :

1. దళిత గీతాలు - మాస్టార్జీ, 2. స్త్రీతత్వ గీతాలు - మాస్టార్జి, 3. వెన్నెల గానం 6 మాస్టార్జీ.

BHAVAVEENA
Vol. 21, Issue. 06, June 2024

భావవీణ

ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

# ‘జన’గామ ‘జన’ చైతన్య సారథులు – వయ్యా సోదరులు

– రేషపల్లి భానుచందర్, పరిశోధక విద్యార్థి, డా॥. బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.

**వ్యాస సంగ్రహం:**

నిజాం, దేశ్ ముఖ్, దొరలు, రజాకార్లు ఈ పేర్లు వింటేనే ప్రజల నోట మాట ఆగిపోతుంది అలా మూగబోయిన ఎన్నో గొంతులకు కొత్త మాటలు నేర్పింది తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం.

మోడుబారిన మొండి చింత కు కొత్త చిగురులా.....
బీడు బారిన చేలకు కొత్త ఊపిరి లా....
మొండి బ్రతుకులను మార్చడానికి వచ్చిన కొత్త నెత్తురు లా...

సాయుధ పోరాటం కొత్త ఒరవడిని నేర్పింది. విస్నూరు దేశ్ ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి అంటేనే ఆ రోజుల్లో ప్రజలు గజగజా వణికిపోయేది అలాంటి దేశ్ముఖ్ గడికి బీటలు పారించిన తెగువ సామాన్య ప్రజలకు రావడానికి గల కారణం ఏమిటి?రాచరిక వ్యవస్థను కూకటివేళ్లతో సహా పెకిలించివేసిన ఆ మట్టి మనుషులకు అంత తెగింపు రావటానికి గల కారణం ఎవరు? అక్షరం ముక్క రాని సామాన్య ప్రజలకు వారు ఎదుర్కొంటున్న అన్యాయాలను, అక్రమాలను, దౌర్జన్యాలను వారికి అర్థమయ్యే భాషలో చెప్పి వారిని చైతన్య పరచడం కోసం నాటి నాయకులకు ఒక తిరుగులేని ఆయుధం లా పాట కనిపించింది.

పనితో పాటే పాట పుట్టింది అనేది నానుడి కానీ తెలంగాణ ప్రాంతంలో మాత్రం దొరల మీద పగతో పుట్టింది పాట.. ప్రజా చైతన్యం కొరకు పుట్టింది పాట... ప్రజల కష్టాలను ఏకరువు పెట్టడం కోసం పుట్టింది పాట... పాటను ఆధారంగా చేసుకొని ప్రజా చైతన్య ఉద్యమాలను ఉవ్వెత్తున లేపి ముందుకు నడిపిన ఎందరో కళాకారులు, గాయకులు ఉన్నారు. తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అటు బందూకులతో ఇటు బాణీలతో ఉద్యమంలో పాల్గొన్నారు నాటి కొంత మంది కవులు. అలా ఉద్యమానికి తమ సమస్తాన్ని అర్పించి మరుగున పడిన తొలితరం సోదర కవులు వయ్యా రాజారాం, వయ్యా సామెల్. ఇంతటి ఘనచరిత్ర కలిగిన వయ్యా సోదరులపై పరిశోధన చేయడం చాలా అవసరం. జనగామ ప్రాంతం గేయసాహిత్యంలో పేరొందిన ప్రాంతం కనుక‘జన’గామ ‘జన’చైతన్య సారథులు - వయ్యా సోదరులు అనే అంశంపై పరిశోధన వ్యాసాన్ని గుణాత్మక పరిశోధన పద్ధతి (Qualitative Resarch Method)లో వివరిస్తాను. దీనికోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నేపథ్యంలో వచ్చిన జీవిత చరిత్రలు, కథలు, నాటకాలు, పాటలు, వ్యాససంకలనాలతో పాటు వయ్యా సామెల్ గారి ముద్రిత గేయ సంకలనాలను. విశ్వ విద్యాలయాల స్థాయిలో వచ్చిన పరిశోధనలు, మరియు విమర్శకుల, పరిశోధకుల అభిప్రాయాలను సందర్భోచితంగా విశ్లేషణకు ఉపయోగించుకుంటూ విశ్లేషణాత్మక పద్ధతిలో ఈ వ్యాసాన్ని వివరిస్తాను. జనగామ ప్రాంతంలో నుండి వచ్చిన అనేక సామాజిక జన  చైతన్య పాటలను వాటి తీరు తెన్నులను పరిశీలిస్తూ వయ్యా సోదరుల సాహిత్య సేవను ప్రపంచానికి పరిచయం చేసే ప్రయత్నం ఈ వ్యాసం ద్వారా చేస్తాను.

**కీలక పదాలు** : సోదర కవులు, తెలంగాణ సాయుధ పోరాటం, సామాజిక చైతన్య గేయాలు, బుర్ర కథ, అభ్యుదయ భావజాలం, వెట్టి చాకిరి, కులవ్యవస్థ.

**ఉపోద్ఘాతం :**

నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో పాటలు తిరుగులేని ఆయుధంగా పని చేశాయి. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సుపరిచితమైన వ్యక్తి సుద్దాల హనుమంతు గారు కానీ అతనితో పాటు సమానంగా పాటలు రాసి పాడిన వాగ్గేయకారుడు వయ్యా రాజారాం మరియు అతని సోదరుడు సామెల్ సామాజిక చైతన్య

పాటలు రాసి పాడటంలో ఎంతో పేరు పొందినవారు వీరి పాటల గురించి ఈ వ్యాసంలో కొంత పరిచయం చేయడం జరుగుతుంది.

నేటి జనగామ జిల్లా దేవరుప్పుల గ్రామంలో వయ్యా ముత్తయ్య రాములమ్మ అనే నిరుపేద దళిత దంపతులకు జన్మించారు వయ్యా రాజారాం.నిజాం నిరంకుశ పాలనలో విస్నూర్ దేశముఖ్ రాపాక రామచంద్రా రెడ్డి దౌర్జన్య పాలనకి నిర్భయంగా ఎదురునిల్చి తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి సమిదను వెలిగించిన షేక్ బందగి ప్రాణ త్యాగాన్ని తల్లి గర్భంలో నుండే ఆకలింపు చేసుకొని బందగి మరణించిన సంవత్సరం లోనే అదే గ్రామంలో 26-06-1940 లో జన్మించాడు వయ్యా సామెల్.ఆధునిక కాలంలో పాటను ఒక చైతన్య సాధనంగా గుర్తించవచ్చు. ప్రత్యేకించి తెలంగాణ ప్రాంతం ఉద్యమాల ప్రాంతం కనుక ఈ నేల మీద జరిగిన అనేక ఉద్యమాలలో పాట క్రియాశీలకమైన పాత్రను పోషించింది. అందులో భాగంగా ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి వేదిక అయినా జనగామ ప్రాంతం నుండి వచ్చిన పాటలను పరిశీలించడం మన యొక్క బాధ్యత. కొంతమంది తమ జీవితంలో జరిగిన అనేక సంఘటనలో క్రియాశీలకమైన పాత్రను పోషించి ప్రజా రంజక విధానాలతో ప్రజలను చైతన్య పరుస్తారు. కానీ కాల క్రమంలో వారి యొక్క సేవలను, గొప్పతనాన్ని ప్రజలు మర్చిపోవడానికి అవకాశాలున్నాయి. దానికి కారణాలు అనేక రకాలుగా ఉంటాయి. అయితే అలాంటి వారి యొక్క గొప్పతనాన్ని సమాజానికి అందించడం పరిశోధకులకి ఉన్న ఉత్తమ లక్షణం. జనగామ ప్రాంతంలో పేరుపొందిన కవులు వయ్యా రాజారాం, వయ్యా సామెల్ సోదరులు. ఇలాంటి వారి యొక్క పాటలని ఆధారంగా చేసుకుంటూ ఈ పరిశోధన వ్యాసం రాయడం జరిగింది.

### రాజారాం రాసిన ప్రముఖ పాటలు :

1.వాలంటీరు లారా! 2.పనిపాటలోళ్ళ పాట 3.శ్రద్ధగా వినరన్నా 4.దున్నే వానిదే భూమి5.దౌర్జన్య రాజ్యం 6.పోరాటం మరువ లేదు 7.కష్ట జీవుల కంచు రథం 8.దౌడు తీయి దౌడు తీయి 9.గురిగింజ గురి మల్లెలో 10.చిలుకా 11.పంచ సూత్రముల ప్రణాళిక గీతం 12.ఎర్రమ రెడ్డి కొండల్ రెడ్డి పాట 14.చైనా పాట 15. యశ్వంతపూర్ ఘటనపై పాట 16.దొడ్డి కొమురయ్య పాట 17.పోతున్నవ బావ 18.అత్తగారింటికి కొత్తంగ పోతున్న 19.సూర్యాపేట పోలీస్ చర్య 20.ఎలుకలు మద్దెల కొట్టంగపిల్లి నాట్యం చేయంగాఇతర అనేక చిలిపి పదాలు

### వయ్యా సామెల్ రచనలు :

వయ్యారి పాటలు (1998), జానపద గేయాలు (1999), జనగర్జన (1999) , గళ గర్జన (2000) , వయ్యా సామెల్ పాటలు (2003), నలుగుతున్న గేయాలు (2004), స్వర్ణాంనదకార గేయాలు (2005), ఇదీ సంగతి గేయాలు (2006), ప్రజావాణి నా బాణీ పాటలు (2007), అడవులను పెంచండి (బుర్రకథ 2007), అక్రమార్కం కవితలు (2007) పిట్టలదొర ఏకపాత్రాభీనయం (2008), పాటల తోట గేయాలు (2011), పొరుగీతం పాటలు (2013), మానవుడా గేయాలు (2014), పాటల చెరువు గేయాలు (2015), హరిత హారం గేయాలు (2016), ప్రజాకంటకులు గేయాలు (2017) మొత్తం 15 పాటల సంకలనాలు, 2 కవిత సంపుటాలు ఒక బుర్రకథ, ఏకపత్రాబినయం వంటివి సామెల్ కలం నుండి వెలువడ్డాయి.

### వివరణ:

#### వయ్యా రాజారం:

కుల పిచాచి రాజ్యమేలుతున్న ఆ కాలంలో రాజారాం కూడా అనేక అవమానాలకు గురయ్యాడు. చదువు అంటే అతనికి ప్రాణం అక్షరాన్ని దైవ సమానంగా చూసేవాడు. కానీ నాటి సమాజ పరిస్థితుల దృష్ట అతనికి చదువు అనేది ఒక కలగానే మిగిలిపోయింది. అలాంటి సమయంలో సంఘం వారు పెట్టిన రాత్రి బడి అతని జీవితంలో ఒక

విప్లవ జ్యోతిని వెలిగించింది. పొద్దంత పశువులను కాస్తూ రాత్రి సమయాల్లో అక్షరాలు నేర్చుకునే వాడు

మోట కొడుతూ తండ్రి పాడిన పాటలు....
కలుపు తీస్తూ వాళ్ళ అమ్మ పాడిన పాటలు...
పశువులను కాస్తూ తాను పాడిన చిలిపి పదాలు..

సంఘం పాటలుగా మారాయి. తల్లి నోట విన్నా కలుపు పాట దొరల పొలంలో పనులన్ని బందు చేయించింది. మోట కొడుతూ తండ్రి పాడిన పాట దొర గడి మీద విజయ ఢంకా మోగించింది. ఊహ తెలిసినప్పటి నుండి దొర దౌర్జన్యంలను చూసిన రాజారామ్ అక్షరాన్ని ఆయుధంగా మార్చి ఏ దొర దగ్గర అయితే బడితగా పని చేశాడో....ఏ దోరను అయితే బాంచెన్ కాల్మొక్త అన్నాడో... ఆ దొరనే పరుగులు పెట్టించేలా పాటలు పాడాడు. తగిన వయసు లేదని సంఘం వారు పార్టీలోకి తీసుకోకపోవడం వల్ల బాల సంఘాలను నిర్వహించాడు. వేదికల మీద సంఘం పాటలు పాడటానికి ఎంత పెద్ద సభ అయిన రాజారాం కావలసి వచ్చేది. రాజారాం శ్రామికవర్గ కవి ఈయన పాడిన పాటలన్నీ శ్రమజీవుల కు కంఠా పాఠాలు. ఆనాటి జనగామ తాలూకా లో రాజారాం అన్న.. రాజారాం బుర్రకథలు అన్న తెలియని వ్యక్తి లేడు. రోకలి పాటల్లోగానీ, ఉయ్యాల పాటల్లో గానీ, మోట కొడుతూ పురుషులు పాడే పాటల్లో గానీ రాజారాంను మించిన గాయకుడు లేడు అనడం అతిశ యోక్తి కాదు. పోరాట ప్రారంభంలో వాలంటీర్లను ఆహ్వా నించడం నుంచి మొదలు... తెలంగాణ ప్రజానీకం కన్ను తెరిచి ప్రళయ కాలాన్ని అంతం చేసేందుకు దళాలను నిర్మించే దాకా.. రాజారాం తన జీవితంలో ప్రతి నిమిషం తెలంగాణ ప్రజా విముక్తి కోసమే త్యాగం చేసిన గొప్ప వ్యక్తి. కటిక పేదరికంలో ఉన్న రాజారాం తన సాహిత్య ప్రస్థానంలో మొదట చిలిపి పాటలతో తన స్నేహితులతో కాలక్షేపం కోసం పాటలు రాసేవారు. ''అత్తగారింటి కొత్తంగా పోతున్న / కుత్తంగా నా రైక కుట్టాలనోయ్...అనే పాటలో కొత్తగా పెళ్ళయిన ఆడపిల్ల తన కోరికలు ఎలా ఉన్నాయో బట్టలు కుట్టే వ్యక్తి చెప్పిన విధానం ఇప్పటి జానపద పాటల్లో కూడా మనం విరివిగా చూస్తున్నాం. అదే విధంగా..

''పోతున్నవా బావ ఇకమకమన్నాజూపు బావ / నీపై ప్రేమ నిలిచిఉండగా
నిను బాచి నిదురేట్ల బోదు / నిలవలేదు మోము
నీపై నిండి వుండే ప్రేమ''

అంటూ బావమర్దళ్ళ ప్రేమలో ఉన్న ఆప్యాయత ను సులభమైన భాషలో వివరించారు.

''కలుపు వలపు కులుకంతా నీదే /వయసులున్న వయ్యారం నీదే
అందాలను దెంచు బావ బంధాలను దెంచు''
''ఆల్ రైటు ఆలిండియా బోధం / కాలినడకన కదనం జుద్దం''

అంటూ జంటపదాలను ఉపయోగిస్తూ పాటలను రాయడం ఇతని ప్రత్యేకత ఇక చివరలో ఆనాటి స్వతంత్ర పోరాటాన్నీ ప్రజలకి పరిచయం చేసే ప్రయత్నం చేశారు. రాజరాం పుట్టిన ఊరికి కూతపెట్టు దూరంలో ఉన్న కామారెడ్డి గూడెంలో విసునూరు దేశముఖ్ రాపాక రామచెంద్ర రెడ్డిని ఎదిరించిన షేక్ బంధగి హత్య రాజారాంని కలసి వేసింది. అతని వీరత్వాన్ని గుర్తిస్తూ అనేక పాటలు రాసి తన స్నేహితులకు పాడి వినిపించే వాడు. 1944లో జరిగిన 11వ ఆంధ్రమహాసభ వల్ల 1944 అక్టోబర్ 2 నాడు పిట్టల నర్సయ్య నాయకత్వంలో మరిపడగలో, 1944 అక్టోబర్ 3 నాడు నల్లా నరసింహులు గారి నాయకత్వం లో కడవెండి లో సంఘం స్థాపన జరిగింది ఈ సంఘటన రాజారాం జీవితంలో పెను మార్పులు తీసుకవచ్చాయి. దొరల అన్యాయాలను కళ్ళరా చూసిన రాజారాంకి సంఘం ఒక మహా శక్తిగా కనిపించింది. కమ్యూనిస్టులతో కలిసి సాయధ సంగ్రామంలో పాల్గొనా లని ప్రయత్నించిన చిన్న వయస్సు కారణంగా రాజారాంని బాలసంఘాలా భాధ్యతలు అప్పగించారు. ఆనాటి నాయకులు ఆ తరువాత సంఘం వారు పెట్టిన రాత్రి

ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

బడులు రాజారంని ప్రముఖ వాగ్గేయకారునిగా మలిచాయి.

"వాలంటిరు లారా / మీరందరు వినుడి
ప్రాణములనర్పించి / పైకి నడువండి
దేశ సేవకోరకు దీక్షబునండి
దాసులై యుండఁడి దేశంబు కెల్లా"

(జయదీర్ తిరుమల రావు, 1990జనవరి, తెలంగాణ పోరాట పాటలు, పుట-34)

అనే పాట సంఘం వారికి ఒక మార్చింగ్ సాంగ్ లా మారింది ఈపాటలో.....

"ప్రజా రాజ్యంకోసం పోరాడండి / దెబ్బకు జైలుకు బయపడకండి
నాజీ నైజాం నరహంతకిన్ని /పడగొట్టి తొడగొట్టి పైకి నడువండి
కదలండి కడలంది కదన భూమికి /ఎత్తండి ఎత్తండి మన ఎర్ర జెండలెగురాలి"

(జయదీర్ తిరుమల రావు, 1990జనవరి, తెలంగాణ పోరాట పాటలు, పుట-34 )

అంటూ నిజాం రాజు పైకి ప్రజలను పంపడంలో ఆరోజు సాయుధ పోరాటానికి ఈ పాట ఒక వజ్రాయుధం గా పనిచేసింది యువకుల్లో కొత్త రక్తాన్ని ఎక్కించిది.కష్ట జీవుల కంచు రథం అనే పాటలో,

కష్ట జీవి కన్నుమూసి / నిష్ఠతోడ నిలుపచూపి
బష్టులను పారదోలి / దుష్ఠ లంతా నష్టపడగా
కదిలింది కంచురథం నేడు..

(జయదీర్ తిరుమల రావు, 1990జనవరి, తెలంగాణ పోరాట పాటలు, పుట-117 )

అంటూ కవిగా తన పరిపక్వతని నిరూపించుకొని గొప్ప కవుల సరసన నిలబడేలా చేసుకున్నారు రాజారాం. అలా అనేక గ్రామాలు తిరుగుతూ బుర్రకథలు చెపుతూ ఉద్యమానికి ఊపిరిపోసాడు. గేయ సాహిత్యంలో రాజారాం కట్టని బాణీ లేదు రాయని పాటలేదు ఉయ్యాల పాటలు, రోకలి పాటలు, మోటపాటలు, కోలాటం పాటలు, నాట్ల పాటలు, బుర్రకథలు ఇలా అనేక రకాల పాటలు రాసి పాడి తెలంగాణ సాయుధ పోరాటంలో తనంకంటూ ఒక పేజి ని రాసుకున్న వ్యక్తి వయ్యా రాజారాం."గురిగింజ గురిమల్లెలో" అనే పాటలో

"మున్నాళ్ల మురిపెంకు మురిసేవు తరసేవు ముందుగతి కానవే సీలక" అనే పాటలో తాత్విక చింతనతో ప్రజాదోపిడి విధానాలను కళ్ళకు కట్టినట్టు చూపించారు. అంతేకాకుంకుండ

"దొడు తీయి దొడు తీయి
ఇంగిలిసు లాంగదొర
ఇండియాల గండమని
ఇంకనికు తెల్వదార"

(జయదీర్ తిరుమల రావు, 1988, తెలంగాణ రైతాంగ పోరాటం ప్రజా సాహిత్యం)

అంటూ తన బాణీలను కేవలం తెలంగాణ ప్రాంత సమస్యపై కాకుండా భారత స్వాతంత్ర్య పోరాటం పై కూడా గుళిపించాడు.

"పోతుంది పోతుంది దోపిడీ రాజ్యం
వస్తుంది వస్తుంది పేదోళ్ల రాజ్యం"అని గట్టిగా నమ్మిన వ్యక్తిపుట్టినప్పటి నుండి తన చుట్టూ సామాన్య జనాలపై జరుగుతున్న అనేక రకాల దౌర్జన్యలను కల్లారా చూసిన రాజారం గారు తన గళం ద్వారా వారికి జరిగే అన్యాయాలను పాటల రూపంలో వివరించారు

దున్నపోతులకు క్షవరం దూడ బర్రెలకు క్షవరం
మొలక క్షవరం దొరలకు మొల క్షవరం తల క్షవరం
తలల కంటి పోయాలి తడయక ముని మాపులో
దీపాలు వెలిగించి దిండ్లు పడకలు పరిచి
కాళ్లు పిసికి మధ్యరాత్రి కదలాలి తన ఇంటికి"

(జయదీర్ తిరుమల రావు, 1988, తెలంగాణ రైతాంగ పోరాటం ప్రజా సాహిత్యం, పుట-43)

అని ఆనాటి వెట్టిచాకిరి విధానాన్ని ప్రపంచానికి తెలియజేసాడు. సాయుధ పోరాటం మొదలై వాలం

టిరుల్ని ఆహ్వానించడం నుంచి మొదలు ప్రజలు కన్నెర్ర జేసీ నిజాం నిరంకుశ పాలనను కూకటివేళ్ళతో కూల్చి వేయడం కోసం దళాలను నిర్మించే వరకు పోరాట గీతాలు పాడిన ప్రజాకవి రాజారాం. పదహారేళ్ళ వయసులోనే 'మీర్జా ఇస్మాయిల్ ఆర్డర్' కింద నిర్బంధానికి గురై జైలులో ఆరు నెలలు శిక్ష అనుభవించి జైలులోనుండి దళ సభ్యుడిగా జన హృదయంలోకి వెళ్లిన వ్యక్తి. సాయుధ పోరాటం ముగిసిన తరువాత కూడా భూదానోద్యమంలో, ప్రజా సమస్యల్లో మరియు పార్టీ ఎన్నికల్లో, తన పాటలతో పాల్గొన్నారు.

"పాత రోగములకు మందు ఇది పాత రోగము లకు మందు
ఇందిరా ఫార్ములా అందించినా మందు
20 సూత్రాల ఇంపైన ఈ మందు"

అంటూ ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన 20సూత్రముల ప్రణాళికలపై పాటలు రాసి వాటి సారాంశంను ప్రజలకి చేరవేయడంలో తన వంతు పాత్రను పోసించారు.తన జీవిత చరమాంకం వరకు ప్రజలకొరకె తన కాలాన్ని కలాన్ని ఉపయోగించిన రాజారాంను చరిత్ర కాలగర్భంలో కలిపింది.

**వయ్యా సామెల్ :**

బందగి బలిదానాన్ని బాల్యం నుండే కథలు కథలుగా వింటూ వచ్చిన సామెల్ భూస్వాయ్య, రాచరిక వ్యవస్థను అవగాహన చేసుకున్నాడు. అప్పటికే తన అన్న వయ్యా రాజారాం ఆంధ్ర మహాసభ కార్యకర్తగా జనగామ తాలూకాలో తన పాటలతో ప్రజల్ని ఉద్రూత లూగిస్తున్నాడు. బందగి స్ఫూర్తి పోరాట పటిమను నేర్పిస్తే, అన్న రాజారం పాటల ప్రభావం సామెల్ ని ప్రజా ఉద్యమ కవిగా మార్చింది. సామెల్ కుటుంబం మొత్తం ప్రజా పోరాటల్లోనే గడిపింది. 1946 లో నిజాం రజాకార్ సైన్యం దేవరుప్పుల గ్రామంపై దాడి చేసి 460 మందిని అరస్ట్ చేసారు అందులో సామెల్ తండ్రి ముత్తయ్యని అన్న రాజారాంని రాజద్రోహం నేరం కింద జైల్లో పెట్టారు. ఈ సంఘటన సామెల్ జీవితంలో ఒక పెను మార్పు తెచ్చింది. నాన్న అన్న ఆశయ సాధనలో తన వంతు కృషిచేసి సఫలీకృతం అయ్యాడు సామెల్. మొదట ఆంధ్రమహాసభలో తర్వత కంమ్యూనిస్ట్ పార్టీలో చాలా సంవత్సరాలు పనిచేసి కంమ్యూనిస్ట్ పార్టీల్లో వచ్చిన చీలికల తర్వాత కాంగ్రెసు పార్టీలో చేరాడు. సామెల్ కుటుంబ నేపథ్యం కారణంగా చదువుకునే అవకాశం లేకపోయిన అన్న రాజారంతో కలిసి సంగం వాల్లు పెట్టిన రాత్రి బళ్ళో అక్షర జ్ఞానాన్ని పొంది పాటలు రాసేవాడు. తన 14వ ఏటా తంబూర పట్టిన సామెల్‌కి నీరటి మల్లయ్య, బొజ్జా ఎల్లయ్యలు వంతలుగా చెరో పక్క చేరారు. మొదట్లో ప్రజాకవులు తిరునగరి రామాం జనేయులు, వయ్యా రాజారాం, సుంకరి సత్యనారాయణ వంటి వారు రచించిన బుర్రకథలు చెప్పడంతో తన సాహిత్య రథాన్ని ప్రారంభించిన సామెల్ అనతికాలంలోనే తెలుగు సాహిత్యంలో తన పేరును చిరస్థాయిగా నిలుపు కున్నాడు. వామపక్ష విప్లవోద్యమ భావజాలాన్ని పునికి పుచ్చుకుని నక్సల్ బరి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని చాలా కాలం అజ్ఞాన జీవితాన్ని గడిపాడు. అటు ఆయుధంతో ఇటు అక్షరాయుధంతో ప్రజా సమస్యలతో పోరాటం చేశారు సామెల్. తన కవితల్లో, పాటల్లో తను స్పృశించని అంశం లేదు తెలంగాణ సాయుధ పోరాటం, అభ్యుదయ వాదం, వామపక్ష భావజాలం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, రాజకీయ నాయకుల దౌర్జన్యాలు, దేశ భక్తి, దళిత వాదం, స్త్రీ వాదం, బహుజన వాదం, సామాజిక చైతన్యం, పర్యావరణ పరిరక్షణ, అక్షరాస్యత, నిరుద్యోగ సమస్యలు, మూడనమ్మకాల నిర్మూలన, ఇలా అనేక సమస్యలపై తన కలాన్ని గళన్నీ విపించారు సామెల్ గారు. అలతి అలతి పదాల కూర్పుతో పాటలు కవితలు రాస్తూ సామాన్య ప్రజానీకానికి సులభంగా అర్థం అయ్యే విధంగా రచనలు చేయడం ఈయన ప్రత్యేకత. నిజాం రాజు నుండి నేటి వలస పాలకుల వరకు తెలంగాణ ప్రజల పక్షాణ నిలబడ్డాడు సామెల్.

"నా పాటలు / పదిమంది గొంతు నుండి పాడి
ప్రజలను ఉత్తేజ పరుచుట కొరకు/ విశ్వంలోని
చీకటిని తొలగించి

వెలుతురుని ప్రసరింపజేయుట కొరకు" అని మన దోసిలళ్ళలో అనేక జానపద గేయాల ముత్యాలను గుమ్మరించాడు. "అగ్గి పుల్ల - కుక్క పిల్ల" కాదేదీ కవితకనర్హం అని మహా కవి శ్రీశ్రీ అంటే

"మట్టి ముద్ద / పచ్చ చెట్టు
పదును గొడ్డలి / పడక గది
దూప బుడ్డి / ఈత చాప నేత గుడ్డ" అన్నీ కవిత
వస్తువులే అంటాడు సామెల్.

"కోటి వీణ తెలంగాణ / కూటికి గతిలేని వీణ
లక్షల ఎకరాల భూమి / బీడులుగా మారిపోయే"
అంటూ కోట్లాది తెలంగాణ ప్రజల ఘోషను అక్షర బద్ధం చేశాడు.

"ఉంది లేని అన్నము తింటూ/ఊరికొక రోజుఉంటూ
ఎత్తిన తుపాకి దించకుండా / ప్రజల కొరకు
పోరాడుతున్నారు"

(సామెల్ వయ్యా, 2004 జనవరి, నలుగుతున్న గేయాలు పుట-51)

అని విప్లవయోదుల త్యాగాలకి అక్షర నీరాజనం చేశాడు. సామల్ తన బాణీలను ప్రజా ఉద్యమాలకే పరిమితం చేయకుండ సామాజిక స్పృహ, పర్యావరణ పరిరక్షణ, వంటి అంశాలపై కూడా రాయడం విశేషం "అడవులను పెంచండి" అనే బుర్రకథను రాసి అనేక గ్రామాల్లో ప్రదర్శించాడు. విప్లవోద్యమ అజ్ఞాత జీవితాన్ని విడిచిపెట్టాక పోలీసు వారి నిర్భందాలకి తట్టుకోలేక తన నివాసాన్ని రాజధాని హైద్రబాద్ కి మార్చాడు అభ్యుదయ రచయితల సంఘం (అరసం)లో చేరి అరసం కార్యవర్గ సభ్యులుగా పనిచేసి పూర్తి స్థాయి కవిగా పరిణతి చెందాడు. స్వేచ్ఛగా పూర్తి స్థాయీ లోప్రజా సమస్యలపై రాజకీయ నాయకుల వైఫల్యాలను ఎండగట్టె విధంగా పాటలు, కవితలు రాశాడు.

"అవినీతి అదరగొట్టే / అక్రమాల తరిమి కొట్టి
అన్యాయం ఎదిరించిన వాడే / అసలైన నాయకుడు"
"వస్తరు మల్లోస్తారు అవినీతి నాయకులు
ఓట్లకు మల్లోస్తారు ప్రజలదోచే పాలకులు"

(సామెల్ వయ్యా, 2004 జనవరి, నలుగుతున్న గేయాలు పుట-37 )

నేటి స్వార్ధ రాజకీయ నాయకుల స్వభావాన్ని తెలిపి ప్రజలకి తన పాటల ద్వారా హితభోద చేసిండు.

"మన శ్రమను దోచుకొని మరిగి బలిసిన వాళ్ళను
మంచ కాడి మడుగులో తొక్కాలిరా అన్న"

అని శ్రామికులని చైతన్యపరిచాడు. "అక్షరాలు నేర్చుకో" "అడవులను పెంచండి" అనే బుర్రకథ లని ఆకాశవాణిలో చెప్పాడు. సామెల్ గారికి దేశమన్న దేశసమైక్యతన్న మమకారం ఎక్కువ అన్నీ మతాల వారు కులాల వారు కలిసి వుండాలని కాంక్షిస్తూ

"ఎగసిపడే కేరటమ / వెనకబడకు మిత్రమా
దేశమూ కోసము నీవు / యోచనలు చేయుమా
యువకులారా యువతులారా / భరత మాత
బిడ్డలారా
మతాలన్నీఒక్కటై / శత్రువులను తరిమేయరా"

(సామెల్ వయ్యా, 2000 జనవరి, హైద్రాబాద్, గళ గర్జన పాటలు, పుట-42 )

అంటూ దేశంపై మేలుకొలుపు గీతాన్ని ఆలపించాడు సామెల్. అన్న రాజారం మరణం ఒక రకంగా కలిచివేసిన తన ఆలోచన దృక్పధం మాత్రం మారలేదు అన్న పై కూడా ఒక స్మృతి గీతాన్ని రాసి ఆలపించాడు సామల్ దోపిడి రాజ్యం తీరుతెన్నులఱు కళ్ళకి కట్టినట్లు అనేక పాటలల్లారు. అవినీతి పాలనపై ఆగ్రహం. వరకట్న దురాచంపై నిరసన, సారా నిషేధం సందర్భంగా నాయకుల రెండునాల్కల ధోరణిపై కోపం, రైతుల ఈతిబాదలపై సానుభూతి, అధికార దుర్వినియోగం పై అసహనం, దొంగ బాబాల మోసలపై ప్రతిఘటన, ప్రజా పోరాటలతో మమేకం అవుతూ అనేక పాటలు రాశారు.

శ్రవ్యమైన జానపద బాణీలు, స్వచ్ఛమైన జానపద భాష, కమ్మని వినసొంపైన స్వరం మేలు కలయికగా సాగే సామెల్ పాటలు ప్రజానీకాన్ని ఉర్రూతలుగిస్తాయి. తన జీవిత పర్యంతం ప్రజల కొసమే తన కవిత్వాన్ని అంకితం చేసిన సామెల్ గారు వయ్యారి పాటలు (1998), జానపద గేయాలు (1999) జనగర్జన (1999), గళ గర్జన (2000), వయ్యా సామెల్ పాటలు (2003), నలుగుతున్న గేయాలు (2004), స్వర్ణాంనదకార గేయాలు (2005), ఇదీ సంగతి గేయాలు (2006), ప్రజావాణి నా బాణీ పాటలు (2007), అడవులను పెంచండి (బుర్రకథ 2007),అక్రమార్కం కవితలు (2007) పిట్టలదొర ఏకపాత్రాభినయం(2008), పాటల తోట గేయాలు (2011), పొరుగీతం పాటలు (2013), మానవుడా గేయాలు (2014), పాటల చెరువు గేయాలు (2015), హరిత హారం గేయాలు (2016), ప్రజాకంటకులు గేయాలు (2017) మొత్తం 15 పాటల సంకలనాలు, 2 కవిత సంపుటాలు ఒక బుర్రకథ, ఏకపత్రాభినయం వంటివి సామెల్ కలం నుండి వెలువడ్డాయి.

హైద్రాబాద్ నగర అరసం అద్యక్షులుగా సేవలు అందించాడు. ఈయన సేవలకి గుర్తుగా సాహితి రత్న బిరుదుతో గౌరవించారు. తన జీవిత పర్యంతం ప్రజల కొసమే తన కవిత్వాన్ని అంకితం చేసిన సామెల్ గారు 09/01/2019 నాడు స్వర్గస్తులైనారు.

అలనాటి ప్రజానీకం ప్రజా వాగ్గేయకారులని గుర్తించిన కొందరి ఆధిపత్య ధోరణి వల్ల వెనకబడిన వర్గం అని అన్ని విధాలుగా చరిత్ర వయ్యా సోదరుల సాహిత్య సేవని మరుగునపడేసింది. ఇకనైనా ప్రభుత్వం వయ్యా రాజారం, వయ్యా సామెల్ వంటి చరిత్రకెక్కని చరితార్థులను గుర్తించి ఇలాంటి ప్రజా వాగ్గేయకారుల పై సమగ్రమైన అధ్యయనం చేయాలని కోరుకుందాం....

**ఉపయుక్త గ్రంథ సూచీ :**


1. జయదీర్ తిరుమల రావు, 1990జనవరి, తెలంగాణ పోరాట పాటలుబీ ప్రథమ ముద్రణ పద్మావతి ప్రింటర్స్, హైదరాబాద్.
2. సామెల్వయ్యా, 2000 జనవరి,హైద్రాబాద్,గళ గర్జన పాటలు,విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
3. సామెల్ వయ్యా, 1998ఏప్రిల్,చిక్కడపల్లి, హైదరాబాద్,జానపద గేయాలు, ప్రజాశక్తి బుక్ హౌస్.
4. సామెల్ వయ్యా, 2004 జనవరి, నలుగుతున్న గేయాలు, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ప్రచురణ.
5. సామెల్ వయ్యా, 2014, హైదరాబాద్, బ్రతుకు పాట, స్వంత ప్రచురణ.


❖❖❖

# ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రముఖ క్రైస్తవ సంఘాల చరిత్ర – సాహిత్య దృక్కోణం

– కురపట్ల రాజు, పరిశోధక విద్యార్థి, మద్రాసు క్రైస్తవ కళాశాల, తాంబరం, చెన్నై.

## పరిచయం :

భారతదేశం పూర్వం నుండి అనేక మతాలను అనేక భాషలను తనలో కలుపుకుంటూ వస్తుంది. సమాజంలో భిన్నమైన సాంప్రదాయాలు కలిగిన మానవుడు మతం అత్యంత ప్రాధాన్యమైనదని భావించాడు. మతం అనేది మానవ జీవితంలో నరనరాన్న జీర్ణించుకుపోయిందంటే ఆ మతానికున్న ప్రాధాన్యత ఎలాంటిదో మనం గమనించవచ్చు. సమాజంలో మానవుడు సరైన మార్గంలో నడవాలన్నా, మంచి వ్యక్తిగా నియమ నిబద్ధతలు కలిగి జీవితాన్ని జీవించడం, జాలి, దయ, కరుణ మొదలైన గుణాలను కలిగి ఉండాలనీ ప్రతి మతము మనకు చెబుతుంది. మన దేశంలో బౌద్ధ మతం, జైన మతం, సిక్కు మతం, ఇస్లాం మతం, హిందూ మతం, ఇవేకాక దేవుడు లేడని వాదించే నాస్తిక సంఘాలు ఉన్నాయి. మన సమాజంలో ఉన్న ప్రజలు పైన తెల్పిన ఏదో ఒక మతాన్ని తప్పనిసరిగా ఆచరిస్తూ వుంటారు. దేవుని రూపాన్ని తమ మనస్సులో రూపొందించుకొని పూజించే వాడిని ఆస్థికుడని, దేవుడు లేడు, దెయ్యం లేదు అని నమ్మే వాళ్ళని నాస్థికులని పిలుస్తారు. అయితే పైన తెల్పిన మతాలలో రాజకీయ, సాంఘీక, సామాజిక రంగాలలో గొప్ప మార్పులు తీసుకొచ్చినది మాత్రం క్రైస్తవులే అని చెప్పవచ్చు. భారతదేశమునకు క్రైస్తవమతం ప్రాశ్చాత్యుల ద్వారా వచ్చింది. క్రైస్తవ్యాన్ని మొట్టమొదటిగా భారత దేశమునకు పరిచయం చేసింది యేసుక్రీస్తు 12 మంది శిష్యులలో ఒకరైన తోమా అని చెప్పాలి. తోమా మొదటి శతాబ్ధం క్రీ॥శ॥ 52 లో పర్షియా దేశం నుండి దక్షిణ భారతదేశంలో మలబారులోని పెరియారు నది తీర ముఖ ద్వారమున ఉన్న క్రాంగనూరు చేరి అక్కడ మత ప్రచారం చేస్తూ కాళి, కళియంకారు, శంకరపురి, పాకలో మట్టం అనే ఇంటిపేరు కలిగిన నాలుగు బ్రాహ్మణ కుటుంబాల వారి క్రైస్తవులుగా చేశారు. భారతదేశంలోని ప్రథమ క్రైస్తవ కుటుంబాల వారు వీరే అని చరిత్రకారులు నిర్ధారణ తోమా పైన తెల్పిన కుటుంబాల వారిని క్రైస్తవులుగా చేసిన అనంతరం వారికి క్రైస్తవ మత సిద్ధాంతాలను తెలియజేసి, ఆచార వ్యవహారాలు అలవాటు చేసి క్రాంగనూరుకు దక్షిణంగా ఉన్న మలియన్‌కార, పాలయార్, గోక మంగళం, నీరాణం, చాయల్, క్విలాన్ అనే ప్రాంతాల్లో క్రైస్తవ మత ప్రచారం చేసి మత బోధక సంఘాలను స్థాపించాడు. తరువాత తోమా చెన్నై ప్రాంతం చేరి మత ప్రచారం చేస్తూ అనేకులను క్రైస్తవులుగా మార్చినందున అక్కడి పురోహిత వర్గం క్రీ॥శ॥ 72లో తోమా పై ఈటెలతో దాడిచేసి, పొడిచి చంపారు. అది నేడు శాంతోయ్ లేదా సెయింట్ థామస్ మౌంట్‌గా వ్యవమరించబడుతుంది. పరి తోమా క్రైస్తవులను పేరుగల “సిరియన్ క్రైస్తవులకు, ప్రాశ్చాత్య దేశాలైన తూర్పు సిరియా, మెసపోటోమియా, పర్షియా మొదలైన దేశాలలోని క్రైస్తవుల రాకపోకలు, మత సంబంధమైన సంబంధాలు ఉండేవి. భారతదేశములో 15, 16 శతాబ్దాలలో విదేశీయుల రాకపోకలు వ్యాపార నిమిత్తం జరుగుతూ వచ్చాయి. వాస్కోడిగామా అనే నావికుడు పోర్చుగీసు నాయకత్వాన లిక్సన్ ఓడరేవు నుండి బయలుదేరి 1498 మే 20వ హిందూ దేశములో పశ్చిమ తీరమునున్న కోజికోడులో లంగరు వేయడంతో వాణిజ్యంలోనూ, క్రైస్తవ మత ప్రచారంలోనూ నూతన అధ్యాయం ప్రారంభమయింది.

ఈ సంస్థ పక్షాన ఫ్రాన్సిస్ జేవియర్ భారతదేశమునకు 1542 మే 6న పశ్చిమతీరంలో గల గోవాకు వచ్చాడు.

అప్పటికి గోవా ప్రాంతం పోర్చుగీసు వైస్‌రాయి అయిన ఆల్ఫంజో ఆల్బుకర్క్ ఆధీనంలో ఉండేది. ఈయన జేవియర్‌కి అఖండ స్వాగతం చెప్పి, మత ప్రచారానికి కావల్సిన ఏర్పాట్లు చేశారు. వీరి తరువాత రాబర్ట్ డి నోబిలి అనే మిషనరీ ముఖ్యుడు. ఇతడు క్రీ॥శ॥ 1626 లో మధురలో అడుగుపెట్టాడు. ఈయన సన్యాసి వేషం ధరించి హిందూ ఆచారాలను పాటిస్తూ క్రైస్తవ మత ప్రచారం చేశాడు. తాను రోమాపురి సన్యాసి మండలానికి చెందినవాడనని, తన పేరు తత్త్వబోధనందస్వామి అఇ ఆయన చెప్పుకున్నాడు. ఇతని తరువాత పోర్చుగీసు వారికి అన్ని అనుకూలంగా ఉండటంతో అప్పటి ఫ్రెంచి పాలకుడగు 14వ లూయిా ఆరుగురు మత బోధకుల్ని క్రీ॥శ॥ 1700లో పుదుచ్చేరికి పంపాడు. తద్వారా కర్ణాటిక్ మిషన్ స్థాపించబడింది. 1706లో బర్తలోమ్యూజిగెన్ బాగ్ మరియు హెన్రిచ్ ప్లుచ్చరాకతో భారతదేశంలో ప్రొటెస్టెంటు క్రైస్తవ్యం మొదలైంది. వీరు మొదట ట్రాంక్ బార్ మిషన్‌ను స్థాపించారు. వీరి తరువాత క్రీ॥శ॥ 1719లలో డేనిష్ మిషన్‌కి చెందిన బెంజిమెన్ ఘుల్జి అను మిషనరీ భారతదేశానికి వచ్చాడు. ఈయన బహుభాషా వేత్త. తెలుగులో క్రైస్తవ సాహిత్యాన్ని తలచుకుంటే వెంటనే ఈయన మనకు గుర్తుకు రావాలి. ఈయన దైవస్తుతి అనే రచనను ఎనిమిది భాషలలోకి అనువదించాడు.

జాన్ డిబ్రిటో, రేనియస్ వంటి వారు భారతదేశంలో గొప్ప సేవ చేశారు. ఇంగ్లాండు దేశస్తుడగు విలియం కేరీ సుప్రసిద్ధ బాప్టిస్టు మిషనరీ. ఈయన 1793 జూన్‌లో బెంగాల్ నందు తన సేవలకు అనేక క్లిష్టతరమైన పరిస్థితుల మధ్య ప్రారంభించాడు. 1800 సం॥లో జాషువా మార్షమన్, విలియం వార్డులతో కలిసి కలకత్తాకు దక్షిణముగా 16 మైళ్ల దూరములో ఉన్న డేనిష్ ప్రవాస స్థానమైన శ్రీరామపురము (సిరంపూర్) విశ్వవిద్యాలయమును స్థాపించాడు. ఈ ముగ్గురు "సిరంపూర్ త్రయము (Serampore Trio) అని పిలువబడిరి. వీరి కృషి ఫలితంగా భారతదేశంలో ఉన్న ప్రతి రాష్ట్రానికి, ప్రతి గ్రామానికి మిషనరీల ద్వారా సువార్తను ప్రకటించి సంఘములను స్థాపించారు.

## ఉభయ గోదావరి జిల్లాల్లో క్రైస్తవ మతవ్యాప్తి :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన జిల్లాల్లో తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాలు ప్రముఖమైనవిగా చెప్పవచ్చు. ఈ రెండు జిల్లాలను కలిపి ఉభయ గోదావరి జిల్లాలని పిలుస్తారు. ఇవి గోదావరి నదికి ఇరువైపులా ఉండటం వల్ల గోదావరి నదికి తూర్పున ఉన్న ప్రాంతాన్ని తూర్పు గోదావరి జిల్లా అని, పశ్చిమాన ఉన్న ప్రాంతాన్ని పశ్చిమ గోదావరి జిల్లా అని పిలుస్తారు. 1925 సంవత్సరం వరకూ ఈ రెండు జిల్లాలు కలిపి గోదావరి జిల్లాలుగా పిలువబడుతూ, ఏలూరు కేంద్రంగా ఉండేది. ఇక్కడ బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలతో కూడిన చతుర్వర్ణ వ్యవస్థ ఉంది. వైదిక మతం, జైన మతం, బౌద్ధ మతం, క్రైస్తవ మతం, ఇస్లాం మతం ఇవే కాకుండా నాస్తిక సంఘాల వంటివి ఉన్నాయి. ఈ జిల్లాలు చరిత్రను త్రవ్వితే మౌర్యులు, శాతవాహనులు, ఇక్ష్వాకులు, దేవర రాజులు, మంధ వంశీయులు, వశిష్ఠ వంశీయులు, విష్ణుకుండినులు, పోర్చుగీసువారు వ్యాపారం చేయటానికి భారతదేశం వచ్చి అధికారం సంపాదించుకుని, మతపరంగా భారతీయులను ఇబ్బంది పెడుతున్న కారణాన వారు రాజకీయంగా ప్రాబల్యం పొందలేకపోయారు. ఉత్తర సర్కార్ ప్రాంతాలు ఆంగ్లేయుల పరమైన తరువాత గోదావరి జిల్లాల్లో క్రైస్తవ మత ప్రచారం ప్రారంభమైనది. 1813 చార్టర్ చట్టం రావటంతో మన దేశంలో క్రైస్తవ మత ప్రచారానికి మార్గం ఏర్పడింది. దీనితో అనేకమంది మిషనరీలు మనదేశానికి వచ్చి రాష్ట్రస్థాయిలో గ్రామస్థాయిలో సువార్తను ప్రకటించుటలో నిమగ్నమయ్యారు. సువార్తను ప్రకటించడంతో పాటుగా సాంఘిక కార్యక్రమాలలో భాగంగా పాఠశాలలు నిర్మించి పేదలకు ఉచితంగా విద్యను ప్రసాదించారు. పేదల ఆరోగ్య దృష్ట్యా ఆసుపత్రులు నిర్మించి ఉచితంగా వైద్య సేవలను చేశారు. అనాథలకు,

తల్లిదండ్రులు లేని వారి కోసం అనాథ శరణాలయాలను నిర్మింపజేశారు. ప్రజల జీవనాభివృద్ధికి తోడ్పడే విధంగా వృత్తి శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఈ క్రమంలోనే అనేక సంఘ సంస్థల స్థాపన గోదావరి జిల్లాలలో జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నందు 1837 సంవత్సరంలో విలియం బౌడెన్ మరియు జాన్ బీరులు బ్రదరన్ మిషనరీలుగా నర్సాపురంకి వచ్చారు. బౌడెన్, బీరు గార్లు నర్సాపురంలో స్థిరపడ్డ కొద్దిరోజులకే పన్నెండేళ్లకొకసారి వచ్చే గోదావరి పుష్కరాలు వచ్చాయి. అందులో కరపత్రాలను పంచిపెట్టారు. అంతర్వేది తీర్థంలో ప్రతి ఏటా సువార్త ప్రకటించినప్పటికి ఫలితం ఉండేది కాదు. 1839లో నర్సాపురం నందు ఉన్నత పాఠశాలను జార్జ్‌బీరు మిషనరీ సారధ్యంలో స్థాపించబడింది. పాఠశాల ముఖ్య లక్ష్యం "సిలువను మోయుము - కిరీటము ధరించుము" ఈ మిషనరీల తరువాత సుమారుగా వందమంది మిషనరీల సేవా ఫలితంగా మూడు వందల సంఘాలు వెలసి, వేలాది మంది క్రైస్తవులుగా మారారు. నర్సాపురం, పాలకొల్లు, ధవళేశ్వరం, తణుకు, శెట్టిపేట, అగర్తిపాలెం, చాగల్లు, కొయ్యలగూడెం, ప్రత్తిపాడు, నిడదవోలు మొదలైన ప్రాంతంలో సువార్తను ప్రకటించి "గోదావరి డెల్టా మిషన్" అనే సంస్థను స్థాపించారు. 6 సంవత్సరంలో చాగల్లు గ్రామం నందు జీవన్‌జ్యోతి ముద్రణాలయం ఛార్లెస్ ఆడమ్స్ మిషనరీలచే ప్రారంభించబడి అచ్చట సుమారు 40 సంవత్సరాలు నిర్వహించబడి 1969 సంవత్సరంలో నర్సాపురంకి తరలించబడింది. ఈ ప్రెస్ ద్వారా రాయబారి అనే పత్రిక నడుపబడుతుంది. గొప్ప మొత్తంలో తెలుగు క్రైస్తవ సాహిత్యమును ప్రచురించుట ద్వారా తెలుగు క్రైస్తవ లోకానికి ఎనలేని సాహితీ సేవలందించింది. ప్రస్తుతకాలంలో విల్సన్ గారి ద్వారా నడుపబడుతుంది. బేతస్థ ఆసుపత్రిని ప్రారంభించి గోదావరి జిల్లాల ప్రజలకు ఉచిత వైద్య సేవలను అందించారు. నర్సాపురం నుండి మొగల్తూరు వెళ్ళే మార్గంలో లేసు అల్లికలు పరిశ్రమను ప్రారంభించి కొంతమందిని పనిని కల్పించారు.

జాన్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ హయ్యర్ పెన్సిల్వేనియా సినడు మిషనరీగా 1842 జులై 31 నాటి గుంటూరు జిల్లా కలెక్టర్ స్టోక్స్ ఆహ్వానించగా గుంటూరులో అడుగిడాడు. దానితో ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ సంఘ స్థాపన జరిగింది. మిషన్ పని విస్తరిస్తుండగా హయ్యర్‌కు సహాయముగా రెవ. వాల్టర్‌గన్ దంపతులు మిషనరీలుగా వచ్చారు. 1844లో జర్మన్ మిషనరీ సొసైటీకి చెందిన రెవ. లూయిస్ పి.మోన్నో వాలెట్ హయ్యర్‌తో ఉంటూ తన మిషన్ స్థలం కొరకు వెదకుచూ వున్నాడు. మిషన్ నిధులు సరిగా అందకపోవటంతో హయ్యర్ 1845 డిసెంబర్ 22న అమెరికా వెళ్ళాడు. వాలెట్ మిషనరీ 1845 జనవరి 31న రాజమండ్రిలో తన సేవలను ప్రారంభించాడు. ధవళేశ్వరం ఆనకట్ట నిర్మిస్తున్న సర్ ఆర్థర్ కాటన్ మరియు అతని ఉద్యోగులు వాలెట్ మిషనరీకి సేవలో బహుగా సహాయపడిరి. గ్రోనింగ్, ఆగస్టు హైసి వాలెట్‌కు సహాయకులుగా వచ్చారు. గ్రోనింగ్ ఏలూరు పట్టణంలో మిషన్ పనిని ప్రారంభించాడు. వాలేట్ కొద్ది కాలానికి డెల్టా ప్రాంతాల వైపుకు వెళ్ళి పాలకొల్లు, నర్సాపురం ప్రాంతాలను సందర్శించారు. కొద్దికాలం ముందు స్థిరపడ్డ గోదావరీ డెల్టా మిషనరీలను నర్సాపురం నందు కలుసుకున్నారు. కొద్దికాలనికి 1876లో టి.జోసఫ్, ఎస్.పాలస్ గార్లు భీమవరంలో మొదటి బోధకులుగా సువార్తను ప్రారంభించారు. తరువాత డా॥. నెడార్ఫర్ గారు ఇక్కడ సువార్తకు కృషి చేశారు. 1919లో భీమవరం నందు ఆగస్టాన వైద్యశాల నెలకొల్పబడింది. 1922లో డా॥. ఎస్.సి. బర్గర్ నర్సాపురం నందు విశిష్టమైన సేవలందించాడు. మరో ఆరేండ్లకు అచ్చట విశాలమైన దేవాలయం నిర్మింపబడి రూపాంతర దేవాలయంగా క్రైస్ట్ లూథరన్ చర్చి ప్రతిష్ఠించబడింది. ఇవేకాక రాజులు, వేగేశ్వరపురం, కొవ్వూరు, పోలవరం, తణుకు, ఏలేశ్వరం, కోరుకొండ, వేల్పూరు, తాడేపల్లిగూడెం, సామర్లకోట మొదలైన

ప్రాంతాలలో సువార్తను ప్రకటిస్తూ సామాజికాభివృద్ధికి కృషి చేశారు.

చర్చి మిషనరీ సొసైటీ వారు 1841 మార్చి 8న రాబర్టు టర్లింగ్‌టన్ నోబుల్ మరియు హెచ్.డబ్ల్యు.ఫాక్స్ అనే ఇద్దరు మిషనరీలను బందరు (మచిలీపట్నం) పంపి సి.ఎమ్.ఎస్ సంఘాన్ని స్థాపించారు. వీరు చుట్టుప్రక్కల ప్రాంతాలకు సేవను విస్తరింపజేశారు. నోబుల్ పాఠశాలలను స్థాపించి మొదట ఇద్దరూ బ్రాహ్మణ పిల్లలకు చదువు నేర్పించారు. తరువాత ఈ పాఠశాల వృద్ధి చెంది. నోబుల్ కళాశాలగా నేటికి పేరు ప్రతిష్టలు సంపాదించుకున్నది. సి.యస్.ఎస్. మిషనరీ అయిన రెవ. ఇంగ్లీష్ వారు 1852లో ఏలూరును దర్శించినప్పుడు లూథరన్ మిషన్ వారు సువార్త సేవ బాధ్యతను సి.ఎమ్.ఎస్ వారు అప్పగించి రాజమండ్రి ప్రాంతానికి వెళ్ళారు. 1857 సంవత్సరంలో కేనన్ అలెగ్జాండర్ దంపతులు ఏలూరు వచ్చి సువార్తను ప్రకటించారు. తరువాత నూజివీడు, సిరివాడ, పెదపాడు, భీమడోలు, చింతలపూడి గ్రామాలలో సంఘాలు స్థాపించారు. 1859లో అలెగ్జాండర్ బాలికల కొరకు పాఠశాల స్థాపించి దానిని వృద్ధి చెయ్యటానికి ఎంతో కృషి చేశారు. దుమ్ముగూడెం అనే గ్రామంలో 1862 వ సంవత్సరం గోదావరి నదిపై ఆనకట్ట నిర్మించే నిమిత్తం జనరల్ హేగ్, సర్ ఆర్థర్ కాటన్, గ్రోవ్స్ ఆనం ఇంజనీర్లు దుమ్ముగూడెం నందు క్యాంపు చేశారు. అటవీ ప్రాంతంలో నివసిస్తున్న కోయ జాతులకు సువార్త ప్రకటించాలని మద్రాసులో ఉన్న సి.ఎమ్.ఎస్ వారికి తెలియజేయగా రెవ. జే.ఎడ్మ్యాంట్ గారిని పంపారు ఇందుకూర్ వెంకట రామరాజు, రెవ. జాన్ కేయిన్, శ్రీమతి శారా డేవిస్ కెయిన్ దంపతులు దుమ్ముగూడెంలో గొప్ప సేవ చేశారు. దీనికి గాను రెవ. కెయిన్‌కు బ్రిటీష్ చక్రవర్తి "కేయిజర్ హింద్" అను బిరుదును, శారా డేవిస్ కెయిన్‌ను మెంబర్ ఆఫ్ బ్రిటీష్ ఎంపైర్ అను బిరుదులిచ్చి సత్కరించారు. రెవ. ఎం. జ్ఞానశిఖామణి పిళ్ళై, రెవ. సి.బోర్ హుం, రెవ. టి. సిమియోన్, రెవ. ఎ.హెచ్. గార్డినల్, మేడికాయల సాధు, వినుకొండ యేసుదాసు, యం. కుమారయ్య, యం. రత్నారెడ్డి, ఎల్.ఏ. పులన్ మొదలైన వారు గణనీయమైన సేవ చేశారు. వారి ద్వారా జననా మిషన్ స్థాపించబడి స్త్రీల మధ్య గొప్ప పరిచర్యలు ప్రారంభించారు. ఇంటి నుండి బయటకు రాని స్త్రీలకు తమ ఇళ్ళకే వెళ్ళి విద్యను బోధిస్తూ, కుట్లు, అల్లికలు నేర్పించి జీవితాలను నిలబెట్టుకొనేలా చేశారు.

కెనెడియన్ బాప్టిస్ట్ మిషన్ అనే సంస్థ కెనడా దేశంలోని బ్రాంట్‌ఫర్డ్ నగరంలో 1867 అక్టోబర్ 18న డాక్టర్ మూల్‌బాక్ గారిచే స్థాపించబడింది. అంతకంటే ముందే అనగా 1814 సంవత్సరంలో అమెరికన్ బాప్టిస్ట్ మిషన్‌ను స్థాపించినా ఈ శాఖ మత ప్రచారం చేస్తున్న ప్రదేశాలను వదిలి మిగిలిన కొత్త ప్రదేశాలలో బాప్టిస్ట్ శాఖ తరపున మత ప్రచారం చెయ్యాలన్నదే మూల్‌డక్ యొక్క ఉద్దేశ్యం. తత్ఫలితంగా ఈ సంస్థ నుండి రెవ. ఎ.వి.టింపనీ దంపతులు 1867 నాటికి నెల్లూరికి చేరుకొని, అమెరికన& బాప్టిస్ట్ మిషనరీ అయిన డాక్టర్ జూవెట్‌తో కలిసి, సువార్త పనిలో పాల్గొన్నారు. కొద్ది కాలానికి టింపనీకి తోడుగా రెవ. జాన్ బి. మెక్లారిన్ దంపతులు 1871లో ఒంగోలు చేరి, అక్కడ పనిచేస్తున్న క్లీ గారితో కలిసి పని చేశారు. మచిలీపట్నం వాస్తవ్యులు తాలేరు మారయ్య అనే హరిజనుడు రాజమండ్రి నందు లూథరన్ మిషన్‌లో చదువుకొని లూథరన్ వారి వద్ద బాప్తిస్మం పొంది గాబ్రియేలు అనే పేర క్రైస్తవునిగా మారాడు. విద్యను ముగించుకొని రాజమండ్రి నందే టెలిఫోన్ ఆపరేటర్‌గా ఉద్యోగం సంపాదించాడు. కొద్దికాలం గడిచిన తరువాత రాజమండ్రి నుండి మద్రాసుకు ఉద్యోగం బదిలీ చేశారు.

అక్కడ బాప్టిస్టు మిషనరీ అయిన దాఅస్ అంతర్వేదిని కలుసుకొని బాప్టిస్టు శాఖకు మారి, తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి క్రైస్తవ మతాన్ని బోధించడం మొదలు పెట్టాడు. కొద్దికాలానికి రెవ. టింపనీ, రెవ. జాన్ బి. మెక్లారిన్ మిషనరీలను కలుసుకొని కాకినాడ పట్టణం అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని అక్కడ మీరు బాప్టిస్ట్

సంస్థను ప్రారంభించాలని కోరడం ఆపై మెక్లారిన్ 1874లో కాకినాడలో "ది కెనడియన్ బాప్టిస్టు మిషన్" స్థాపించినట్లు తెలుస్తుంది". 1874 సంవత్సరం చివరిలో టింపనీ కాకినాడకు చేరి కలరా సోకి మరణించాడు. ఆ తరువాత జాన్ క్రేగ్ అనే మిషనరీ 1886లో కాకినాడకు చేరి 1887 నాటికి ఒక పాఠశాలను ప్రారంభించాడు. తరువాత కొద్ది కాలానికి మెక్లారిన్ ఉన్నత పాఠశాలగా అభివృద్ధి చెందింది. వీరేకాక రెవ. హెచ్.డిక్సన్ స్మిత్ కేరి దంపతులు, ఆమ్‌స్ట్రాంగ్ దంపతులు, తుని, నర్సీపట్నం, కాకినాడ, పిఠాపురం ప్రాంతాలలో గణనీయమైన సేవలందించారు. మారయ్య అను థామస్ గాబ్రీయేలు ఆకువీడు నందు సంఘాన్ని స్థాపించగా, మెక్లారిన్‌తో సంప్రదింపులు జరిపి 1880లో క్రేగ్ మిషనరీ "ఆకువీడు" ప్రాంతాన్ని సువార్త సేవలందించారు. కొద్దికాలానికి ఈమె వేరే ఆసుపత్రికి వెళ్ళిపోయింది. ఈ సంస్థకు అనుబంధంగా సామర్లకోట, యలమంచిలి, తుని, కాకినాడ, రామచంద్రాపురం, పిఠాపురం, ఉయ్యూరు, ఆకువీడు మొదలైన ప్రాంతాలలో దేవాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రులు నేటికి నిర్వహించబడుతున్నాయి.

ఇటలీ దేశలోని క్రైస్తవ జగద్గురువు పోపుగారి పరిపాలనకు లోబడి ఆంధ్రదేశంలో అనేక కేథలిక్ సంస్థలు నడుపబడుచున్నాయి. వీరు మత ప్రచారంలో భాగంగా విద్యాసంస్థలు, వైద్యాలయాలు, అనాథ శరణాలయాలు మొదలైన సాంఘిక కార్యక్రమాలు చేస్తూ ఉన్నారు. ఫ్రెంచ్ స్థావరంగా పిలువబడుతున్న యానాంలో 1750లో ఫ్రెంచి వారిచే ఇండిగో పరిశ్రమ నిర్మించబడింది. ఆ సమయంలో చాలా కొద్దిమందితో ఈ ఫ్రెంచ్ వారికి సువార్త ప్రకటించబడేది. దీనిని బోధించటానికి చెన్నై, గోవా ప్రాంతాల నుండి బోధకులు వచ్చేవారు. 1767లో యానాంలో సిటానో స్టానో డె ఫారియా, తరువాత జోస్ మరియు డె.అల్బుక్లెర్క్‌లు యానాం ప్రాంతంలో సువార్త ప్రకటించారు. సెయింట్ ఫ్రాన్సిస్ డి సేల్స్‌కు చెందిన గురువుల బృందం 1846లో మొట్టమొదటి పాండిచ్చేరి నుండి యానాంకు వచ్చారు. ఈ బృంద నాయకుడు ఫాదర్ జాక్విస్ మార్టిన్ యానాంలో మొట్టమొదటి నివాసిత గురువు. 1848లో యానాంలో దేవాలయం నిర్మించ బడింది. చివరి ఫ్రెంచ్ గురువుగా గాంగ్‌లాఫ్ వచ్చి 1957 వరకు సేవచేసి మరణించారు. గాంగ్‌లాఫ్ తరువాత భారతీయ గురువైన ఫా.మత్తయి మప్పిలకున్నెల్ యానాంకు గురువుగా వచ్చాడు. వీరు వచ్చిన సంవత్సరం 247 మంది క్రైస్తవులను తయారు చేశారు. 1990 నాటికి యానాంలో 2826 మంది క్రైస్తవులున్నారు. 2002 నాటి విశాఖ మేత్రాసన కతోలిక డైరెక్టరీ ప్రకారం యానాంలో 1981 మంది క్రైస్తవులున్నారు. ఈ విధంగా ఈ సంస్థ పక్షాన ఉభయగోదావరి జిల్లాల్లో కాకినాడ, రాజమండ్రి, మండపేట, అనపర్తి, ద్రాక్షారామం, ఏలేశ్వరం, హంసవరం, సామర్లకోట, పిఠాపురం, సీతానగరం, ఆకువీడు, అమలాపురం, అంబాజీపేట, అన్నదేవరపేట, ఐ.పండిగి, గౌరీపట్నం, భీమవరం, చింతలపూడి, ఏలూరు మొదలైన ముఖ్య ప్రాంతాలలో దేవాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, అనాథ శరణాలయాలు, ఆయా మిషనరీల ద్వారా నిర్మించబడి పనిచేస్తూ ఉన్నాయి. ప్రపంచంలో అతి పెద్ద సంఘాలలో ఇది ఒకటిగా చెప్పవచ్చు.

## ముగింపు :

పైన తెల్పిన విధంగా ఉభయ గోదావరి జిల్లాల్లో క్రైస్తవ మిషనరీలు, దేశీయ నాయకులు క్రీస్తు సువార్తను ప్రకటిస్తూ వాటితో పాటుగా పాఠశాలలు, ఆసుపత్రులు, వృత్తి శిక్షణా కేంద్రాల వంటివి నిర్మింపజేసి ఆర్థికంగా వెనుకబడిన వారిని అభివృద్ధి చెందేలా కృషి చేశారు. అంటరానితనాన్ని దూరం చేసి దళితుల బ్రతుకుల్లో గొప్ప వెలుగును నింపారు. వృత్తి శిక్షణను స్త్రీ, పురుషులకు నేర్పించి జీవితాలను నిలబెట్టుకొనేలా చేశారు. 1901 నాటికి గోదావరి జిల్లాల్లో క్రైస్తవ్యాన్ని స్వీకరిస్తున్నారే కానీ వారి యొక్క కులాన్ని మార్చుకోవటం లేదు. దీని కారణాన క్రైస్తవుల సంఖ్య పెరగకుండా వుందని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్యానికి క్రైస్తవుల సేవ - డా॥. గుజ్జర్లమూడి కృపాచారి.
2. భారతదేశ క్రైస్తవ సంఘ చరిత్ర - బి.ఇ. దేవరాజు.
3. వేదాంత రసాయనం - సవిమర్శక పరిశీలన - డా॥. కె. ఆనందన్.
4. ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ సంఘ చరిత్ర - డా॥. కొల్లూరి లూథర్ రిచర్డ్‌సన్.
5. ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ సంఘ చరిత్ర - బుసమెల్ల బెంజిమెన్.
6. తెలుగు కతోలిక చరిత్ర - డా॥. గుఱ్ఱం ప్రతాపరెడ్డి.

❖❖❖

# ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి నవల 'సర్కారు గడ్డి' - సామాజిక దృక్పథం

- టి. సుబ్రమణ్యం, పరిశోధక విద్యార్థి, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

మూర్తిదేవి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు రాసిన నవల "సర్కారు గడ్డి" నాటి పరిస్థితులకు సామాజిక స్థితిగతులకు అద్దం పడుతుంది. ముఖ్యంగా ఈ నవలలో మనిషి జీవితంలోని వివిధ కోణాలను స్పృశిస్తూ మనిషిలోని మానవత్వాన్ని తట్టిలేపుతాయి మానవ సంబంధాలను మనుషుల విలువలను, మూగజీవాలు మనుషులతో ఎలా ముడిపడి ఉంటాయో తెలియజేసాయి. మూగ జీవాలు వాటి కరువు పరిస్థితులు, తెలియ వస్తాయి. ఆవులు, ఎద్దులు గేదెల పోషణ నిమిత్తం సర్కారు వారు అందించే గడ్డికోసం రైతులు పడే కష్టాలు, అవగతమవుతాయి. ఆ గడ్డిని రైతులకు చేరవేయడానికి రైల్వే వ్యాగన్ల నుండి గడ్డి దింపడం లారీలకు లోడు చేయడానికి హమాలీలు పడే పాట్లు బోధపడతాయి, ఒక వయసు దాటిన తరువాత ఆవులను, ఎద్దులను పోషణ నిమిత్తం రైతు పిల్లల ఆలోచనను రాముడు తన ముసలితనానికి అన్వయించుకొని బాధపడతాడు, ఆవు గొప్పతనం, గ్రామాలలోని వృత్తి పనివారిని గురించి, దళిత వాడలో యువకుల ఆవేశపరులై నలుగురితో సమానం అనుకోవడం సమస్యే! ఆరాటమే! పోరాటమే! ఫలితం అనుకూలంగా ఉంటుందని అంచనా వేయటం కూడా సాహసమే!. సహజంగా అనంతపురం జిల్లా దళితుల పరిస్థితి ఘోరంగా ఉంటుంది, రాయలసీమ దళితుల జీవనం బాడబాయి పోయి ఉంటుందని ముఖ్యంగా సర్కారు వారు సరఫరాచేసే గడ్డి వాటిని గ్రామాలలో పాడి ఆవులు, ఎద్దులు, గేదెలకు వాటిని పంచే విధానాన్ని కథా వస్తువుగా తీసుకొని సరళమైన శైలిలో ఈ నవలరచింపబడింది.

ఇనాక్‌గారి నవలా సాహిత్యంలో సామాజిక దర్శనానికి మరో నిదర్శనం ఈ నవల. నవలా స్థలం అనంతపురం. అందులో ముఖ్యంగా మాదిగ గేరి. నవలలో వస్తువు రాయలసీమ కరువు. అదీ నాలుగేళ్ళ నుంచి వర్షాభావం. మనుషుల ఇక్కట్లు సరేసరి. పశువులకు గడ్డి లేదు. ఇదీ ప్రధాన సమస్య. ఇది మొదటి పార్శ్వం.

సర్కారువారు రైల్వే వ్యాగన్లలో గడ్డి తెప్పించి అక్కడ పంచే ఏర్పాట్లు చేశారు. కానీ అది మాములు రాజకీయమే. దళారుల మేత ఎక్కువ. ఓట్ల రాజకీయం. అగ్రవర్ణ రైతులకే ఎక్కువ గడ్డి! దళితులు ఎదిగిపోవటం, ఆత్మగౌరవాన్ని నిలుపుకోవటం ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవటం, అన్ని వ్యవహారాల్లో సాధికారతను సాధించుకోవటం, సిసలైన వాస్తవికతగా ఆవిష్కారమౌతుంది. ఈ 'మార్పు' కు గ్రామ సర్పంచి 'ఇంతలో వీళ్ళల్లో ఇంత మార్పా!' అని ఆశ్చర్యపోవటంతో ఈ సమస్య ముగుస్తుంది.

నవలలో ప్రధానపాత్ర ఓబులేసు. అతనికి రావుడు, రామయ్య అనే పేర్లు వారింట్లో ఉన్న ముసలిఎద్దు పేర్లు. ఓబులేసు రావుడు కావటానికి వారింట్లో ఉన్న ముసలి ఎద్దు లచ్చువుడుకారణం. దానితో ఆయనకు తమ్ముడి కంటే ఎక్కువ అనుబంధం, మమకారం.

'ఎద్దు రైతుని ప్రేమిస్తుందట. ఆ కారణంగా రైతు ఎద్దు పరస్పరం ప్రేమించుకోవటం, అభిమానించుకోవటం, ఆత్మీయత చూపుకోవటం, చివరకు అన్నదమ్ములు కావటం జరుగుతుంది. ఒకరికోసం ఒకరు ఆరాటపడటం. ప్రాణమిచ్చుకొనే ఆత్మీయ మిత్రులు కావటం సహజం.ఆ సోదరత్వం చూసి అభిమానించి, అంగీకరించి, ఆమోదించే మనుషులు ఉండటం అంటే మానవ సమాజం విశిష్టతను చేరుకొన్నట్లే' అని ఇనాక్‌గారు 'సంజాయిషీ' ఇస్తున్నారు.

రామయ్యకి ముగ్గురు కొడుకులు. పెద్దోబులేసు, నడిపోబులేసు, చిన్నోబులేసు. వాళ్ళకి మరో పేర్లు పెద్దాయప్ప, నడిపాయప్ప, చిన్నాయప్ప. వీళ్ళ భార్యలూ ఉన్నారు.

రామయ్య యాభై ఎకరాల పెద్దరైతు. "అతనికి ఆస్తి, తాను పుట్టకముందు నుంచీ, ఆ వూళ్ళో ఇప్పుడున్న వాళ్ళు అందరూ పుట్టకముందునుంచీ, తాత ముత్తాతల కాలం నుంచీ ఉంది. అతని పూర్వీకులు రాయల కొలువులో సైన్యాధికారులుగా పొందిన ఫర్మానా వల్ల సంక్రమించిన భూమి కావడం వల్ల, ఆంగ్లేయుల భూమి ప్రతి అంగుళం కొల్చి సర్వే నెంబర్లు ఇచ్చి, ఎవరి హక్కులో స్వానుభవంలో స్వాధీనంలో ఉన్న భూముల్ని వాళ్ళకి ఇవ్వడం వల్ల, తరతరాలుగా రావుడు కుటుంబం వాళ్ళు అనుభవిస్తూ వచ్చి ఉండడం వల్ల ఆ భూమి వాళ్ళకు చెందే విషయంలో ఎవరికీ కంటగింపు లేదు. భూపరిమితి చట్టం వచ్చిన తర్వాత కూడా ఆ భూమి వాళ్ళకే హక్కు భుక్తంగా మిగిలిపోయింది. వాళ్ళకా భూమి ఉండడం విశేషం కాదు. వాళ్ళు దాన్ని పోగొట్టుకోకపోవడం విశేషమే! విచిత్రమే! వింతే! విడ్డూరమే" అని ఇనాక్ గారు ఒక చారిత్రక పరిణామాన్ని ధ్వనిగా తెలియజేశారు.

సాధారణంగా దళితుల చేతుల్లో అంత భూమి ఉండటం - అగ్రవర్ణాలు ఓర్చలేవు. కానీ రామయ్య కుటుంబం నిలుపుకుంది! ఈ ఏభై ఎకరాల్లో పది ఎకరాలు వరివుంది. పదెకరాల్లో చీనీతోట వుంది. అయిదెకరాల్లో జాంచెట్లు. రెండెకరాల్లో బొప్పాయి. వానలు పడితే చేను పండుతుంది. సెనక్కాయ పంటలేకుంటే చేను బీడే. రామయ్యది నాలుగ్గాండ్ల సేద్యం. రామయ్యకు నాలుగెద్దులు, నాలుగు దున్నపోతులు, రెండావులు. అందులో ఒకటి ముసల్ది రెండు గేదెలు నాలుగు దూడలు - రెండు పెయ్యలు. రెండు కుర్రలు. వీటన్నిటికీ మేతకావాలి. గడ్డి లేదు. ఎక్కడా దొరకదు. సర్కారు ద్వారా వచ్చిన దాన్ని పెద్దలు వీరికి అందనీయరు!

రామయ్యంటే చాలామందికి అభిమానం. కారణం అతనికి అందరిపట్లా అభిమానం. సమాజంలో అందరూ కలసిమెలిసి ఉండాలి. 'భయం లేని సావు కాదు - భయంలేని బతుకు కావల్ల' అని చెబుతాడు రామయ్య కొడుక్కి.

రాజకీయాలు ఒకరిమీద ఒకరు ఆధారపడేవిగా ఉండాలి. కానీ విడదీసేవి కారాదని ఆయన నమ్మేవాడు. నమ్మకంగా ప్రచారం చేసేవాడు. ఒకరి దగ్గర దుడ్డుండడం లేని వారికి సహాయం చేయటానికి అని నమ్మేవాడు. సహాయం చేసేవారి ఊరు బాగుంటేనే దేశం బాగుంటుందని చెప్పేవాడు. మనిషి బాగుంటాడు దేవుడు బాగుంటాడని తేల్చి చెప్పేవాడు. దీనికి అనుగుణంగా ఆయన నడత, ఇతరులతో సంబంధ బాంధవ్యాలు ఉండేవి.

"రాఁవుడికి వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సత్సంబంధాలున్నాయి కమ్యూనిస్టులతో, తెలుగుదేశం వాళ్ళతో నక్సలైట్లతో, కాంగ్రెస్ వాళ్ళతో సంబంధాలున్నాయి. రైతుకూలీలు అన్నలు, తన అన్నదమ్ములు. గ్రామంలో సర్పంచికి తాను గేరి ఓటర్లను కాపాడే పెద్దమనిషిగా రాఁవుడు ఆత్మీయుడు. వీళ్ళందరినీ అభిమానించినా, ఆదరించినా, ఏ రాజకీయమూ అంటని, ఏ రంగూ పులుముకోని, ఏ రుచీ మరగని, ఏ వాసనా కొట్టని అసలు సిసలు దళిత రైతు రావుఁడు".

"బంజర్లు పంచినప్పుడు తనకూ తన ముగ్గురు కొడుకులకు-వచ్చిన ఇరవై ఎకరాలు తాను పట్టా పుచ్చుకోలేదు. తనకు భూమి ఉందని ఏమీ లేని పేదకు ఇమ్మని తానే తాసీలుదారుతో అర్జీరాసి మొర పెట్టుకున్నారు. ఈ త్యాగ లక్షణం గ్రామస్తుల్ని మెప్పించింది. అందుకనే ఆయన ప్రజలమనిషి అయ్యాడు."

నవల చివరికి రాఁవుడు, లచ్చువుడు (ఒకరికి ఒకరు విడదీయరని జంటగా) ఒకేసారి చనిపోవటం, మనిషికీ పశువుకూ మధ్యనగల అవ్యక్త అనుబంధానికి తార్కాణం. శవయాత్రలో ఊరిలోని అన్ని వర్ణాలవారూ పాల్గొనటం - ఒక వర్ణాంతర సామరస్య అభికాంక్షగా చిత్రించారు

ఇనాక్ గారు. నవలాత్మక కల్పన, కల్పనాత్మక వాస్తవికత! కనిపిస్తాయి.

నవలలో కథ రాముడు చుట్టూ తిరుగుతున్నా, అంతర్నాటకంలో లాగా చాలా పాత్రలు పరిచయ మౌతాయి. రైల్వే వాగన్ల హమాలీలు, వాళ్ళ ముఠామేస్త్రీ, స్టేషన్‌లో వడలూ దోశెలు అమ్ముకొనే లచ్చుమక్క, ఆమె స్నేహితుడు ఎంకటేశు వీళ్ళది కులాతీత ప్రేమ. 'సర్కారుగడ్డి'లో ఇతివృత్తం పరిధి చాలా విశాలమైనది. కేంద్రకమేమో సహజంగానే బిందు సదృశమైంది. కేన్వాస్ పెద్దది కావటం వలన, పరిధిమీది చుక్కల్లో చాలా చుక్కల నుండి రేఖలు కేంద్రకానికివచ్చి కలవవు.

'సర్కారుగడ్డి' నవల దళితులు అన్ని రంగాల్లోనూ సాధించాల్సిన సాధికారితనిఅవసరాన్నీ, సాధించిన విధానాన్నీ తెలుపుతోంది. నోరు మంచిది కావాలి. అందరి నోళ్ళూ మంచివి కావాలి. అందరి మనసులు కలవాలి-అనే శ్రేయోభిలాష ఇనాక్ గారిది. ఈ శ్రేయోభిలాషే రామయ్య పాత్రలోనూ ద్యోతికమౌతుంది. ఇదే రచయిత గారి ఆత్మయతాముద్ర.

"చదువుకొన్న దళితుడు, ఉద్యోగి అయిన దళితుడు, సంపాదన పరుడైన వాడు, సదాలోచన వున్నవాడు. పుట్టిపెరిగిన పల్లెకు ప్రత్యుపకారం చేయడమంటే సాహసమే. సాహసికి చావోరేవో మిగులుతుంది' అన్నారు రచయిత. అలాంటి సాహసులు రావాలి. ఇదే మరొక ఆకాంక్ష!

**ఆధారగ్రంథాలు :**

1. సర్కారు గడ్డి - కొలకలూరి ఇనాక్.
2. కొలకలూరి ఇనాక్ రచనలు వస్తు రూప పరిశీలన - ఎ. రవీంద్ర.

❖❖❖

# మహాభారతంలో దాన వైవిధ్యం

- కుశ్నపెల్లి సురేష్, పరిశోధక విద్యార్థి.

ప్రపంచ వాఙ్మయంలో పరిమాణ రిత్యా అతి పెద్ద గ్రంథం వ్యాసభారతం. వేదసారాన్ని ఇముడ్చుకున్న మహా భారతం పంచమవేదంగా వినుతి కెక్కింది. సకల జ్ఞాన ప్రదాయిని, సకలలోకహితబోధిని అయిన మహాభారతం కవిత్రయం చేత రచించబడింది. పద్దెనిమిది పర్వాలు కలిగిన ఆంధ్రమహాభారతంలో శాంతి పర్వం ఒకటి. పంచమవేదమని మహాభారతం ప్రఖ్యాతమవడానికి కారణం పరమాత్ముడైన శ్రీకృష్ణుడు అర్జునుడికి చేసిన ధర్మోపదేశమే. వేదసారమే గీతోపదేశం. భీష్మ పర్వంలోని గీతోపదేశం లాంటిది శాంతిపర్వంలో భీష్మ ధర్మ ప్రభోధం. కరుక్షేత్ర యుద్ధానంతరం బంధువధ వలన కలిగిన పాపభీతితో శోకతప్తుడైన ధర్మరాజుకు భీష్ముడిచ్చిన ధర్మో పదేశమే భీష్మగీత. ఇప్పుడు మనం రాజధర్మం, అవధర్మం మోక్ష ధర్మములను ప్రబోధించిన భీష్మధర్మోప దేశాన్ని అవలోకిద్దాం.

సంస్కృతంలోని వ్యాస భారతాన్ని నన్నయ, తిక్కన ఎఱ్ఱనలు ఆంధ్రీకరించారు నన్నయ ఆది, సభా, అరణ్య పర్వంలోని నాల్గవాశ్వాసం లోని 142వ పద్యం వరకు రచించాడు. నన్నయ తరువాతి కవియైన తిక్కన విరాట పర్వం నుండి స్వర్గారోహణ పర్వం వరకు పదిహేను పర్వాలను రచించాడు. అరణ్య పర్వశేషాన్ని ఎఱ్ఱన రచించాడు. తిక్కన భారతరచనలో ఆంధ్రావళిమోదం బరయ అలతి అలతి పదాలతో రసమార్గంలో లోక హితవు లను కవిత్వీకరించాడు. దేశీయ పలుకుబడులతో అందమైన కందపద్యాలతో భారతాంధ్రీకరణ గావించిన కవిబ్రహ్మ కొట్టరవు తిక్కన.

ప్రపంచ సాహిత్యంలో ఇతిహాస ప్రక్రియలో అత్యంత ఉత్కృష్టమైనది పరిమాణంలో బృహద్గ్రంథం మహా భారతం, భారతదేశ చరిత్ర-సంస్కృతిని నిర్ణయించేది, ఆచార సాంప్రదాయాలను శాసించేది, సకల శాస్త్రాలకు ఆధారమైనది, సర్వధర్మాలకు ఆలవాలమైనది మహా భారతం. ప్రపంచంలోని సారమంతా తన రూపుగా కలిగిన మహాభారతానికి భారతీయ సాహిత్య చరిత్రలో అత్యున్నత స్థానముంది. మహాభారతంలో లేనిది ప్రపంచంలో లేదు. ప్రపంచంలోని అన్ని దానాలు, ధర్మాలు, అన్ని మనస్తత్వాలు, అన్ని శాస్త్రాలు, అన్ని భావనలు, అందరు మనుషులూ మహాభారతంలో దర్శనమిస్తారు. అందు వలన మహాభారతం వేదాలు తరువాత అంతటి ప్రాముఖ్యతను సంతరించుకంది.

ముఖ్యంగా ఈ భారతం ఆనాటికీ ఈనాటికీ సమాజం లోని అన్ని పరిస్థితులకు, అన్ని సందర్భాలకు నిలువు టద్దంలా మెరసి పరిష్కారాన్ని అందిస్తుంది. మానవ మనస్తత్వ చిత్రణలోనూ, సామాజిక చిత్రణలోను, ధర్మావిష్కరణలోనూ, న్యాయనిర్ణయంలోనూ అత్యంత ప్రామాణికతను కలిగి ఉండి కాలదోషం అంటని పవిత్ర గ్రంథం. అందుకే భారతీయ సనాతన సాంప్రదాయంలో చతుర్వేదాల తరువాతి స్థానాన్ని పొంది, సమాజాన్ని ముందుకు నడిపించడంలో నేటికీ మహాభారతం ఎంతో అత్యున్నత విలువలను పాటిస్తూ మార్గనిర్దేశం చేస్తుంది.

శతపర్వ సమన్వితమై, లక్షకుపైగా శ్లోకాలతో ధర్మం, న్యాయం, నీతి, రాజనీతి, యుద్ధనీతి, పాలన, సంబంధ బాంధవ్యాలు, ఆచార సాంప్రదాయాలు వంటి సామాజిక అంశాలలో శృతి, స్మృతి సమ్మతమైన మహాభారతం నాటికీ, నేటిని ప్రపంచ మానవాళికి అనుసరణీయం. పాండవుల విజయగాధ ఇందులో చెప్పడం వలన దీనికి జయ, జయ సంహిత అనే పేర్లు కూడా కలవు. అటువంటి జయేతి హాసాన్ని భగవాన్ వేద వ్యాసమహర్షి చతుర్వేదాల సారంతో రచించారనడంలో ఎటువంటి సందేహం లేదు. సమస్త

వేదోపనిషత్తుల జ్ఞాన రహస్యాలను, సమస్త శాస్త్రసారాన్ని ఈ మహాకావ్యంలో గుప్తపరిచి, ఒక్కొక్క అఖ్యానం, ఒక్కొక్క ఉపాఖ్యానం ద్వారా ధర్మాలను భోదించి, మానవుడు జీవించవలసిన విధానాన్ని, మానవుని యొక్క నైతిక కార్యకలాపాలను, ధర్మజీవనం వలన కలిగే విశేషణాలను వివరించారు.

“మహాభారతంలో ఇలా ప్రతీ అంశంలోనూ, ప్రతి ఆఖ్యానంలో నాటి సమాజానికి ప్రతిబింబించే దానాలు, ధర్మాలు, న్యాయాలు కలవు. ధర్మం ఎంతటి జఠిల మైనదో, ధర్మాచారణ ఎంతటి కష్టతరమో, ధర్మ సూక్ష్మాలు చెప్పడం ఎంతటి క్లిష్టమో మనం మహాభారతం ద్వారా తెలుసుకోవచ్చు. మహాభారతంలో ఈ దాన ధర్మాలు, న్యాయాలు ఆనాటి సమాజానికేకాక ఉన్నతమైన నైతిక విలువలు పాటించాలనే, ప్రతీ సమాజానికి, ఆచరణీయ మనే చెప్పవచ్చు. మహాభారతంలోని అనేకమైన దానాలు ధర్మాలు రాజనీతి, దండనీతి, న్యాయం మొదలైన ఆ కాలం నాటి సాధారణ ప్రజల యొక్క జీవన విధానంపై ఆధారపడి వుంటుంది. ఎందుకంటే ధర్మం దేశ కాలాదుల బట్టి మార్పు చెందుతుంది, కానీ ఇందులో ఒక మిన హాయింపు ఏమిటంటే భారతంలోని దానాలు సర్వకాల సర్వావస్థల యందు అన్ని వయస్సుల వారికీ ఆచరణీయ మైనవి, కాలదోషం పట్టని పవిత్రత, మహాభారతం సొంతం.

అందువల్ల భారతంలోని అంశాలు సర్వావస్థల యందు సర్వమానవులు ఆచరించడం సామాజిక జీవనంలో ఉన్నతమైన నైతిక ప్రవర్తన కనబరిచి సమాజంలో అత్యున్నతమైన విలువలు గల పౌరులుగా ఎదగాలని మహాభారతం బోధిస్తుంది. అందువల్ల మహా భారతం చూసే వారి దృష్టిని బట్టి దాని స్వరూప స్వభావు రూపురేఖలను మార్చుకుంటుంది. దాన ధర్మాల కోసం వెతికే వాళ్ళకు ధర్మ శాస్త్రంగాను, ఆధ్యాత్మిక వాదులకు వేదాంతం గాను ఏ విధంగానైతే గోచరిస్తుందో, అదే విధంగా వ్యక్తుల యొక్క మనస్తత్వాన్ని మార్చడంలో మనో వైజ్ఞానిక శాస్త్రంగాను చెప్పవచ్చు. మహాభారతంలో సమాజంలో ప్రతిబింబించే విషయాలే కాదు, సమాజాన్ని ప్రభావితం చేసే అంశాలు కూడా ఉన్నాయి. ఈ మహా ఇతిహాసం భారతీయ చరిత్ర సంస్కృతికి అద్దం పట్టడమే కాకుండా, సంస్కృతీ రూపురేఖలను నిర్దేశించి, సమాజంలో ఏ విధమైన రుగ్మతలు ఉన్నాయో, వాటి స్వభావాలు, పరిష్కార మార్గాలను నిర్దేశించి సమాజానికి మార్గనిర్దేశం చేయగల మహనీయ గ్రంథం మహాభారతం.

ఆదిపర్వం-దాన ప్రాశస్త్యం: అవతారికలో చెప్పిన పద్యములు అనుశీలనము చేసినచో రాజ రాజునకు భారతాంధ్రీకరణము చేయించుటలో ఏ పరమాశయము కలదో తేట తెల్లమగును. “రాజరాజ నరేంద్రుడు పురాణములు విన్నను అర్థధర్మశాస్త్రములను అనేకము లను అనుశీలించినను, ఉదాత్త రసాన్విత కావ్య నాటకములు చూచినను మహాభారతమునందు అభిప్రా యము పెద్దయై యున్నదని తెలిపినాడు.

“ఇవి యేసున్ సతతంబు నాయెడ గరం బిష్టంబులై యుండుఁబా
యవు భూ దేవకులాభితర్పణమహీయః ప్రీతియున్ భారత
శ్రవణాసక్తియుఁ బార్వతీపతిపదాబ్జధ్యానపూజామహో
త్సవమున్ సంతతదావులతయు శశ్వాత్సాధు సాంగత్యమున్.”

“హిమకరుఁ దొట్టి పూరుభర తేశకురుప్రభు పాండు భూపతుల్
క్రమమున వంశకర్త లనగా మహినొప్పిన యస్మదీయవం
శమునఁ బ్రసిద్ధులై విమలసద్గుణశోభితులైన పాండవో
త్తముల చరిత్ర నాకు నతతంబు వినంగ సభీష్టమెంతయున్.”

“అమలసువర్ణశృంగఖురమై కపిలంబగు గోశతంబు ను

త్త మబహు వేదబిప్రులకు దానముసేసిన తత్ఫలంబు
త
ధ్యమ సమకూరు భారతకథా శ్రవణాభిరతిన్
మదీయచి
త్తము వనిశంబు భారతకథాశ్రవణప్రవణంబ కావునన్.”
(ఆదిపర్వము- ప్రథమ 12,14,15)

దీనివలన రాజరాజనరేంద్రునకు భారత కథా శ్రవణమున అధికా సక్తి కలదనియు అతనివంశమున సర్వసద్గుణ శోభితులైన పాండవుల చరిత్ర విన కుతూహలము కలిగినదనియు భారతశ్రవణము కపిల గోశత దానములు చేయుటవలన కలుగు ఫలమును నొసంగజాలుననియు విశ్వసించెను.

ద్రోణుడు భరద్వాజ పుత్రుడు. కుంభంలో జన్మించాడు. అందుచేత అతనికి కుంభసంభవుడు అని పేరు కూడా కలదు. అతడు తండ్రి వద్ద సకలవిద్యలు అభ్యసించాడు. తండ్రి ఆదేశానిసారం సంతానార్థియై శరద్వతుని కుమార్తెయైన కృపిని వ్వాహమాడాడు. ఆతనికి పుత్రుడు పుట్టిన వెంటనే ఉచ్చైఃశ్రవం అను దేవతాశ్వం వలె గంభీరమైన స్వరంతో రోదించడం చేత అతనికి 'అశ్వత్థామ అని పేరు పెట్టాడు. ద్రోణుడు భార్యా పుత్రులతో ఆ ఆశ్రమంలోనే ఉంటూ ధనుర్విద్యలో చాలా పరిశ్రమ చేశాడు.

మహేంద్రపర్వతం మీద నివసిస్తున్న మహావీరుడూ, సకలాస్త్రవేత్త అయిన పరశురాముడు అందరికీ దానాలు చేస్తున్నాడని ద్రోణుడు శిష్యులతో కలసి మహేంద్ర పర్వతం చేరి, తన గోత్రనామాలు చెప్పుకుని పరశు రామునికి పాదాభివందనం చేశాడు. ధనార్థినై వచ్చానని కూడా చెప్పాడు. “ధనం అంతా దానం చేయడం అయిపోయింది. ఇంక నా శరీరము, అస్త్రవిద్య మాత్రమే మిగిలాయి. ఈ రెండింటిలో నీకేమి కావాలో కోరుకో” అన్నాడు పరశురాముడు.

శరీరమాత్రమేవాద్య మమేదమవశేషితమ్,
అస్త్రాణి చ మహార్హాణి శస్త్రాణి వివిధాని చ,
అస్త్రాణి వా శరీరం వా వరయైతన్మయోద్యతమ్.
(ఆదిపర్వం. 129.63.64)

అయితే నీ వద్ద ఉన్న అస్త్రవిద్యనంతా నాకు ప్రసాదించు అని ద్రోణుడు అభ్యర్థించగా పరశురాముడు సకలాస్త్రవిద్యలు అతనికి అనుగ్రహించాడు.

## అరణ్య పర్వం - బ్రాహ్మణ దానం :

వశిష్ఠుడు ఔర్వుని కథను తెలియచేస్తూ పూర్వం కృత వీర్యుడు అనే భూపతి ఉండేవాడు. అతడు భృగు వంశీయుల యాజ్యుడు. తన పురోహితులైన భృగు వంశీయులకు ఆ రాజు అత్యధికంగా ధనధాన్యాదు లిచ్చి వాళ్ళను సుసంపన్నులను చేశాడు.

కృతవీర్యుడు స్వర్గస్తుడయ్యాడు. ఆతని వంశానికి చెందినవారికి ధనం అవసరముంది. వాళ్ళు వెళ్ళి భృగువంశీయులను యాచించారు. అప్పటికే చాలమంది భృగువంశీయులు తమ ధనాన్ని ఇతరులకు దానం చేసేశారు. కొందరు అత్యధికమైన ధనాన్ని భూమిలో పాతి పెట్టారు.

ఒకనాడు భీమసేనుడు కరమృగాలను వధించడానికై అరణ్యంలో సంచరించుచుండగా అతనికి భయంకరమైన మహాసర్పం కనిపించింది. ఆ అజగరం హఠాత్తిగా వచ్చి మీద పడి భీముణ్ణి పట్టుకుంది. అది పట్టుకోగానే దానికి ఉన్న వరబలం చేత భీముడు స్పృహ కోల్పోయాడు. భీముణ్ణి వెతుకుతూ వచ్చిన యుధిష్ఠిరుడికి ఆ అజగరానికి మధ్య జరిగిన వాదనలో బ్రాహ్మణుడు ఎవరు? అన్న విషయంలో

బ్రాహ్మణః కో భవేద్రాజన్ వేద్యం కిం చ యుధిష్ఠిర,
బ్రవీహ్యతిమతిం త్వాం హి వాక్యైరనుమిమీమహే.
(వనపర్వం. 180.20)

“సత్యము, దానము, ఓర్పు, మంచి శీలము, క్రూరత్వము లేకపోవడము, తపస్సు, దయ ఇవి ఎవనిలో

ఉంటాయో, నాగేంద్ర! అతడు బ్రాహ్మణుడు. అని వివరణ ఇచ్చాడు యుధిష్ఠిరుడు.

నీ కంటే చాలా ముందు జనించిన చిరంజీవులెవరైనా ఉన్నారా? అని పాండవులు మార్కండేయుణ్ణి ప్రశ్నించారు. మార్కండేయు డిలా చెప్పాడు - ''ఇంద్ర ద్యుమ్నుడనే రాజున్నాడు. అతని కీర్తి క్షీణించిపోవడం చేత దేవతలు పంపివేయగా స్వర్గం నుండి భూలోకానికి వచ్చాడు. అతడు " నన్ను గుర్తు పట్టవా? అని నన్నడిగాడు. " మేం ఒక చోట ఉండకుండా తిరుగుతూంటాం. మేం చేసిన పనులే మాకు గుర్తుండవు" అని నేన్నన్నాను.

గుడ్లగూబను, కొంగను, ఉలూకాన్ని, తాబేలుని నన్ను గుర్తు పట్టావా అని అడగగా , తాబేలు " నేను ఈయనను గుర్తించకపోవడం ఏమిటి? ఈ ప్రాంతంలో ఈయన కొన్ని వేలసార్లు యజ్ఞాలు చేసి యూపస్తంభాలు పాతాడు. అతడు విడిచిన దానోదకాలు చేత ఈ సరస్సు ఏర్పడింది. అప్పటి నుండి నేను దీనితో సుఖంగా నివసిస్తున్నాను." అంది. కచ్ఛపం ఇలా అంటుండగానే దేవలోకం నుండి విమానం వచ్చి నిలిచింది. "ఇంద్రద్యుమ్నా! నీవు కీర్తి మంతుడవే. స్వర్గంలో నీకు నీ స్థానం భద్రంగా ఉంది. సుఖంగా అక్కడకు వెళ్ళి ఉండు" అను వాక్కు వినపడింది. ఇంద్రద్యుమ్నుని కథ విన్న యుధిష్ఠిరుడు "మహామునీ! ఏ అవస్థలో ఏ దానాలు చేయడంచేత మానవుడు ఇంద్రలోకానికి వెళతాడు చెప్పు" అని అడిగాడు. అప్పుడు ఆ ముని అనేక విధాలైన దానాలు, వాటిని ఇవ్వడానికి తగిన ప్రతిగ్రహీతలు, ఇవ్వ కూడనివారు, తపోవిధానాలు మొదలైన అనేక విషయాలు యుధిష్ఠిరునకు చెప్పాడు.

ఒకనాడు వ్యాసుడు పాండవులను చూడటానికై కామాక్య వనానికి వెళ్ళాడు. వాళ్ళ అభివాదన సత్కారాదులను స్వీకరించి "యుధిష్ఠిరునితో - "యుధిష్ఠిరా! తపస్సు చేస్తేనేగాని లోకంలో ఎవరూ మహా సుఖాన్ని పొందజాలరు. అని తపస్సు యొక్క గొప్పతనంతో పాటు దానం గొప్పతనాన్ని కూడా చెప్పెను.

పరిత్యజ్య ప్రియాన్ ప్రాణాన్ ధనార్థం హి మహామతే,
ప్రవిశన్తి నరా ధీరాః సముద్రమటవీం తథా,
కృషిగోరక్ష్యమిత్యేకే ప్రతిపద్యన్తి మానవాః
పురుష్యాః ప్రేష్యతామేకే నిర్గచ్ఛన్తి ధనార్థినః.

ఎంతో శ్రమపడి సంపాదించిన ధనాన్ని ఇతరులకు ఇవ్వడం అనేది చాల కష్టమైన పని. దానమంత చేయ శక్యం కాని పని మరొకటి లేదు. అందుచేత దానం చాల గొప్పది అని నా అభిప్రాయం.

తస్మాద్దుఃఖార్జితస్యైవ పరిత్యాగః సుదుష్కరః,
న దుష్కరతరం దానాత్ తస్మాద్దానం మతం మమ.
(వనపర్వం. 259.31)

అన్యాయంగా సంపాదించిన ధనంతో దాన ధర్మం చేసినవానిని ఆ దానం మహాభయం నుండి రక్షించ జాలదు.

అన్యాయాత్సముపాత్తేన దానధర్మో ధనేన యః,
క్రియతే న స కర్తారం త్రాయతే మహతో భయాత్.
(వనపర్వం.259.33)

దాన ప్రాశస్త్యాన్ని వర్ణిస్తూ వ్యాసుడు ముద్గలు డను బ్రాహ్మణుని కథ చెప్పాడు. ఆ బ్రాహ్మణుడు ఉంఛవృత్తితో (కళ్ళాలలో రాలి పడి ఉన్న ధాన్యపుగింజలు ఏరుకొని వాటితో మాత్రమే జీవించు విధానముతో) సకుటుంబంగా జీవిస్తూ తపస్సు చేసుకుంటుండేవాడు. అతనిని పరీక్షించుటకై దుర్వాసుడు ఉన్మత్తబ్రాహ్మణ వేషంతో వరసగా ఆరు దివాసాలు వచ్చి వారి అన్నం అంతా తినేసి వెళ్ళిపోయినా ముద్గలుని మనస్సులో ఏ మాత్రము వికారం కలగలేదు. దుర్వాసుడు అతనిని చాల ప్రశంసించి వెళ్ళిపోయాడు. (పుల్లెల శ్రీరామ చంద్రుడు, వనపర్వం, పుట.313)

కామక్యవనం వుండి ద్వైతవనం వచ్చి అక్కడ నివశిస్తిన్నారు పాండవులు. ఆ సమయంలో దప్పికతో బాధపడుతున్న పాండవులు నీరు కోసం వెతికారు. " మనం అందరం ఇప్పుడు ఆకలి, దప్పికతో బాధపడుతున్నాము.

ముందు ఉదకం కావాలి. ఈ చెట్టుపైకి ఎక్కి చుట్టుపక్కల చెరుబు గాని, నీటి ప్రక్క బాగా పెరిగే చెట్లు గాని కనపదు తున్నాయోమో చూడు" అని యుధిష్ఠిరుడు నకులునితో అన్నాడు. నకులుడు ఆ విధంగా చూసి- " దూరంగా ఉదకాశ్రితా లైన వృక్షాలు కనపడుతున్నాయిబీ నీటి పక్షుల కూతలు వినపడుతున్నాయి" అన్నాడు. నకులుడు శీఘ్రంగా వెళ్ళి నీళ్ళు త్రాగబోతుండగా- " నాయనా! సాహసం చెయ్యకు ఇది నా సొత్తుబీ నే నడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పిన తరువాతనే నీవు నీళ్ళు త్రాగాలి" అని అకాశవాణి వినపడింది. ఆ మాట లెక్కచేయకుండా నకులుడు నీళ్ళు త్రాగి క్రింద పడిపోయాడు. తరువాత సహదేవుడు, భీముడు, అర్జునుడు కూడా అలాగే వెళ్ళి త్రాగి పడిపోయారు. చివరకు యుధిష్ఠిరుడు వెళ్ళగా అతనికి కూడా అదే అకాశవాణి వినబడింది. అప్పుడు అది ఆకాశవాణి కది యక్షుడు అని గ్రహించాడు యుధిష్ఠిరుడు. అప్పుడు యక్షుడు కొన్ని ప్రశ్నలను యుధిష్ఠిరుడిని అడిగాడు. ఆ ప్రశ్మలలో కొన్ని:

మానం హిత్వా ప్రియో భవతి క్రోధం హిత్వా న శోచతి,
కామం హిత్వార్థవాన్ భవతి లోభం హిత్వా సుఖీ భవేత్.
(వనపర్వం-313.78)

ప్రశ్న : బ్రాహ్మణునికి దానం చేయడం ఎందుకు? నటనర్తకులకు దానం చేయడం ఎందుకు? భృత్యులకు దానం చెయ్యడం ఎందుకు? రాజులకు దానం చేయడం ఎందుకు?

కిమర్థం బ్రాహ్మణే దానం కిమర్థం నటనర్తకే,
కిమర్థం, చైవ భృత్యేషు కిమర్థం చైవ రాజసు.
(వనపర్వం-313.79)

**సమాధానం** : బ్రాహ్మణునికి దానం చేయడం ధర్మం కొరకు. నటనర్తకులకు దానం చెయ్యడం యశస్సుకోసం. భృత్యులకు దానం చేయడం వాళ్ళను పోషించడం కోసం. రాజులకు దానం చేయడం భయం కొరకు అని యక్షునకు యుధిష్ఠిరుడు సమాధనం చెప్పెను. (పుల్లెల శ్రీరామ చంద్రుడు, వనపర్వం, పుట.346)

సంస్కృత మాఘ కావ్యము నందు ధర్మరాజు రాజ సూయాగ సందర్భమున చేసిన దానాల గురించి ఈ విధంగా వర్ణించబడియున్నది.

"దర్శనానుపదమేవ కమతః స్వం వనీయక జనేస్ధికగచ్ఛతి
ప్రార్థనార్థ రహితం తదాభవస్ ద్దీయతామితి వచోస్తిసర్జనే "

ధర్మరాజు రాజసూయాంతమున దాన ధర్మముల నాచరించిన తీరును వర్ణించు సందర్భము లోనిదీ శ్లోకము. యాచకులెందరో వచ్చి యా మహారాజును చూచి యుజూడని దేవుడగ వారి వారి కోర్కెలను మించిన ధన కనకవస్తువాహనాదులను పొదుచుండగా "దీయతాం" అను క్రియ ప్రార్థనార్థమును వీడి కేవలము దానవిధి పరముగనే ప్రయుక్తమగుచుండెను. "దీయతాం" అనగా చేయబడుగాక యని అర్థము. ఈ ధాతువును యాచకుడు పయోగించినచో స్వసంప్రదానకమగు దాన క్రియను ప్రార్థించుచున్నాడని భావము. దాత ప్రయోగించినచో దానక్రియని విధించుచున్నాడని యవగతమగును. యాచకులు నోరు తెరిచియడుగ వలసిన యవసరము లేకుండగనే వారి మనోరథములు పరిపూర్ణములగు చున్నవని వర్ణించుటచే నీ క్రియ యాచపక్షమున ప్రార్థనార్థముతో ప్రయోగింపకబడక, కేవలము దాతృ పక్షమున నతిసర్జన విధ్యర్థముగనే ప్రయుక్తమగుచున్నదని, వితరణగుణ పరాకాష్ఠ సంపన్నముగ నుపశ్లోకితమైనది. ఈ సందర్భమున వచింపబడిన యిట్టి శ్లోక సముదాయ మున ధర్మరాజు నాశ్రయించిన దానవీరము చక్కగా పరిపుష్టమైనది.

**ఆధార గ్రంథాలు :**

1. డా॥సాగి కమలలాకర శర్మ దానం-విధానం వేద సంస్కృతి పరిషత్, హైదరాబాద్, 2013.
2. ఆంధ్ర మహాభారతము-ఉపదేశము, నందుల గోపలకృష్ణమూర్తి, కాకినాడ ప్రథమ ముద్రణ, 1982.
3. ప్రాచీనాంధ్ర శాసనాలు, డా॥ బూదరాజు రాధాకృష్ణ - ఆం.ప్ర.సా.అ., హైదరాబాద్, 1971.
4. రంగనాథ రామాయణం - గోనబుద్ధారెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం, 2015.
5. శబ్దార్థ రత్నాకరము, బాలసరస్వతీ బుక్ డిపో, కర్నూలు, 1972.
6. గరుడపురాణం, ఉచితగురుకుల విద్యా ఫౌండేషన్, 2014.

❖❖❖

ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

# పల్లిపట్టు నాగరాజు 'యాలై పూడ్సింది' కవిత – పరిశీలన

– జి. సరిత, పరిశోధకురాలు.

ఏ కాలంలోనైనా 'కవి' అనే వ్యక్తి సమాజంలోని విషయాలను తాను గమనించి తనలో తాను విశ్లేషించుకుని తనదైన శైలిలో రచన చేస్తాడు. ఎందుకంటే రచయితకు సమాజానికి అవినాభావ సంబంధం ఉంటుంది. ఎందుకంటే కవి కూడా సమాజంలో తిరిగే వ్యక్తి. అయితే కవికి సామాన్యమానవుడికి తేడా ఉంటుంది. సామాన్యమానవుడు ఏదైనా సంఘటన జరిగినపుడు దాన్ని చూసి స్పందించగలడు. కానీ కవి సమాజంలో తాను గమనించిన సంఘటనల పట్ల స్పందించి, తనలో ఇముడ్చుకొని, దానికొక కళాత్మకరూపమిచ్చి తనదైన, దృక్పథంతో రచన చేయగలడు. జీవితాన్ని కాచి వడబోసిన అనుభవం, కనుచూపుమేరలో కనిపించే అణచివేతను కూల్చాలనే ఆక్రోశంతో సామాన్య శ్రమజీవుల జీవన విధానాలను అక్షరాలుగా పేర్చి పల్లిపట్టు నాగరాజు రాసిన 'యాలై పూడ్సింది' అనే కవితా సంపుటికి 2022 లో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది.

పల్లిపట్టు నాగరాజు 1987, మే 22న రాఘవయ్య, భూలక్ష్మీ దంపతులకు తిరుపతి జిల్లా. సత్యవేడు మండలంలోని వెంకటాపురం గ్రామంలో జన్మించారు. 2016లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. పల్లిపట్టు నాగరాజు తెలుగు కవి, రచయిత, ఉపాధ్యాయుడు. నాగరాజు గారు రాసిన 'యాలై పూడ్సింది' వచనా కవితా సంపుటికి 2022 లో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది.

భయం మత్తులోనో, బాధల ఊబిలోనే చిక్కిన కాలాన్ని పిలిచి కుట్రలకు బుద్ధి చెప్పేందుకు 'యాలై పూడ్సిందని' పిలుస్తున్న నాగరాజుగారి కవిత్వంలోని ఆంతర్యాన్ని ప్రతి ఒకరు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అణచివేతను పారద్రోలడానికి, నిద్రపోతున్న యువతను మేలుకొలిపి చేతులు ముడుచుకు కూర్చున్న జనాలను యాలై పూడ్సిందంటూ పిలుస్తున్నాడు.

యాలై పూడస్తావుంది.
ఎంతకాలం ఈ ఏనుగులాట
కొన్నాలికిలో బెల్లం పూసుకొని
అంగిట్లో యిసంబెట్టుకొని
బలే మాట్లాడతా వుండారు కదబ్బా...
బలే బేలిపిస్తావుండారు గదయ్యా!
కాళ్లు తిమ్మిరెక్కేలా పిల్లకాయల్ని కూకోబెట్టి
నీతికోతలు కోస్తావుండారే..!
ఇంగులీసోడు యలబారి ఏండ్లు గడస్తావున్నా...
దుమ్మెత్తి పోస్తారే గానీ
దేశంలోపల దొరల సంగతేందీ..?
దేశమొదలి పోతున్న దొంగల కతేందీ..?
సెలవిస్తారా సామీ!

పల్లిపట్టు నాగరాజు సమాజంలోని వాస్తవాలను తన కవిత్వం ద్వారా కళ్ళకు కట్టినట్లు చూపించారు. మనుషుల నీచబుద్ధిని, కుటిల స్వభావాన్ని, మోసకారి తనాన్ని, సూటిగా ప్రశ్నించాడు. ఆంగ్లేయులు మన దేశాన్ని వదిలి వెళ్ళిపోయి చాలా సంవత్సరాలు గడుస్తున్న వారిని ఇప్పటికి నిందిస్తున్నారు కాని మన దేశంలోని పేదలను వేపుకు తింటున్న కీచకుల గురించి ఎప్పుడు ఆలోచిస్తారని తనకవిత్వంతో హెచ్చరిక చేస్తున్నాడు. కులాల పేరుతో ప్రజల గుండెల్లో కుంపటి రగిలిస్తున్న చీడపురుగుల సంగతేందని తన కవిత్వం ద్వారా ప్రజల్లో ఆలోచన రేకెత్తిస్తున్నాడు.

దేశాన్ని భారతమ్మని పిల్చుకుంటున్నామే...
ఈ దేశాన ఆడకూతుర్ల మానపేనాలు
చితికి బూడిదై పోతున్న అగత్త్యమేందీ...?
అంతో ఇంతో సదువుకున్నోళ్ళంతా...
కులాల పేరుతో
మతాల పేరుతో...
యీదులంతా పూనకమొచ్చి ఊగిపోతావుంటే...

తంటాలు పెట్టిన తోడేళ్లు...
బోగాలతో కులికే బంగళాల్లో
ముక్కలు తింటూనో
వక్కాకు నములుతూనో
పకపకాలాడతావుండే అన్నేకారిరోజుల్లో...

తలా ఇంత కూడుబెడుతూ...
కల్లాల్లో కుమిలి కుమిలి మగ్గిపోతున్న
మట్టిబతుకులెందీ...?

యవుడు కూడు వోడు తింటావుంటే...
కూటికుండ కాడా
కూరసట్టి కాడా...
కారుకూతలేంది... ఈ కత్తిగాట్లేందీ...
కాలమిట్టా కడతేరిపోవాల్సిందేనా...!?

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది కానీ భరతమాత ముద్దుబిడ్డలైన ఆడకూతుళ్ల మానమర్యాదలకు భద్రత ఎప్పుడు వస్తుందని సమాజం సిగ్గుతో తలదించుకొనేలా ప్రశ్నించాడు. సమాజాన్ని ఉద్ధరించవలసిన చదువు కున్నోళ్లంతా కులమతాలనే మద్యాన్ని తాగి, పూనకమొచ్చి వీధుల్లో ఊగిపోతున్నారు. ఆ తోడేళ్ల మత్తును వదిలించి బుద్ధి చెప్పడానికి 'యాలై పూడ్సింద'ని తన ఘాటైన కవిత్వంతో సమాజాన్ని సూటిగా పిలుస్తున్నాడు. తంటాలు పెట్టే తోడేళ్ళను తగలబెట్టడానికి, బంగళాల్లో భోగాలతో కులికే గుంటనక్కలను తరిమికొట్టడానికి 'యాలై పూడ్సిందని' సమాజాన్ని తట్టి లేపుతున్నాడు. నెత్తురు చెమటగా మారి ఒంటిని తడుపుతున్న కష్టజీవుల మట్టి బతుకుల్లో దీపం పెట్టడానికి 'యాలై పూడ్సింద'ని తన కవిత్వంతో అందరిని ఆహ్వానిస్తున్నాడు.

ఎవుడేడపోతే యాముండాదిలే
మీరు కోరుకున్నకొండమీదే వాన గురవాల
కయ్యల్లో
కాల్వల్లో
ఈదుల్లో
ఊళ్ళల్లో
మట్టి రగతం దేశబకిత్తై పారతావుంటే...
దేముడిరాగంలో దొంగభజన్లు సాగుతుండాల...

సాల్లే... సాల్లే...
పొద్దుమొలస్తావుంది
మీ మోసకారి పాటల్కి ఇంకా ఇంకా
మా మద్దెలవాయించలేం...

వారగాబోండప్పా
యాలై పూడ్సింది...
వాకిలి చిమ్మాలా...
కల్లాపు జల్లాలా...

పల్లిపట్టు నాగరాజుగారి దృష్టిలో వాకిలి చిమ్మటం, కల్లాపి చల్లడం అంటే సమాజంలోని వివక్షను, అణచి వేతను, మోసకారితనాన్ని తరిమికొట్టడం అని భావించ వచ్చు. శ్రమజీవులను కాల్చుకు తింటున్న రాజకీయ కీచకులను తరిమికొట్టడానికి యాలైపూడ్సిందంటూ ప్రజలందరికీ యెరుక చేస్తున్నాడు. సమకాలిన సమస్యలపై అవసరమైన ఆందోళన ప్రజలలో కలిగేవిధంగా తన కవిత్వాన్ని నిర్మించాడు. రాయలసీమ భాషా సోయగానికి చిత్తూరు నుడికారాన్ని జతచేర్చి ఊరి భాష మీద ఉన్న మమకారం ఉట్టిపడే విధంగా కవితాసంపద మనకందించారు. సమకాలీన సమస్యలపై అందరూ దృష్టి నిల్పి ఆలోచించే విధంగా కవిత్వాన్ని మనకు అందిం చారు.

## ఉపయుక్త గ్రంథాలు :

1. యాలై పూడ్సింది (కవితా సంపుటి) - పల్లిపట్టు నాగరాజు
2. ఆంధ్ర శబ్దరత్నాకరం - బహుజనపల్లి సీతారామాచార్యులు

❖❖❖

# పాటల బాటసారి 'గోరటి వెంకన్న'

- డా॥. బోయిన్‌పల్లి ప్రభాకర్, తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల (స్వ), నిజామాబాద్.

ఎక్కడ మనుష్యులుంటే అక్కడ సమస్యలుంటాయి
ఎక్కడ సమస్యలుంటే అక్కడ పోరాటముంటుంది
ఎక్కడ పోరాటముంటే అక్కడ పాట ఉంటుంది

ఆ 'పాట' గోరటి వెంకన్న అవుతాడు. 20వ శతాబ్దం ఆఖరి దశకంలో తన ఆట-పాటతో జనం ముందుకు వచ్చిన గోరటి వెంకన్న, 21వ శతాబ్దం తొలిదశకంలో మహాగాయకునిగా, సహజకవిగా-ఈ కాలపు మహాకవిగా తన్ను తాను 'పాట'కు పర్యాయపదంగా మలచుకున్నతీరు అద్భుతంగా తోస్తుంది. మరెంతో ఉదాత్తంగా అని పిస్తుంది.

పల్లెను చూస్తే పరవశమౌతాడు గోరటి వెంకన్న - పల్లె కూడా వెంకన్నను చూస్తే పాటల ఊటలా మారిపోతుంది. ప్రకృతితో మమేకమౌతాడు వెంకన్న- ప్రకృతి కూడా వెంకన్న పాటలో తనకు తానే కొత్తకొత్తగా పాడుకుంటుంది, ఆడుకుంటుంది కూడా. నిరంతర పరిణామశీలమైన ఈ ప్రపంచాన్ని నిశితంగా పరిశీలించే గోరటి వెంకన్న తన పాటలో తెలంగాణ పల్లెల వాస్తవ పరిస్థితుల్ని, శ్రామిక, దళిత, బహుజన కులాల ఆచార వ్యవహారాలను, మానవ సంబంధాలను, సంస్కృతిని - ఆ పల్లె ప్రజల భాషలో తనదైన పాటలో కళ్ళకు కట్టినట్లుగా ఆవిష్కరిస్తారు.

వెంకన్న కవిత్వంలోని వైశాల్యం అపరిమితం - అనంతం కూడా. పల్లెలు, ప్రకృతి, పట్టణాలు,ఉద్యమాలు, జీవితానికి సంబంధించిన సకల అంశాలు, తాత్వికపరమైన చింతనలతో కూడిన విలక్షణమైన బాట - వెంకన్నపాట. అందుకే వెంకన్న ఆడి పాడిన పాటలతో మనమందరం గొంతు కలుపుతున్నాం. అందులోని సంవేదనలకు తలలూపుతున్నాం.

ఉద్యమాల్లో పాల్గొనే వేళ వెంకన్న పదునెక్కిన పాటే అయ్యాడు. అప్పుడతని గొంతు కొత్త రాగాల్ని అందుకుంది. అతనికున్న నిశిత అవగాహన విశాలదృష్టినిచ్చింది. అప్పుడు పాటకున్న బలం - బలగం అర్థమైంది. ఇక పాటలో కవితాత్మక సౌందర్యం పెంపొందడానికి - తారాస్థాయిని అందుకోవడానికి తాను పుట్టి పెరిగిన నేల - తెలంగాణా మట్టి పాలమూరు జిల్లా స్వభావం, విస్తృతాధ్యయనం కారణాలుగా కనబడుతాయి.

ఎందరో కవులను పోషించి, తెలంగాణాలో సాహిత్య వికాసానికి పెద్దపీట వేసిన సంస్థానాల ఖిల్లా పాలమూరు జిల్లా. ఇక్కడి తెలకపల్లి మండలం గౌరారం పల్లెలో 4 ఏప్రిల్ 1964వ సంవత్సరంలో గోరటి నర్సింహ, ఈరమ్మలకు జన్మించిన పాటల ఊట గోరటి వెంకన్న. స్వతహాగా జానపద కళాకారుడైన తండ్రి మౌఖిక వాఙ్మయ వారసత్వాన్ని పునికిపుచ్చుకున్న వెంకన్న పాఠశాల దశలోనే తనదైన ముద్రవేస్తూ కీర్తనలు, పద్యాలు రాయటం; పాటలు పాడటం; ఏకపాత్రాభినయంతో పాటు రంగస్థల నాటకాలు వేయడాన్ని ఇష్టంగా అలవరుచుకున్నాడు. పాఠశాల విద్యను గౌరారం, రఘుపతిపేటలో పూర్తిచేసిన వెంకన్న కల్వకుర్తిలో ఇంటర్, జడ్చర్లలో 1985లో డిగ్రీ పూర్తిచేశాడు. హైదరాబాద్‌లోని ఆంధ్రసారస్వత పరిషత్ కళాశాలలో ఎం.ఏ.లో చేరిన కొద్దికాలంలోనే ఏ.పి.పి. ఎస్.సి. నిర్వహించిన గ్రూప్-4 పోటీ పరీక్షల్లో ఓపెన్ కేటగిరిలో 13వ ర్యాంకు సాధించి 1987లో నాగర్ కర్నూల్‌లో కో-ఆపరేటివ్ విభాగంలో జూనియర్ అసిస్టెంటుగా చేరి వివిధ పదోన్నతులు పొంది ప్రసుత్తం సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ అధికారిగా పనిచేస్తున్నారు.

పాఠశాల దశలోనే పరిచయమేర్పడిన వామపక్ష విద్యార్థి రాజకీయాలు, కళాశాల దశలో వెంకన్నను భాగస్వామిని చేసుకొని ఎన్నో కీలక బాధ్యతలను నిర్వహించేలా చేశాయి. 1987 తర్వాత ఎం.ఎల్. పార్టీలతో, పౌరహక్కుల ఉద్యమాలతో, విప్లవోద్యమాలతో, సాహిత్య

సాంస్కృతికోద్యమాలతో పరిచయం కాస్తా వెంకన్నను పదునెక్కిన పాటగా, అసలు పాటకు పర్యాయపదంగా దిద్దితీర్చింది. అటు తర్వాత వెంకన్న తిరిగి చూడలేదింక.... ఒక సమున్నత ఆశయంతో ఈ విశాల ప్రపంచాన్ని తనదైన నిశిత, తాత్విక దృష్టితో పరిశీలించే వెంకన్న మహాగాయకుడిగా, వాగ్గేయకారుడిగా గుర్తించబడ్డాడు. ఆయన నుండి అలవోకగా జాలువారిన పాటలే ఏకునాదం మోత, రేలపూతలు, అలసెంద్ర వంకలయ్యాయి. ఇటీవల ఆ పాటకు తెలంగాణా ప్రభుత్వం కాళోజీ సాహిత్య పురస్కారంతో పట్టాభిషేకం చేయడాన్ని గమనిస్తే ఉద్యమపాటకు ఒక సమున్నత స్థానాన్నిచ్చి గౌరవించినట్లైంది.

గోరటి వెంకన్న తనను కవిగా పిలవడాన్నే ఇష్ట పడతాడు. తన పాటల్లో ఉన్నదంతా కవిత్వమేనంటాడు. ఏకునాదం మోత పుస్తకంలో ప్రకృతితో మమేకమైన వెంకన్నను ప్రకృతి కవిగా పిలిస్తే దాన్ని ఒక అద్భుతంగా స్వీకరిస్తాడు. ప్రకృతి పచ్చదనం తన పాటకు పత్ర హరితంగా భావిస్తాడు. ప్రకృతిని అర్థం చేసుకోవడం, ప్రకృతిలో ఉన్నదాన్ని ఉన్నట్లుగా అర్థం చేసుకోవడం మరియు ప్రకృతి రహస్యాన్ని అర్థం చేసుకోవడాన్ని ఆధునికతగా చెప్తాడు. ప్రకృతిని ధ్వంసంచేసి; ప్రకృతికి, ప్రకృతిలో భాగమైన మనుషులందరికి సంకటంగా మార్చేది అభివృద్ధి, ఆధునికతలు కావంటాడు. అర్థరహితమైన ఆధునికతకు వ్యతిరేకి గోరటివెంకన్న.

'గోరెంక పిట్టల సవ్వడేమాయె / రంగు పాలపిట్ట ఏ రాజ్యమెల్లె /
కొంగబావల నింగి బారులేమాయె / పలికేటి సిలకల అలికిడేమాయె /
గంతులేసే జింక గుంపులేమయిపాయె / కుందేలు మందల పరుగు పంద్యాలేవి....'

అనే ప్రశ్నల్లో ప్రకృతిపై మనిషి స్వచ్ఛందంగా ఆధిపత్యాన్ని వదులుకోవాలని, అలా చేస్తేనే ప్రకృతి సమతుల్యత ఏర్పడుతుందని వెంకన్న పాట మనల్ని ప్రకృతిలోకి పయనించేలా చేస్తుంది.

'కిరీటమేమో భారమై వున్నది / కిందేసితే నడక భలె వున్నది /
చెప్పులు లేకున్న మేలన్నయి / ముండ్లు తుప్పలేవొ తెలిసి తెలిసి పోతున్నవి/
కాలిమట్టికేదొ మహిమున్నది / తేళ్ళు పురుగులు తొలగిపోతున్నవి'

అని వెంకన్న - మనుష్యులు తమ స్వార్థాన్ని వదులుకొని ప్రకృతికి లోబడి, ఇంకా చెప్పాలంటే ప్రకృతితో మమేకమై జీవించమంటాడు.

'పల్లే కన్నీరు పెడుతుందో /
కనిపించని కుట్రలో - తల్లీ బందీయై పోతుందో /
కుమ్మరి వాముల తుమ్మలు మొలిసెను / కమ్మరి కొలిమిలో దుమ్ము పేరెను /
పెద్ద బారిశ మొద్దు వారినది / సాలెల మగ్గం సడుగులిరిగినవి /
చేతివృత్తుల చేతులిరిగిపోయే నా పల్లెల్లోనా /
*గ్రామస్వరాజ్యం గంగలోన పాయే నా పల్లెల్లోనా'*
॥ పల్లే కన్నీరు ॥

గోరటి వెంకన్న పేరు చెప్పగానే చాలామందికి గుర్తుకు వచ్చేపాట ఇదే. గ్లోబలైజేషన్‌కు వ్యతిరేకంగా వచ్చిన పాటల్లో దీనిదే అగ్రతాంబూలం. 1997లో రాసిన ఈ పాటలో మొత్తం 19 చరణాలున్నాయి. గ్లోబల్ విధ్వంసంలో నేటి పల్లెల దుస్థితిని దృశ్యమానం చేసిన ఈ పాట ఒక మహాకావ్యానికున్నంత గౌరవాన్ని పొందింది. నేటి పల్లెల్లో వచ్చిన వేగవంతమైన మార్పులు, శతాబ్దాలుగా నడుస్తున్న సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు గ్లోబల్ విధ్వంసానికి గురికావడం; వాటితోపాటు మానవ సంబంధాలు అడుగంటిపోవడం లాంటి వర్తమాన జీవన విధ్వంస విషాదాన్ని నిక్షిప్తం చేసిన ఈ పాటకు నేపథ్యంగా రఘుపతిపేట గ్రామాన్ని సజీవ సాక్ష్యంగా చూపిస్తారు. పల్లెలు మారి గుడిసెల స్థానంలో భవంతులు వచ్చినా, ఆ ఇళ్ళలో దీపం పెట్టడానికి ముసలివారు తప్ప

మనుషులే లేరని, పదిమంది ఇళ్ళు కడితే ఎనిమిది మంది పల్లెను విడిచి, చేస్తున్న వృత్తులను వదిలేసి బతుకుతెరువు వెదుక్కుంటూ వలసపోయారు. రఘుపతిపేట ఒక్కటేకాదు, పల్లెల అవస్థ అన్నిచోట్లా ఇంతే కదా! అనే దాంట్లో వెంకన్న ఆవేదన, ఆక్రోశం మనకు స్పష్టంగా కనిపిస్తాయి.

'వాగు ఎండిపాయెరో / పెదవాగు తడిపేగు ఎండిపాయెరా/
అందాల దుందుభి అలసెంద్రవంక / జలమెరుపుతీగ తడి పరుపుబండ/
ఆరుగాలం పారే వాగుల/ ధారసైతంలేక ఎండె....'

అనే వెంకన్న పాట విన్నప్పుడు మన గుండె చెరువవుతుంది. తానుచూసిన, ఈదులాడిన, నీటి జలతారులతో, ప్రవాహాలతో కళకళలాడిన దుందుభివాగు ఎండిపోవడంతో పట్టరాని దు:ఖానికి లోనైన వెంకన్న గొంతునుండి జాలువారిందీపాట.

'సంచారమే ఎంతో బాగున్నది / దీనంత ఆనంద మేడున్నది /
ఇల్లు పొల్లులేని ముల్లెమూటలేని / వెంబడించే వెర్రి జ్ఞాపకాలు లేని....'

అనే 'సంచారం' పాటను గమనిస్తే జనజీవనంలో ఉంటూ అన్ని బంధాల్లో చిక్కుకుని, అనుభవిస్తూ కూడా - తామరాకు మీది నీటిబొట్టు చందంగా - ఒక బైరాగి తత్త్వంతో జీవితాన్ని దర్శించడం, అనుభవించడం, అది చిక్కనైన పాటగా రూపాంతరం చెందడం గోరటి వెంకన్న లోని విశిష్ట లక్షణంగా చెప్పవచ్చు. సంచారమంటే కాళ్ళతో తిరగమని కాదు. ఎవరైనా ఒక్కచోట ఆగకూడదు. నిరంతర చలనశీలమైన జగత్తులో నిరంతరం ప్రయాణించాలి. ఆలోచనలు ప్రయాణించాలి. ఆసక్తులు ప్రయాణించాలి. మార్క్సిజం, స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీ వాదం ఇవన్నీ ప్రయాణాలేనని, అవి ఆగిపోవద్దని, చలనశీలంతో మనిషి నిత్యసంచారం చేయాలంటాడు వెంకన్న. అలా అనడమే కాకుండా పాటల ప్రవాహమే అయ్యాడు.

గోరటి వెంకన్న - ఒక కదులుతున్న పాటల ఇంద్ర ధనుస్సు అని కె.శివారెడ్డి అభివర్ణించడాన్ని నూటికి నూరుపాళ్ళు సజీవ సత్యంగా పేర్కొనవచ్చు. ప్రకృతితో పెనవేసుకున్న - శ్రమతో అల్లుకుపోయిన జనజీవన దృశ్యాన్ని వెంకన్న పాటలు అలా అలలు అలలుగా కదుపుకుంటూపోతాయి. మనకు తెలిసిన మనుష్యులు -పని పాటలు చేసుకునేవాళ్ళు, ఊళ్ళు - ప్రదేశాలు, చెట్టు - చేమలు, పొలాలు - కాలువలు, మెట్ట ప్రాంతాలు - కరువు బతుకులు ఇలా అన్నిటికీ జీవంపోసి తనపాటలో నింపుకుంటాడు. దేన్నీ వదలడు. ఇతరులు చూడని కోణంలో దర్శిస్తాడు. సమస్త ప్రపంచం తన పాటల్లో ఇమిడి పోవాల్సిందే. పాటకు నిలువెత్తు కళారూపం గోరటి వెంకన్న. జానపద కళాకారుని కంటె ఒక ఆధునిక వాగ్గేయకారుడే వెంకన్నలో మనకు దర్శనమిస్తాడు. అందుకే ఒక బైరాగిలాగా, భక్తకవిలాగా, తాత్త్వికునిలాగా తన పాటలద్వారా లోకాన్ని మేల్కొల్పడం ఆయన పాటల్లోని విశిష్టతగా చెప్పవచ్చు. కలేకూరి ప్రసాద్ ఓ సందర్భంలో... 'గోరటి ఎంకడు బతికున్న కాలంలోనే మనం పుట్టినందుకు గర్వపడాలి. వాడొక బైరాగి, వాడొక పాటల చనుబాలు, వాడొక నిర్లక్ష్యపు బాటసారి, కుపిత ఆకాశనేత్రంలోని ఎర్రని జీర గోరటి వెంకన్న' అని పల్కిన మాటలు అక్షర సత్యాలు.

**ఆధార గ్రంథాలు :**

1. గోరటి వెంకన్న 'అల సెంద్రవంక'
2. గోరటి వెంకన్న 'రేలపూతలు'
3. గోరటి వెంకన్న 'ఏకునాదం మోత'
4. తెలంగాణ ఉద్యమాలు - పాట - సి.కాశీం
5. తెలంగాణ సాహిత్య విమర్శ - డా.యాకూబ్
6. పాలపిట్ట - ఏప్రిల్ 2010 మాసపత్రిక

❖❖❖

